


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 228

బుధవారం 3-5-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మళ్లీ భారత్‌కు టాప్ ర్యాంక్
టెస్టు ర్యాంకింగ్స్ విడుదల చేసిన ఐసీసీ.. రెండో స్థానంలో ఆసీస్ - 12లో



'గో ఫస్ట్' దివాలా
దేశీయంగా సంక్షోభంలో చిక్కుకున్న మరో విమానయాన సంస్థ - 13లో



బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తాం
కర్ణాటకలో అధికారంలోకి వస్తే బజరంగ్‌దళ్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాపై నిషేధం విధిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.
వివరాలు 6లో ▸



హనుమపై అంత ద్వేషమా?
బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ హామీపై ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. హనుమపై అంత ద్వేషమెందుకని ప్రశ్నించారు.
వివరాలు 6లో ▸



తిహార్ జైల్లో గ్యాంగ్‌స్టర్ హత్య
ఢిల్లీలోని తిహార్ జైలులో ఒక ముఠా ఖైదీలు జరిపిన దాడిలో గ్యాంగ్‌స్టర్ టిల్లు తాజ్‌పురియా అలియాస్ సునీల్ హతమయ్యాడు.
వివరాలు 6లో ▸



గాంధీజీ మనవడు కన్నుమూత
మహాత్మాగాంధీ మనవడు, సామాజిక కార్యకర్త అరుణ్ మణిలాల్ గాంధీ (89) మంగళవారం కొల్హాపూర్‌లో కన్నుమూశారు.
వివరాలు 6లో ▸

గేమ్ ఛేంజర్.. ఆర్బీకే

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం కొత్తపుంతలు

నీతి ఆయోగ్, యూఎన్‌డీపీ ప్రశంసలు

- రైతుల అవసరాలన్నీ తీర్చే ఏకైక వేదిక.. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు
- ఈక్రాప్ నమోదు, యాంత్రీకరణ, ఉచిత పంటల బీమా
- శాస్త్రవేత్తల శిక్షణలు, ఫీల్డ్ డయాగ్నస్టిక్ సందర్శనలు
- పోస్టర్లు, కరపత్రాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం
- విత్తనం నుంచి విక్రయం వరకు అన్నిరకాల సేవలు
- అధిక దిగుబడులు సాధించడంలో కీలక పాత్ర.. ఇలా సేవలు అందించడం దేశంలోనే తొలిసారి



సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019లో ప్రారంభించిన డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) వ్యవసాయ రంగంలో సమూల మార్పులు తీసుకువస్తున్నాయని నీతి ఆయోగ్, యూఎన్‌డీపీ (యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) ప్రశంసించాయి. అధిక దిగుబడులు సాధించేలా, రైతుల సాగు సమస్యలన్నింటికీ ఒకే చోట పరిష్కారం చూపిస్తూ 'వ్యవసాయం'లో గేమ్ ఛేంజర్‌గా కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడాయి. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో సామాజిక రంగాల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి.. నీతి ఆయోగ్, యూఎన్‌డీపీ తాజాగా ఓ సంయుక్త నివేదికను విడుదల చేశాయి. ప్రధానంగా రైతుల ఇబ్బందులు తీర్చడానికి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఆర్బీకేల ద్వారా అన్నదాతలకు సరైన సమయంలో సరైన సలహాలు అందుతున్నాయని.. ఇది ఆహ్వానించదగిన పరిణామమని ఈ నివేదిక కొనియాడింది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం అత్యంత ముఖ్యమైన రంగాల్లో
మిగతా 2వ పేజీలో ▶

"ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయ రంగంలో విప్లవాత్మకం. రైతు కష్టాలన్నింటికీ వన్ స్టాప్ సొల్యూషన్‌గా నిలుస్తున్నాయి. విత్తనం మొదలు పంట కొనుగోలు వరకు అన్నదాతల చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి. నాణ్యమైన పురుగు మందులు, ఎరువుల సరఫరా.. పంటల సాగుపై అధునాతన శిక్షణ, సాంకేతికత వినియోగం, యాంత్రీకరణ.. తదితర విధానాలతో సాగు రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. ఇప్పటికే వివిధ రాష్ట్రాలు ఆర్బీకేల పనితీరును స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించాయి. లక్షలాది మంది రైతులకు సాగును లాభసాటిగా మార్చడంలో ఆర్బీకేల పాత్ర కీలకం.
- సంయుక్త నివేదికలో నీతి ఆయోగ్, యూఎన్‌డీపీ

'భోగాపురం' భూమి పూజ నేడే

ఉత్తరాంధ్రకు సీఎం జగన్ నాలుగు వరాలు.. చిరకాల ఆకాంక్షలు సాకారం

- రూ.4,592 కోట్లతో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం
- విశాఖలో రూ.21,844 కోట్లతో వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్ (అదానీ)
- తారకరామ తీర్థ సాగరం పనులకు రూ.194.40 కోట్లతో శంకుస్థాపన
- రూ.23.73 కోట్లతో చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం
- నేడు భోగాపురం మండలం సవరవిల్లి వద్ద సీఎం జగన్ బహిరంగ సభ


విమానాశ్రయం నమూనా

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్రకే తలమానికమైన భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం భూమి పూజ చేయనున్నారు. దీంతోపాటు విజయనగరం జిల్లాలో మరో రెండు కీలక ప్రాజెక్టులతోపాటు విశాఖలో రూ.21,844 కోట్లతో అదానీ గ్రూప్ నిర్మించే
మిగతా 2వ పేజీలో ▶

తడిసిన ధాన్యం కొనుగోలుకు సీఎం జగన్ ఆదేశం

- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకొనేందుకు చర్యలు
- దెబ్బతిన్న పంటల ఎన్యుమరేషన్ త్వరగా పూర్తి చేయండి
- వైఎస్సార్ రైతుభరోసాతో పాటు పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ
- అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు

2లో

న్యూస్‌రీల్

ఏసీబీకి చిక్కిన సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్



కర్నూలులోని డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పి.సుజాత ఇల్లు, బంధువుల నివాసాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. రూ.1.80 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు.
వివరాలు 14లో ▸

'పాలు'పోకనే విషం!



ఫ్యాక్ట్ చెక్

టీడీపీ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార లోపం ఉన్నవారికే అరకొరగా పాలు పంపిణీ చేయగా.. వైఎస్ జగన్ ప్రభుత్వం నాణ్యతలో రాజీ లేకుండా అందరికీ పాలను అందిస్తోంది. అయినా కూడా 'ఈనాడు' మరో తప్పుడు కథనంతో విషం చిమ్మింది.
వివరాలు 2లో ▸

థాయ్‌లో పేకాట.. హైదరాబాద్ నుంచి ఫైనాన్స్



థాయ్‌లాండ్‌లోని అక్రమ క్యాసినోలో చీకోటి ప్రవీణ్ సహా 84 మంది భారతీయుల అరెస్టుకు సంబంధించి అక్కడి పోలీసులు స్పష్టత ఇచ్చారు. గత నెల 27 నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు రూ.50 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు తేల్చారు.
వివరాలు 3లో ▸

చంద్రబాబువి రాజకీయ శంకుస్థాపనలు



చంద్రబాబు సీఎంగా ఉండగా రాజకీయ లబ్ధి కోసమే శంకుస్థాపనలు చేశారని.. 2019 ఎన్నికల నోటిఫికేషన్‌కు నెల ముందు రామాయపట్నం పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు.
వివరాలు 14లో ▸

జోరుగా వానలు

అనకాపల్లి, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తిరుపతి జిల్లాల్లో ఎక్కువ సగటు వర్షం

- తిరుపతి జిల్లా నారాయణవనంలో అత్యధికంగా 103 మి.మీ. వర్షపాతం
- రాబోయే రెండ్రోజులు ఇంకా విస్తృతంగా కురిసే అవకాశం
- ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావమే కారణం


ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. వానాకాలాన్ని తలపించేలా అన్ని ప్రాంతాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. గడచిన 24 గంటల వ్యవధిలో తిరుపతి జిల్లా నారాయణవనంలో అత్యధికంగా 103.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తిరుపతి జిల్లా దొరవారిసత్రంలో 96.2, సూళ్లూరుపేటలో 88.4, కుమార వెంకట భూపాలపురంలో 87.8, పెళ్లకూరులో 74.8, గూడూరులో 73.2, పుత్తూరులో 67.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరంలో 92.2, ముమ్మిడివరంలో 85.4, కాకినాడ జిల్లా తాళ్లరేవులో 91 మి.మీ. వర్షం పడింది. ఇక సోమవారం ఉ.8.30 గంటల నుంచి మంగళవారం ఉ.8.30 గంటల వరకు అనకాపల్లి జిల్లాలో సగటున 36.11 మి.మీ.
మిగతా 2వ పేజీలో ▶

మరో 3 రోజులు వర్షాలు, పిడుగులు

మరో మూడ్రోజులు పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో బుధవారం అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశమున్నట్లు ఆయన తెలిపారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

ఇంటర్ ప్రత్యేక తరగతులు ప్రారంభం

ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రభుత్వం చర్యలు


- 21 రోజులపాటు తరగతులు
- ఇంప్రూవ్‌మెంట్ రాసే విద్యార్థులకూ అవకాశం
- మధ్యాహ్నం భోజనం ఏర్పాటు
- విద్యార్థుల సంఖ్యను బట్టి రెసిడెన్షియల్ శిక్షణ కూడా
- బాలికలకు కేజీబీవీల్లో వసతి
- సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు చివరి తేదీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతూ ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వారికోసం ప్రత్యేక శిక్షణ తరగతులు (రెమిడియల్ శిక్షణ)కు శ్రీకారం చుట్టింది. వీరందరికీ ఈ నెల 21 వరకు (21 రోజులపాటు) తరగతులు నిర్వహించి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయనుంది. సోమవారం నుంచి ప్రారంభమైన శిక్షణకు విద్యార్థుల సంఖ్యను అనుసరించి అధికారులు ఏర్పాట్లు చేశారు. మూడు సబ్జెక్టుల లోపు ఫెయిలైన వారికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, అంతకంటే ఎక్కువ సబ్జెక్టులు పోయినవారికి సాయంత్రం వరకు తరగతులు నిర్వహించేలా ఇంటర్ బోర్డు చర్యలు తీసుకుంది. రెండు షిఫ్టుల్లో తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా అందిస్తారు. తరగతుల నిర్వహణ, కాలేజీలను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రెసిడెన్షియల్ తరహా శిక్షణపై కూడా అధికారులు దృష్టి సారించారు. విద్యార్థుల ఆసక్తి మేరకు డివిజనల్ కేంద్రాల్లో హాస్టల్ వసతి కల్పించి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

ఫెయిలైన బాలికలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన బాలికలకు కూడా రెసిడెన్షియల్ శిక్షణ అందించడానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారికి పూర్తి రక్షణ వాతావరణం ఉండే
మిగతా 2వ పేజీలో ▶



పవార్ అస్త్రసన్యాసం

ఎన్సీపీ చీఫ్‌గా తప్పుకుంటున్నట్టు ప్రకటన

పార్టీలో కలకలం..
నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ కార్యకర్తల ఆందోళన
రెండు రోజుల్లో పునరాలోచన: ఎన్సీపీ నేత అజిత్ పవార్

"1960లో మొదలైన నా రాజకీయ జీవితం 63 ఏళ్లుగా నిర్విఘ్నంగా కొనసాగుతూ వస్తోంది. ఇక తప్పుకోవాల్సిన సమయం వచ్చింది. విద్య, వ్యవసాయం, క్రీడలు, సంస్కృతి తదితర రంగాల్లో యువత, విద్యార్థులు, దళితులు, గిరిజనులు తదితరులకు సేవ చేయాలనుకుంటున్నా. రాజ్యసభ సభ్యునిగా నాకు మిగిలిన మూడేళ్ల పదవీకాలంలో మహారాష్ట్రకు, దేశానికి సంబంధించిన అంశాలపై దృష్టి పెడతా. పార్టీలో ఇక ఎలాంటి పదవీ స్వీకరించబోను.
- ఎన్సీపీ నేత శరద్ పవార్

6లో



విశ్వనగరంలో వెలుగు రేఖలు

విశాఖలో అత్యాధునికంగా విద్యుత్ వ్యవస్థ

ఆర్థిక నగరం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా భూగర్భ కేబుళ్లు

- తుపాన్లు వచ్చినా సరఫరా నిలిచిపోకుండా రూ.925 కోట్లతో నిర్మాణం
- 80,529 కనెక్షన్లు ఇప్పటికే భూగర్భ వ్యవస్థ పరిధిలోకి
- సర్వీసులు ఎన్ని పెరిగినా తట్టుకునేలా సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు
- మూడు నెలల్లోనే 421 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- సర్క్యూట్ బ్రేకర్లతో ప్రాణ, ఆస్తి నష్టాలకు అడ్డుకట్ట
- వ్యవస్థను ఆధునీకరించేందుకు రూ.1,722.02 కోట్లు వ్యయం

(విశాఖపట్నం నుంచి సాక్షి ప్రతినిధి బోణం గణేష్)

ఏదైనా ఒక రాష్ట్రం, ప్రాంతం ఆర్థిక స్థితిని అంచనా వేయడంలో విద్యుత్ వినియోగం కీలక పాత్ర పోషిస్తుంది. విశ్వ నగరంగా మారిన విశాఖ ఆర్థిక రాజధానిగా బలంగా ఎదిగేలా విద్యుత్ వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది. భారీ పరిశ్రమలు, ఐటీ పార్కులు, డేటా సెంటర్లు, హోటళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, మాల్స్, ఆస్పత్రులు, ఇతర వాణిజ్య కార్యకలాపాల కోసం నిరంతరం, నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా విశాఖలో అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగని విధంగా భూగర్భం నుంచి కేబుళ్ల ద్వారా విద్యుత్ పంపిణీ కానుంది. పారిశ్రామికవేత్తలు, పర్యాటకులను ఆకర్షించడంతోపాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా
మిగతా 3వ పేజీలో ▶


విద్యుత్ కాంతులతో విశాఖ బీచ్ రోడ్డు



బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేశాకే బరిలోకి..

భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేసే వరకు.. విదేశీ టోర్నీల్లో పాల్గొనబోమని భారత రెజ్లర్లు బజరంగ్, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ తెలిపారు.
- వివరాలు 10లో

జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్‌కు
రేపు తుది గడువు



సాక్షి, హైదరాబాద్: ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్–2023కు రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 4న ముగియనుంది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు పరీక్ష ఫీజును ఈ నెల 5లోగా చెల్లించాలి. ఈ మేరకు సమాచార బులెటిన్‌ను ఐఐటీ గౌహతి విడుదల చేసింది. జూన్ 4న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించనుంది. గత నెలలో జరిగిన జేఈఈ మెయిన్ పరీక్షలో 2.5 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో 16 వేల సీట్లు ఉన్నాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. జూన్ 18న ఫైనల్ కీతోపాటే ఫలితాలు విడుదల చేస్తారు. మెయిన్ ద్వారా అడ్వాన్స్‌డ్‌కు 2.5 లక్షల మంది అర్హత సాధిస్తున్నా, పరీక్ష రాసేవాళ్లు మాత్రం 1.5 లక్షల మందే ఉంటున్నారు. ఈసారి మెయిన్‌కు ఎక్కువ అప్లికేషన్లు వచ్చాయి. కోవిడ్ తర్వాత పరిస్థితులు చక్కబడటంతో ఎక్కువమంది దరఖాస్తు చేశారు. దీన్నిబట్టి అడ్వాన్స్‌డ్‌కు కూడా దరఖాస్తులు పెరిగే వీలుందని భావిస్తున్నారు.



ఏలూరులో బి.లక్ష్మణరావు అనే లబ్ధిదారుకు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీర్ ఎస్.అనిత



విజయవాడ కృష్ణలంకలో మల్లెల సీతారావమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రెటరీ కొల్లాటి అజయ్ బాబు, వార్డు వలంటీర్ బొర్ర ఫణి శివకుమార్



విశాఖ జిల్లా ఆరిలోవలో అర్జునమ్మకు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీర్ యోగేంద్ర

93.97% పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా రెండోరోజు మంగళవారం కూడా వర్షంలోనే జోరుగా పింఛన్ల పంపిణీ కొనసాగింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను నగదు అందజేశారు. మంగళవారం సాయంత్రం వరకు మొత్తం 59,45,154 మందికి రూ.1,641.35 కోట్లు పంపిణీ చేశారు. 93.97 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయిందని, మరో మూడురోజులు వలంటీర్లు పంపిణీ చేస్తారని సెర్ప్ అధికారులు చెప్పారు.



కర్నూలు జిల్లా హొళగుందలో సుంకమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ అల్తాఫ్



నెల్లూరు పత్తేఖాన్‌పేటలో మునీంద్రకు పింఛను అందజేస్తున్న వలంటీర్ చాంద్‌నీ



ఒంగోలు నగరంలోని వడ్డెపాలెంలో తన్నీరు నాగరత్నంకు పింఛను అందజేస్తున్న వలంటీర్ మరియమ్మ

మదనపల్లి బీటీ కళాశాలకు పూర్వ వైభవం
వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే నవాజ్ బాషా



బీటీ కళాశాల విషయంపై సీఎం వైఎస్ జగన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్ బాషా, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్

సాక్షి,అమరావతి: మదనపల్లిలోని బీటీ కళాశాలకు తిరిగి పూర్వపు రోజులు రాబోతున్నాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే నవాజ్ బాషా పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. మదనపల్లిలోని బీటీ కళాశాల మూతపడే స్థాయిలో ఉందని తెలిపారు. బీటీ కళాశాలలో అనేక మంది ప్రముఖులు విద్యను అభ్యసించారని, ఘన చరిత్ర కల్గిన కళాశాలను మూతపడనివ్వబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చామని చెప్పారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కళాశాల యాజమాన్యంతో మాట్లాడారని, ఆ కళాశాలను ప్రభుత్వానికి అప్పగించేందుకు కళాశాల యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. కళాశాల తెరిపించే విషయమై సీఎం వైఎస్ జగన్‌ను కలసి మాట్లాడామని, మా విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. బీటీ కళాశాలను యూనివర్సిటీ చేస్తామని సీఎం వైఎస్ జగన్ మాకు హామీ ఇచ్చారని ఆయన వివరించారు.

‘భోగాపురం’ భూమి పూజ నేడే

▶ మొదటి పేజీ తరువాయి

వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్‌కు సీఎం జగన్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగనున్నాయి. రూ.4,592 కోట్లతో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణం కానుండగా ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చి సమగ్రాభివృద్ధికి బాటలు వేసేలా వైజాగ్ టెక్ పార్కు రూపుదిద్దుకోనుంది. ముఖ్యమంత్రి జగన్ నేడు విజయనగరం, విశాఖ జిల్లాల్లో పర్యటించి పలు కార్యక్రమాలకు శంకుస్థాపనతోపాటు భోగాపురం మండలం సవరవిల్లి వద్ద నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భోగాపురం మండలంలోని ఎ.రావివలస వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను, సవరవిల్లి వద్ద బహిరంగ సభ వేదికను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురామ్, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, కలెక్టర్ నాగలక్ష్మి, డీఐజీ హరికృష్ణ, ఎస్పీ దీపిక మంగళవారం పరిశీలించారు.

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం

విశాఖ ఎయిర్‌పోర్టుకి ప్రత్యామ్నాయంగా అత్యాధునిక సౌకర్యాలతో భోగాపురం మండలంలో 36 నెలల్లో నిర్మించే అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి సీఎం జగన్ భూమిపూజ చేస్తారు. దాదాపు 2,203 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,592 కోట్ల వ్యయంతో జీఎంఆర్ విశాఖ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ దీన్ని నిర్మిస్తోంది. 3.8 కిలోమీటర్ల పొడవైన రన్‌వేతో పాటు దేశీయ, అంతర్జాతీయ రవాణాకు దోహదపడేలా కార్గో టెర్మినల్ ఇక్కడి ప్రత్యేకత. తొలి దశ నిర్మాణమే ఏటా 60 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఉంటుంది. అనంతరం ఏటా 1.8 కోట్ల మంది ప్రయాణించే విధంగా దశలవారీగా సౌకర్యాలను విస్తరిస్తారు.

రూ.21,844 కోట్లతో వైజాగ్ టెక్‌పార్క్

అదానీ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.14,634 కోట్లతో మధురవాడలో 200 మెగావాట్ల ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్, టెక్నాలజీ, బిజినెస్ పార్క్ ఏర్పాటు కానుంది. త్వరలో రూ.7,210 కోట్లతో కాపులుప్పాడలో మరో 100 మెగావాట్ల ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్, టెక్నాలజీ, బిజినెస్ పార్క్‌లను అభివృద్ధి చేస్తారు. తద్వారా 39,815 మందికి ప్రత్యక్షంగా, మరో 10,610 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టు

విజయనగరం జిల్లాలో 24,710 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చంపావతి నదిపై 2005లో దివంగత సీఎం వైఎస్సార్ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి నాంది పలికారు. ఆయన హఠాన్మరణంతో ఈ ప్రాజెక్టు పనులు మందగించాయి. పెండింగ్ పనులను రూ.194.90 కోట్లతో పూర్తి చేసేందుకు సీఎం జగన్ సంకల్పించారు. పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాల్లోని 49 గ్రామాల ప్రజలకు తాగునీరు, 24,710 ఎకరాలకు సాగునీటితో పాటు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన నీటిని అందించడం లక్ష్యంగా తారకరామ ప్రాజెక్ట్ చేపట్టారు. 2024 డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు.

చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్

విజయనగరం జిల్లాలోని వేలాదిమంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు చేస్తూ పూసపాటిరేగ మండలం చింతపల్లి సముద్ర తీరంలో రూ.23.73 కోట్ల వ్యయంతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం కానుంది. అన్ని కాలాల్లో సముద్రంలో చేపలు వేటాడేందుకు వెసులుబాటు కలగనుంది. తుపాన్ల సమయాల్లో సురక్షితంగా ఒడ్డుకు చేరేందుకు, అలల తాకిడికి పడవలు దెబ్బ తినకుండా లంగర్ వేసే సదుపాయం ఉంటుంది. తద్వారా మత్స్యకారుల ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టారు.

గేమ్ ఛేంజర్.. ఆర్బీకే

▶ మొదటి పేజీ తరువాయి

ఒకటని, కొన్నేళ్ల క్రితం వరకు వ్యవసాయ రంగంలో సాంకేతిక పురోగతి ఉన్నప్పటికీ రైతుల వ్యవసాయ పద్ధతులు, వివిధ పంటల క్లిష్టమైన దశల గురించి పూర్తి స్థాయి అవగాహనలేని రైతులు డీలర్లపై ఆధారపడ్డారని తెలిపింది. విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా ఇన్‌పుట్‌లకు అధికంగా చెల్లించాల్సి రావడంతో పంట చేతికొచ్చే సమయానికి రైతులకు కన్నీళ్లే మిగిలేవని వివరించింది. మరోవైపు.. నాసిరకం దిగుబడులు, దళారుల ఆగడాల కారణంగా గిట్టుబాటు ధరలేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, ఆర్బీకేల ఏర్పాటుతో రైతులకు ఈ ఇబ్బందులన్నీ తప్పాయని తెలిపింది. ఈ నివేదికలో ఇంకా ఏముందంటే..

దేశంలోనే ఉత్తమ పద్ధతి

- రైతుల ఆదాయం, విజ్ఞానం పెంపొందించడానికి, సరికొత్త సాంకేతిక విజ్ఞానాన్ని బదిలీ చేయడంతోపాటు.. ముందుగా పరీక్షించి ధ్రువీకరించిన, నాణ్యమైన ఇన్‌పుట్‌లను గ్రామ స్థాయిలో అందుబాటు ధరలకు అందించడమే లక్ష్యంగా ఆర్బీకేలు పని చేస్తున్నాయి. విత్తనం నుంచి విక్రయం వరకు సేవలందిస్తున్న ఆర్బీకే వ్యవస్థ దేశంలోనే మొదటి ఉత్తమ పద్ధతి.
- ఆర్బీకేలు నాలుగు అంశాల్లో ప్రధానంగా పని చేస్తున్నాయి. ముందుగా.. పరీక్షించిన నాణ్యమైన ఇన్‌పుట్ల సరఫరా, నకిలీ విత్తన వ్యాప్తిని అరికట్టడం, ప్రైవేటు ఔట్‌లెట్లలో అధిక ధరలకు ఇన్‌పుట్‌ల అమ్మకాలు నిరోధించడం, విత్తన సీజన్‌కు ముందే ఇన్‌పుట్‌లు అందుబాటులో ఉంచడం లక్ష్యంగా పని చేస్తున్నాయి.

పనితీరు నిజంగా అద్భుతం

- సేవల బట్వాడా, సామర్థ్యం పెంపుదల, విజ్ఞాన వ్యాప్తిలో ఆర్బీకేల పనితీరు నిజంగా అద్భుతం. రైతులకు అవసరమైన సేవలను అందించడమే కాకుండా సామర్థ్యం పెంపుదలకు అవసరమైన విజ్ఞానాన్నీ ఆర్బీకేలు రైతులకు పంచుతున్నాయి.
- వ్యవసాయ యాంత్రీకరణ, ఈక్రాప్.. ఉచిత పంటల బీమా నమోదు, సీడ్–టు–సీడ్ శిక్షణ కార్యక్రమం, శాస్త్రవేత్తల శిక్షణలు, ఫీల్డ్ డయాగ్నస్టిక్ సందర్శనలు, సమాచార వ్యాప్తికి పోస్టర్లు, కరపత్రాలు, పుస్తకాలు, వీడియో మెటీరియల్‌తో కూడిన లైబ్రరీలను నిర్వహిస్తున్నాయి.

కాల్ సెంటర్ ద్వారా సలహాలు

- కాల్‌సెంటర్ ద్వారా ఆర్బీకేలు రైతులకు సలహాలూ అందిస్తున్నాయి.
- తక్షణమే రైతుల సమస్యలను పరిష్కరించడానికి ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఏర్పాటు చేయడం చాలా మంచి కార్యక్రమం. రైతులకు మద్దతు ధర, ప్రోత్సాహం అందించడానికి అన్ని ఆర్బీకేలను కొనుగోలు కేంద్రాలుగా ప్రభుత్వం ప్రకటించడం వల్ల రైతులకు ఎంతో లాభం. రవాణా ఖర్చులు తగ్గించడంలోనూ ఆర్బీకేల పాత్ర ప్రశంసనీయం.
- పంటల కొనుగోలు కేంద్రాలుగా ఆర్బీకేలను ప్రకటించిన తర్వాత రైతులు తమ పంటను గ్రామంలోనే విక్రయించుకోగలుతున్నారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి.

‘పాలు’పోకనే విషం!

- టీడీపీ హయాంలో పోషకాహారలోపం ఉన్నవారికే అరకొరగా పాలు పంపిణీ
- ఇప్పుడు నాణ్యతలో రాజీ లేకుండా అందరికీ పాలు
- గతంలో నెలకు 30 లక్షల లీటర్లే.. ఇప్పుడు 90 లక్షల లీటర్లకుపైగా సరఫరా
- అంగన్‌వాడీల్లో పిల్లలకు ఇచ్చే ఆహారంపైన ప్రత్యేక శ్రద్ధ
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్‌తో గతం కంటే ఎంతో మెరుగ్గా అమలు
- నాడు ఐదేళ్లలో పోషకాహార నిమిత్తం రూ.3,005.28 కోట్లు ఖర్చు
- నేడు నాలుగేళ్లలోనే రూ.5,701.02 కోట్లు వ్యయం చేసిన ప్రభుత్వం
- అయినా అమూల్‌పై మమకారం అంటూ ఈనాడు తప్పుడు కథనం

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే అటు పాల సేకరణ విషయంలో చూసినా ఇటు పాల కోసం నిధులు వెచ్చించటాన్ని పరిశీలించినా ఇప్పుడు రెట్టింపు మించి వ్యయం జరుగుతోంది. అధికారిక గణాంకాలే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఏమాత్రం పరిజ్ఞానం ఉన్న వారెవరైనా సరే ఈ ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ పట్ల మరింత శ్రద్ధ తీసుకుంటోందని అంగీకరిస్తున్నారు. వీటిని మభ్యపుచ్చి అమూల్‌పై మమకారం అంటూ యథాప్రకారం విషం చిమ్మే వ్యక్తులను ఏమనుకోవాలి? అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పాలపై కూడా ఈనాడు విషం చిమ్మింది. గత ప్రభుత్వం 2014 – 2019 వరకు అనుబంధ పోషకాహారం నిమిత్తం రూ.3,005.28 కోట్లు వెచ్చించగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.5,701.02 కోట్లు ఖర్చు చేయడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో రూ.1,695.51 కోట్లు కేటాయించింది. దీంతో మొత్తం ఐదేళ్లలో రూ.7,396.53 కోట్లు ఖర్చు చేయనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో 55,607 అంగన్‌వాడీల ద్వారా వైఎస్సార్ పోషణ, వైఎస్సార్ పోషణ ప్లస్ పథకాల ద్వారా పాలు, గుడ్లు తదితర పోషకాహారాన్ని అందిస్తున్నారు. అంగన్‌వాడీల్లో నిర్ణీత సమయానికి నాణ్యమైన సరుకులు సరఫరా అయ్యేలా, లబ్ధిదారులందరికీ అందేలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. .

గత ప్రభుత్వంలో ఇలా..

- నెలకు 35 లక్షల లీటర్ల పాలు మాత్రమే సరఫరా.
- రక్తహీనత, తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలు, బాలింతలకు మాత్రమే పాల పంపిణీ.
- 6 నెలల నుంచి మూడేళ్ల వయసున్న వారిలో తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలకు మాత్రమే నెలకు 2.5 లీటర్ల పాలు, 8 గుడ్లు, 2.5 కిలోల బాలామృతం.
- మూడు నుంచి ఆరేళ్లలోపు బాలల్లో తీవ్ర పోషకాహార లోపం ఉన్న వారికి మాత్రమే నెలకు 2.5 లీటర్ల పాలు, నెలకు 16 గుడ్లు, మధ్యాహ్న భోజనం.

ఫ్యాక్ట్ చెక్

వైఎస్సార్ సీపీ వచ్చాక ఇలా..

- నెలకు 90 లక్షల లీటర్ల పాల సరఫరాకు చర్యలు. ప్రతి నెల సగటున 82 లక్షల లీటర్ల పాలు సరఫరా.
- రక్తహీనత, పోషకాహార లోపంతో సంబంధం లేకుండా అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన 6 నెలలు నుంచి 6 సంవత్సరాల వయసున్న పిల్లలు, గర్భవతులు, బాలింతలందరికీ పాలు సరఫరా.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాల ద్వారా మరింత మెరుగైన నాణ్యమైన పోషకాహారం.
- ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంతో నెలకు 2.5 లీటర్ల పాలు, 25 గుడ్లు, 2.5 కిలోల బాలామృతం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం ద్వారా ఆరు లీటర్ల పాలు, నెలకు 30 గుడ్లు, బాలామృతం 2.5 కిలోలు సరఫరా.
- మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, 5 మిల్లీలీటర్ల నూనె, 2.5 లీటర్లు పాలు, నెలకు 25 గుడ్లు, తాజా ఆకుకూరలు, కూరగాయలతో నిర్దేశిత మెనూ ప్రకారం రోజూ రుచికరమైన నాణ్యమైన భోజనం సరఫరా.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా 75 గ్రాములు బియ్యం, 15 గ్రాములు కందిపప్పు, నూనె 5 మిల్లీలీటర్లు, పాలు 5 లీటర్లు, నెలకు 25 గుడ్లుతోపాటు తాజా ఆకుకూరలు, కూరగాయలతో నిర్దేశిత మెనూ ప్రకారం ప్రతి రోజూ రుచికరమైన నాణ్యమైన భోజనం.
- గర్భవతులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణతో నెలకు 5 లీటర్ల పాలు, 25 గుడ్లుతోపాటు రోజువారీ మధ్యాహ్న భోజనంలో బియ్యం 125 గ్రాములు, కందిపప్పు 30 గ్రాములు, నూనె 16 మిల్లీ లీటర్లు, తాజా ఆకుకూరలు, కూరగాయలతో నిర్దేశిత మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన భోజనం. టేక్ హోమ్ రేషన్ కిట్‌లో వేరు శనగ చిక్కీ(250 గ్రాములు), రాగి పిండి (1 కేజీ), బెల్లం (250 గ్రాములు), ఎండు ఖర్జూరాలు(250 గ్రాములు), జొన్న పిండి(1 కేజీ), అటుకులు(1 కేజీ) అందిస్తున్నారు.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా నెలకు 5 లీటర్ల పాలు, 25 గుడ్లు, రోజువారీ మధ్యాహ్న భోజనంలో బియ్యం 125 గ్రాములు, కందిపప్పు 30 గ్రాములు, నూనె 16 మిల్లీలీటర్లు, తాజా ఆకుకూరలు, కూరగాయలతో నిర్దేశిత మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన భోజనం. టేక్ హోమ్ రేషన్ కిట్ ద్వారా వేరు శనగ చిక్కి(500గ్రాములు), రాగి పిండి (500 గ్రాములు), బెల్లం (500 గ్రాములు), ఎండు ఖర్జూరాలు (500 గ్రాములు), మల్టీ గ్రైన్ పిండి (2 కేజీలు) సరఫరా.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ - సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలతో లబ్ధి ఇలా

కేటగిరీ	లబ్ధిదారులు	ఒక్కొక్కరికి ఏటా లబ్ధి రూ.లలో
గర్భిణులు, బాలింతలు	6,25,633	23,400
ఆర్నెళ్ల నుంచి 3 ఏళ్ల బాలలు	14,17,776	12,384
3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల బాలలు	12,87,305	10,836
మొత్తం	33,30,714	46,620

పాలకు ఎప్పుడెంత ఖర్చు?

ఏడాది	లక్షల లీటర్ల పాలు	రూ.కోట్లలో
టీడీపీ హయాంలో 2018-19	399.85	167.93
ప్రస్తుత ప్రభుత్వం 2019-20	286.70	126.14
2020-21	992.22	468.82
2021-22	944.87	446.44
2022-23	814.48	397.22

అంగన్‌వాడీలకు నాణ్యమైన పాలు

అంగన్‌వాడీల ద్వారా అత్యంత నాణ్యమైన పాలను సరఫరా చేస్తున్నాం. గరిష్ట పరిమాణం పాశ్చరైజ్డ్, హోమోజెనైజ్డ్, డబుల్ టోన్డ్ ఫోర్టిఫైడ్‌తో కూడిన (500 మిల్లీ లీటర్ల టెట్రా ప్యాకెట్) పాలను అందిస్తున్నాం. పిల్లలకు ఏ, డి విటమిన్లు, 1.5 శాతం కొవ్వు, 9 శాతం ఎస్ఎన్ఎఫ్ పాలను అందిస్తున్నాం. 55,607 అంగన్‌వాడీల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలతో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నెలకు 89 లక్షల లీటర్ల నుంచి కోటి లీటర్ల వరకు పంపిణీ చేస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా గిరిజన ప్రాంతాలపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఒకవైపు పాడి రైతులకు గరిష్ట ధరలు చెల్లించేలా చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు అంగన్‌వాడీలకు నాణ్యమైన పాలను అందించడంలో ఖర్చుకు వెనుకాడటంలేదు. ఇందుకోసం అతిపెద్ద డెయిరీ అమూల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

– ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఎండీ అహ్మద్‌బాబు

ఇంటర్ ప్రత్యేక తరగతులు ప్రారంభం



▶ మొదటి పేజీ తరువాయి

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో వసతి, శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థులు తమకు నచ్చిన విధానం ఎంచుకుని తరగతులకు హాజరు కావచ్చు. బీసీ గురుకులాల్లో ఫెయిలైన విద్యార్థులు 195 మంది ఉండగా.. వారికి ఆన్‌లైన్, రెసిడెన్షియల్ విధానంలో తరగతులు నిర్వహిస్తున్నారు. 10 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉంటే వారికి ఆన్‌లైన్‌లోనూ, అంతకు మించి విద్యార్థులు ఉన్నచోట 14 సెంటర్లలో రెసిడెన్షియల్ తరగతులకు శ్రీకారం చుట్టారు. ఇంటర్ పాసైనా మార్కులు పెంచుకునేందుకు ఇంప్రూవ్‌మెంట్ రాసే విద్యార్థులు కూడా రెమిడియల్ శిక్షణ తరగతులకు హాజరు కావచ్చని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు.

పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు ఫీజు చెల్లించడానికి మే 3 చివరి తేదీ అని ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ నెల 24 నుంచి జూన్ 1 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు బుధవారం సాయంత్రంలోగా ఫీజు చెల్లించాలని ఇంటర్ బోర్డు పేర్కొంది.

తడిసిన ధాన్యం కొనుగోలుకు
సీఎం జగన్ ఆదేశం



సాక్షి, అమరావతి: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకొనేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు, పంటలపై ప్రభావంపై సీఎం జగన్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనాలని పౌర సరఫరాల శాఖ అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలపై ఇప్పటికే మొదలైన ఎన్యుమరేషన్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి నివేదిక ఖరారు చేయాలని సూచించారు. ఈ నెలలో వైఎస్సార్ రైతు భరోసాతోపాటు అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకొనేలా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. నష్టపోయిన రైతుల జాబితాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించి సామాజిక తనిఖీ పూర్తిచేయాలని చెప్పారు. మార్చిలో కురిసిన వర్షాలకు సంబంధించి పంట నష్టం అంచనాలను ఇప్పటికే తయారుచేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న పంట నష్టం అంచనాలపైనా ఎన్యుమరేషన్ చురుగ్గా సాగుతోందని వివరించారు.

జోరుగా వానలు

▶ మొదటి పేజీ తరువాయి

వర్షం పడింది. అంబేద్కర్ కోనసీమలో 31.89, కాకినాడ జిల్లాలో 33.03, తిరుపతి జిల్లాలో 31.55 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. రాష్ట్రం మొత్తంగా 9.81 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది.

మండలాల్లో అత్యధిక వర్షం ఇలా..

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలో అత్యధికంగా 79 మిల్లీమీటర్ల సగటు వర్షం కురిసింది. తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలో 61.50, కృష్ణాజిల్లా కంకిపాడు మండలంలో 48.75, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలంలో 67.75, పల్నాడు జిల్లా పెదకూరపాడులో 68, ప్రకాశం జిల్లా మార్కాపురంలో 58.25, వైఎస్సార్ జిల్లా శ్రీ అవధూత కాశీనాయన మండలంలో 44 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది.

కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, ద్రోణి

మరోవైపు.. విదర్భ నుండి దక్షిణ అంతర్గత కర్ణాటక వరకూ విస్తరించి ఉన్న ద్రోణి (గాలుల కోత) మధ్యప్రదేశ్ నుండి దక్షిణ తమిళనాడు వరకు మరఠ్వాడా మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దక్షిణ అంతర్గత కర్ణాటక, తమిళనాడు మీదుగా ఉన్న మరో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల నుంచి 3.1 కిలోమీటర్ల మధ్య ఉంది. అలాగే.. ఏపీ, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ/దక్షిణ దిశలో గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

ఎండలు మండినా వర్షాలూ ఎక్కువే

ఇక ఇప్పటికే మే నెలను తలపించేలా ఏప్రిల్‌లో ఎండలు మండగా.. పది రోజులకు పైగా వడగాడ్పులూ వీచాయి. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు ఎగబాకి జనాన్ని బెంబేలెత్తించాయి. అయినప్పటికీ రాష్ట్రంలో ఏప్రిల్ నెలలో వర్షపాతం ఎక్కువగానే నమోదైంది. ఈ నెలలో సాధారణ వర్షపాతం 21.9 మిల్లీమీటర్లు కాగా.. 27.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అంటే కురవాల్సిన దానికంటే 26 శాతం అధికంగా వర్షం కురిసింది. కోస్తాంధ్ర–యానాం సబ్ డివిజన్‌లో 17.1 మి.మీలకు గాను 61 మి.మీలు (257 శాతం అధికంగా), రాయలసీమ సబ్ డివిజన్‌లో 19 మి.మీలకు 24.9 (31 శాతం అధికంగా) వర్షం కురిసింది. అత్యధిక వర్షపాతం బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 73.8 మి.మీలు (+327 శాతం) రికార్డయింది. అత్యల్ప వర్షపాతం కురిసిన జిల్లాల్లో విశాఖ జిల్లా ఉంది. ఇక్కడ 27 మి.మీలు కురవాల్సి ఉండగా 4.1 మి.మీలు మాత్రమే నమోదైంది.

పునాది నుంచే నాణ్యమైన విద్య అవసరం
ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్

సాక్షి, అమరావతి: విద్యార్థులు ప్రపంచ ఉత్తమ సామర్థ్యాలు, అత్యున్నత ప్రమాణాలతో ప్రపంచ పౌరులుగా రూపొందాలంటే పునాదిస్థాయి నుంచే నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ చెప్పారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుందని తెలిపారు. విజయవాడలోని ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ సపోర్టింగ్ (సాల్ట్) కార్యాలయంలో మంగళవారం ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో సమావేశం జరిగింది. ప్రైమరీ ఎడ్యుకేషన్‌లో కోర్ కరిక్యులమ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాల గురించి చర్చించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలంటే ఉపాధ్యాయులకు ఉత్తమ శిక్షణ అవసరమన్నారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు బోధించే గ్రేడ్ 1, 2 ఉపాధ్యాయులకు వేసవిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే యోచనలో ఉన్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు ఎస్సీఈఆర్టీ ద్వారా ‘ట్రైనింగ్ సర్టిఫికెట్’ ఇవ్వనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత విద్యకు అవకాశం

ఒకటో తరగతిలో ప్రవేశాలకు 6 నుంచి దరఖాస్తు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 2023–2024 విద్యా సంవత్సరానికి ఉచిత విద్యకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలు ఉచితంగా కల్పించాలని నిబంధన ఉన్న సంగతి తెలిసిందే. ఈ మేరకు ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే మొదటి దశ ప్రవేశ ప్రక్రియలో రాష్ట్ర వ్యాప్తంగా 9,064 మంది విద్యార్థులు, వారికి కేటాయించిన పాఠశాలలను ఎంపిక చేశారు. రెండో దశ ప్రవేశాలకు ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటా ఆధారంగా విద్యార్థుల అర్హతను పరిశీలించి, మే 22న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారు ఈ నెల 24 నుంచి 28 వరకు ప్రవేశాలు తీసుకోవచ్చని తల్లిదండ్రులకు సూచించారు. వివరాలను http:// cse. ap. gov. in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కమిషనర్ సురేష్‌కుమార్ తెలిపారు.

ఎన్టీఆర్‌ను తప్పించడంలో రజనీకాంత్ పాత్ర

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



శ్రీరంగరాజపురం: ఎన్టీఆర్‌ను తప్పించడంలో నటుడు రజనీకాంత్ పాత్ర ఉందని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆరోపించారు. చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలంలోని ఒడ్డుపల్లి వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ పదవీచ్యుతుడు కావడంతో పాటు ఆయన చనిపోవడం వెనక రజనీకాంత్ పాత్ర ఉందన్నారు. ఆ రోజు చంద్రబాబు పక్కన రామోజీ, రజనీకాంత్ ఉన్నారని, వీరంతా కుట్రపన్ని ఎన్టీఆర్‌ను పైకి పంపించారని చెప్పారు. తమిళనాడులో హీరో, ఇక్కడ జీరో అయిన రజనీకాంత్ మాటలను రాష్ట్ర ప్రజలు పట్టించుకోరన్నారు. ఎన్టీఆర్‌పై చంద్రబాబు చెప్పులు విసిరినప్పుడు, ఆయనను క్రూరంగా వెన్నుపోటు పొడిచి పదవి లాక్కునప్పుడు వీరంతా ఏమయ్యారని ప్రశ్నించారు. చంద్రబాబు ఎన్టీఆర్‌ను పదవి నుంచి దించినప్పుడు మెచ్చుకున్న నీచాతినీచుల్లో రజనీకాంత్ కూడా ఒకరన్నారు. ఎంతమంది ఏకమైనా జగనన్నను ఎవరూ ఏమీచేయలేరని, ప్రజాబలం ముందు వీరందరూ ఫ్యాన్ గాలికి కొట్టుకుపోవడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

నా పాదయాత్రతో సీఎం జగన్ గుండెల్లో గుబులు

టీడీపీ నేత లోకేశ్



కోడుమూరులో జనాలు లేక వెలవెలబోతున్న లోకేశ్ బహిరంగ సభ

కర్నూలు (రాజ్‌విహార్)/కోడుమూరు: తన పాదయాత్రతో సీఎం వైఎస్ జగన్ గుండెల్లో గుబులు మొదలైందని టీడీపీ నేత లోకేశ్ చెప్పారు. ఆయన నిర్వహిస్తున్న పాదయాత్ర మంగళవారం కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం గాజులదిన్నె నుంచి కోడుమూరు వరకు సాగింది. గాజులదిన్నెలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఆయన రైతులు, మత్స్యకారులతో మాట్లాడారు. కోడుమూరులో జరిగిన బహిరంగసభలో ప్రసంగించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం తగ్గించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. సీఎం జగన్‌ది రైతు వ్యతిరేక ప్రభుత్వమని చెప్పారు. అకాల వర్షాలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతే కనీసం సమీక్ష నిర్వహించలేదన్నారు. టీడీపీ హయాంలో పంటనష్టం అంచనా, పరిహారం పంపిణీ సకాలంలో జరిగేవని, ఇప్పుడు ప్రభుత్వానికి తీరిక లేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుల నుంచి ప్రభుత్వమే పంట కొనుగోలు చేస్తుందని, మత్స్యకారులకు ప్రమాద బీమా కల్పిస్తామని చెప్పారు. వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం బిగిస్తున్న మీటర్లను రైతులు పగులగొట్టాలని సూచించారు.

ఈఏపీ సెట్‌కు దరఖాస్తుల వెల్లువ

గత ఏడాది కన్నా 12 శాతం అదనంగా దరఖాస్తులు

- షెడ్యూల్‌ను ఒకరోజు పొడిగించిన మండలి
- బీఎస్సీ నర్సింగ్ సీట్లకూ ఈఏపీ సెట్ ర్యాంకులే కొలమానం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్–2023కు దరఖాస్తులు వెల్లువెత్తాయి. దరఖాస్తుల సమర్పణకు అపరాధ రుసుం లేకుండా చివరి గడువైన ఏప్రిల్ 15వ తేదీ నాటికే గత ఏడాది వచ్చిన దరఖాస్తుల సంఖ్యకు మించి అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించారు. ఆ తరువాత కూడా ఈ సంఖ్య పెరుగుతూ వచ్చింది. మంగళవారం నాటికి దరఖాస్తుల సంఖ్య 3,37,500కు చేరింది. గత ఏడాదితో పోలిస్తే.. 12 శాతం మేర అభ్యర్థుల సంఖ్య పెరుగుతోందని ఉన్నత విద్యామండలి వర్గాలు పేర్కొంటున్నాయి. ఈఏపీ సెట్ ఇంజనీరింగ్ స్ట్రీమ్‌తో పాటు అగ్రికల్చర్ స్ట్రీమ్‌లోనూ దరఖాస్తులు ఇబ్బడిముబ్బడిగా దాఖలయ్యాయి. గత ఏడాది రూ.10 వేల అపరాధ రుసుంతో చివరి గడువు నాటికి మొత్తం దరఖాస్తులు 2.90 లక్షల వరకు మాత్రమే రాగా.. ఈసారి ఎక్కువగా దాఖలు అయ్యాయి.

అపరాధ రుసుంతో 14 వరకు గడువు

అపరాధ రుసుం రూ.వెయ్యితో ఈ నెల 5వ తేదీ వరకు గడువు ఉండగా.. రూ.5 వేల అపరాధ రుసుంతో మే 12 వరకు, రూ.10 వేల అపరాధ రుసుముతో మే 14 వరకు గడువు విధించారు. మే 15వ తేదీ నుంచి ఈఏపీ సెట్ పరీక్షలను కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు పెద్దఎత్తున దరఖాస్తులు అందడంతో పరీక్ష కేంద్రాల సంఖ్య, సీటింగ్ పరిస్థితిని అనుసరించి పరీక్షల షెడ్యూల్‌ను ఒకరోజు అదనంగా ఇంతకు ముందే పొడిగించారు. వాస్తవానికి 15 నుంచి 18 వరకు రోజుకు రెండు సెషన్ల చొప్పున మొత్తం 8 సెషన్లలో పరీక్షలను ముగించాలని ముందు భావించారు. అయితే, దరఖాస్తుల సంఖ్య పెరగడంతో పరీక్ష రాసేందుకు ఏర్పాటైన కంప్యూటర్ల సంఖ్యకు తగ్గట్టుగా విద్యార్థులను సర్దుబాటు చేసినా ఇంకా అదనంగా వేలాది మంది అభ్యర్థులు మిగిలి ఉంటున్నారు. ఈ తరుణంలో పరీక్షలను మరో రోజుకు కూడా పొడిగిస్తూ ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకుంది. 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈఏపీ సెట్ ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలను నిర్వహించనున్నారు. అగ్రికల్చర్ స్ట్రీమ్‌లో గతంలో 80వేల వరకు దరఖాస్తులు అందగా.. ఈసారి వాటి సంఖ్య 96 వేలకు చేరుకుంది. అగ్రికల్చర్ స్ట్రీమ్ పరీక్షలను మే 22, 23 తేదీల్లో నిర్వహించనున్నారు. కాగా, ఈఏపీ సెట్‌లోని మార్కులకు 75 శాతం వెయిటేజీ, ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ కల్పించి ర్యాంకులను ఇవ్వనున్నారు.

బీఎస్సీ నర్సింగ్ సీట్లూ ఈఏపీ సెట్ ద్వారానే భర్తీ

ఇప్పటివరకు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ద్వారా భర్తీ అవుతున్న బీఎస్సీ నర్సింగ్ సీట్లను కూడా 2023–24 విద్యాసంవత్సరం నుంచి ఈఏపీ సెట్ ర్యాంకుల ఆధారంగా భర్తీ చేయనున్నారు. దీంతో ఈ సీట్ల కోసం పోటీపడే విద్యార్థులు కూడా ఈఏపీ సెట్‌కు దరఖాస్తు చేసి పరీక్షలకు హాజరుకానున్నారు.

వివేకా హత్యకేసులో సాక్షి రంగన్నకు తీవ్ర అస్వస్థత

వయసు రీత్యా అనారోగ్య సమస్యలు



అంబులెన్స్‌లో ఉన్న వాచ్‌మెన్ రంగన్న

పులివెందుల: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సాక్షిగా ఉన్న వాచ్‌మెన్ రంగన్న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వివేకా హత్య జరిగిన రోజు అక్కడే ఉన్న వాచ్‌మెన్ రంగన్న కోర్టుకు ఇచ్చిన 164 స్టేట్‌మెంట్‌లో కూడా వివేకాను ఎర్ర గంగిరెడ్డి, ఉమా శంకర్‌రెడ్డి, సునీల్‌యాదవ్, దస్తగిరి హత్యచేశారని చెప్పిన విషయం తెలిసిందే. వయసు రీత్యా పలు అనారోగ్య కారణాలవల్ల వాచ్‌మెన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి దెబ్బతింది. దీంతో రంగన్న ఇంటివద్ద ఉన్న సెక్యూరిటీ పోలీసులు, కుటుంబసభ్యులు మంగళవారం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో రంగన్నను అంబులెన్స్‌లో తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు.

సీబీఐ విచారణకు హాజరైన వివేకా పీఏ కృష్ణారెడ్డి

వివేకా హత్య స్థలంలో లభించిన లేఖపై సమాచారం సేకరణ

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వివేకా పీఏ కృష్ణారెడ్డిని మంగళవారం ప్రశ్నించారు. హత్యకు ముందు వివేకానందరెడ్డి రాసిన లేఖను కృష్ణారెడ్డి దాచిపెట్టిన విషయంపైనే ఎక్కువ ప్రశ్నలు అడిగినట్టు సమాచారం. మధ్యాహ్నం 3 గంటలకు కోఠిలోని సీబీఐ కార్యాలయానికి వచ్చిన కృష్ణారెడ్డిని ఐదు గంటలకు పైగా ప్రశ్నించారు. హత్య జరిగిన ప్రాంతంలో లభించిన కీలక ఆధారమైన ఆ లేఖను ఎందుకు దాయాల్సి వచ్చింది? ఎవరు ఆదేశాలిచ్చారు? లేఖను ఎవరు తొలుత గుర్తించారు? తర్వాత దాన్ని ఎక్కడ దాచిపెట్టారు? లేఖ విషయం తొలుత ఎవరెవరితో పంచుకున్నారు? లేఖను ఎన్ని గంటలకు పోలీసులకు అప్పగించారు? అప్పటి వరకు లేఖను గోప్యంగా ఉంచడానికి ప్రత్యేక కారణాలేవైనా ఉన్నాయా?.. ఇలా అనేక అంశాలపై సీబీఐ అధికారులు ప్రశ్నించారు. అధికారుల ప్రశ్నలకు కృష్ణారెడ్డి ముక్తసరిగా సమాధానాలిచ్చినట్లు తెలిసింది. ఇటీవల పులివెందులలోని కృష్ణారెడ్డి ఇంటికి సీబీఐ అధికారులు వెళ్లగా, ఆ సమయంలో ఆయన అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యుల నుంచే వివరాలు సేకరించారు. ఆ తర్వాత విచారణకు హాజరు కావాలని కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన మంగళవారం సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు.

విశ్వనగరంలో వెలుగు రేఖలు

▶ మొదటి పేజీ తరువాయి

విశాఖలో సిద్ధమవుతున్న ఆధునిక విద్యుత్ వ్యవస్థపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్ ఇదీ..

తుపాన్లకు తల వంచదు..

రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి సైతం ఎంతోమంది ఉద్యోగాలు, వ్యాపారాల కోసం వచ్చి విశాఖలో స్థిరపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాలను అందిపుచ్చుకుంటూ పలువురు పారిశ్రామికవేత్తలు సాగర నగరిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థను మరింత అభివృద్ధి చేసేందుకు డిస్కమ్‌లు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో భాగంగా తుపాన్లు లాంటి విపత్తుల సమయంలోనూ విశాఖ నగరం అంతటా విద్యుత్ వెలుగులకు ఆటంకం కలుగకుండా రూ.925 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.481.49 కోట్ల ఖర్చుతో 80,529 విద్యుత్ కనెక్షన్లను భూగర్భ విద్యుత్ వ్యవస్థలోకి తెచ్చారు. నగరం మొత్తం 2,449 కి.మీ. పొడవున అండర్ గ్రౌండ్ కేబులింగ్ చేయనున్నారు. సముద్రాన్ని ఆనుకుని ఉన్న నగరం కావడంతో తుపాన్లు వచ్చినపుడు విద్యుత్ స్తంభాలు దెబ్బతింటున్నాయి. ఇకపై అలాంటి పరిస్థితి తలెత్తకుండా పాత స్తంభాల స్థానంలో సెంట్రిప్యూగల్లీ కాస్ట్ రీఇన్ఫోర్స్ కాంక్రీట్ స్తంభాలు (స్పన్‌పోల్స్) ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 3,266 స్పన్‌పోల్స్ ఏర్పాటు కాగా అందుకోసం రూ.15.36 కోట్లను వెచ్చించారు. నష్టాల తగ్గింపు, ఆధునీకరణ పనులను సుమారు రూ.1,722.02 కోట్లతో చేపట్టారు. ఇందులో భాగంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 16 నిర్మించనున్నారు. గత మూడు నెలల్లో 421 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.



విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం ఆరిలోవ హెల్త్ సిటీ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక సర్క్యూట్ బ్రేకర్

పూర్తి భద్రత..

విద్యుత్ ప్రమాదాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా విశాఖ సర్కిల్ అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. అందులో భాగంగా సర్క్యూట్ బ్రేకర్లను అమర్చుతున్నారు. ఇవి విద్యుత్ వైర్లు తెగి కింద పడినప్పుడు ఫీడర్ ట్రిప్ అయ్యేలా చేసి సరఫరాను నిలిపివేస్తాయి. సబ్ స్టేషన్‌లో అలారం మోగించడం ద్వారా సిబ్బందిని అప్రమత్తం చేస్తాయి. ఏ ప్రాంతంలో వైరు తెగిందో కచ్చితంగా చూపిస్తాయి. లో ఓల్టేజ్, హై ఓల్టేజ్‌ను అంచనా వేస్తాయి. దీనివల్ల గృహోపకరణాలు కాలిపోవడం, అగ్ని ప్రమాదాలు లాంటి వాటిని అరికట్టవచ్చు. విశాఖ రహదారులపై నిత్యం లక్షలాది వాహనాలు తిరుగుతుంటాయి. విద్యుత్ వైర్లు తెగిపడి ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇనుప రక్షణ కంచెలతో పాటు షాక్ కొట్టని పోలీప్రాపిలిన్ వలలను ప్రయోగాత్మకంగా రక్షణ కోసం వాడుతున్నారు. రహదారుల మీదుగా వెళ్లే వైర్లకు కింద ఈ వల ఉంటుంది. వైరు తెగినా వలలోనే పడుతుంది.

30 శాతం పెరిగిన వినియోగం

మొత్తం 1,647 చ.కిలోమీటర్లు విస్తరించిన విశాఖలో 22,80,457 జనాభా ఉంది. వీరికి సరిపడా విద్యుత్‌ను ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఇప్పటికే అందుబాటులో ఉంచింది. దాదాపు 8,32,377 గృహ, 1,06,006 వాణిజ్య, 1,803 పారిశ్రామిక, 10,909 ప్రభుత్వ, స్థానిక సంస్థలు, 1,179 హెచ్‌టీ, 5,215 వ్యవసాయ కనెక్షన్లకు విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్ విద్యుత్‌ను అందిస్తోంది. విద్యుత్ సరఫరాలో నష్ట నివారణ చర్యల్లో భాగంగా 1,281 విద్యుత్ సరఫరా నియంత్రికలు (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు) అమర్చారు. మరో 4,955 డీటీఆర్‌లను సుమారు రూ.514.688 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. 316.64 సర్క్యూట్ కిలోమీటర్ల మేర లైన్లు మార్చుతున్నారు. ఈ చర్యల ఫలితంగా వేసవిలోనూ విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరుగుతోంది. గతంలో సరాసరి రోజుకు 11 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదు కాగా, ఇప్పుడు 16.495 మిలియన్ యూనిట్లకు పెరిగింది. అంటే 30 శాతం పెరిగింది.



విశాఖలో భూగర్భ విద్యుత్ కేబుల్ ఏర్పాటుకు ముందు, తర్వాత హార్బర్ పార్క్ రోడ్డులోని నివాస ప్రాంతం

విద్యుత్ సిద్ధం



విద్యుత్ పరంగా విశాఖ నగరాన్ని ప్రత్యేకంగా చూడాలి. ఇక్కడ వినియోగం చాలా ఎక్కువ. పోర్టు, నేవీ, రైల్వే, ఆస్పత్రులు లాంటి భారీ వ్యవస్థలకు అనుబంధంగా ఉండే విభాగాలకు విద్యుత్ సరఫరా అందించాలి. విశాఖకు నిత్యం పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తుంటారు. నగరానికి భారీ పరిశ్రమలు, డేటా సెంటర్లు, కార్యాలయాలు వస్తున్నాయి. వాటికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక ద్వారా అన్ని సబ్‌స్టేషన్లను భవిష్యత్ అవసరాలకు సరిపడా సిద్ధం చేశాం. మేజర్ సిటీ ఏరియా అంతా అండర్ గ్రౌండ్ కేబుల్ ప్రాజెక్టుతో కవర్ చేస్తున్నాం. రానున్న రోజుల్లో నగరం మొత్తం అండర్ గ్రౌండ్ కేబులింగ్ జరుగుతుంది. వినియోగం ఎంత పెరిగినా విద్యుత్ సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయి.


– ఎల్.మహేంద్రనాథ్, పర్యవేక్షక ఇంజనీర్, విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్, ఏపీఈపీడీసీఎల్

కాపులంటే రామోజీకి ఎందుకంత కడుపు మంట

- టీడీపీ కాపు వ్యతిరేక పార్టీ
- కాపులపై ఈనాడు విషం కక్కుతోంది
- రైలు దహనం కేసును కోర్టు కొట్టేయడాన్ని చంద్రబాబు, రామోజీ భరించలేకపోతున్నారు
- మంత్రులు కొట్టు, అంబటి, మాజీ మంత్రి కన్నబాబు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి కాకినాడ/బాపట్ల: కాపులపై చంద్రబాబు, రామోజీరావు కక్షగట్టారని మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. టీడీపీ ఎప్పుడూ కాపు వ్యతిరేక పార్టీయేనని చెప్పారు. తుని రైలు దహనం కేసును కోర్టు కొట్టేయడాన్ని చంద్రబాబు, రామోజీరావు తట్టుకోలేకపోతున్నారన్నారు. టీడీపీ హయాంలో కాపులపై కేసులు పెట్టి వేధించారని, వైఎస్సార్‌సీపీ హయాంలో ఆ కేసుల్ని ఎత్తేశారని చెప్పారు. కాపుల పక్షాన నిలబడేది వైఎస్సార్‌సీపీ మాత్రమేనని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ బాపట్లలోను, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలోను, మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కాకినాడలోను మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ కేసును కోర్టు కొట్టేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కాపులకు అన్యాయం చేసిన చంద్రబాబుతో పవన్‌కల్యాణ్ జతకట్టడం బాధాకరమన్నారు.

కాపుల పక్షాన నిలబడేది వైఎస్సార్‌సీపీనే



రాష్ట్రంలో కాపులు రాజకీయంగా ఎదగకూడదనే కుట్రపూరిత ఆలోచనతోనే చంద్రబాబు.. తునిలో రైలు దహనం ఘటనలో అమాయకులైన కాపులపై తప్పుడు కేసులు బనాయించారు. నాడు చంద్రబాబు చేసిన వాగ్దానాలను అమలు చేయాలని కాపులు ఉద్యమాలు చేస్తుంటే తప్పుడు కేసులు పెట్టి వేధించారు. ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని హింసించారు. అమాయకులపై చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులను వెనక్కి తీసుకుంటున్నామని ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. అసలైన దోషులను వదిలేసి అమాయకులైన కాపులను ఇరికించారని రైల్వే కోర్టు కూడా కేసును కొట్టేసింది. కాపులకు అన్యాయం చేసిన చంద్రబాబుతో పవన్‌కల్యాణ్ జతకట్టడం బాధాకరం. ఇప్పటికైనా కాపుల పక్షాన నిలబడేది వైఎస్సార్‌సీపీ మాత్రమేనని కాపులు గ్రహించాలి. రానున్న రోజుల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు ఓటుతో సరైన గుణపాఠం నేర్పాలి.

– కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి


కాపుల్ని నాశనం చేయడమే టీడీపీ లక్ష్యం



రాజకీయ కక్షతో వ్యవహరిస్తూ కాపులను సర్వనాశనం చేయడమే టీడీపీ లక్ష్యం. ముద్రగడ పద్మనాభం, ఆయన కుటుంబ సభ్యులను హింసించి పైశాచిక ఆనందం పొందిన సైకో చంద్రబాబు. పవన్ మళ్లీ చంద్రబాబుతో కలిసినా కాపులు కలవరు. కాపులను అమ్మాలని, వారిని తీసుకెళ్లి చంద్రబాబు దొడ్లో కట్టేయాలన్నదే పవన్‌కల్యాణ్ లక్ష్యం. ముద్రగడ పద్మనాభంతో పాటు ఇతర నేతలకు సంబంధం లేకపోయినా.. రాజకీయ కుట్రతో రైలు దహనం కేసులో ఇరికించారు. ఈ కేసు కొట్టేయడంపై కాపు జాతి అంతా సంతోషంగా ఉంటే.. చంద్రబాబు, అతడి తాబేదారు రామోజీరావు మాత్రం తట్టుకోలేకపోతున్నారు. అందుకే ఈనాడులో ఈ కేసు కొట్టివేతపై రాసిన కథనం చాలా విద్వేషంగా ఉంది. వంగవీటి మోహనరంగాను చంద్రబాబు ప్రోద్బలంతోనే అతిదారుణంగా హత్యచేశారు. స్వయాన హరిరామజోగయ్య అప్పట్లోనే అసలేం జరిగిందనేది చెప్పారు. రంగా హత్య తరువాత రాష్ట్రంలోని కాపులందరిపై కేసులు పెట్టారు. మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం నిరాహార దీక్ష చేస్తే.. ఆయనను, వారి కుటుంబాన్ని చిత్రహింసలు పెట్టి అనేక కేసులు పెట్టించారు చంద్రబాబు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లోని కాపులపై కూడా చంద్రబాబు 69 కేసులు పెట్టించారు. తెలంగాణ కార్మిక శాఖమంత్రి మల్లారెడ్డి కామెడీగా మాట్లాడతారు. ఆ కామెడీలకు సమాధానం చెప్పాల్సిన పనిలేదు.

– అంబటి రాంబాబు, జలవనరుల శాఖ మంత్రి

ఎల్లో మీడియా రాతలపై పవన్ స్పందించాలి



తుని రైలు దహనం కేసును నిరూపించడంలో అధికారులు విఫలమయ్యారంటూ ఈనాడు రాసిన రాతలను ఏమనుకోవాలి. కాపులను అణగదొక్కాలనే టీడీపీ కుట్రలో ఇది కూడా ఒక భాగమా అని సందేహం కలుగుతోంది. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు కాపులను వెంటాడి వేధించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పుడు కేసులన్నీ ఎత్తివేసి కాపులకు బాసటగా నిలిచారు. టీడీపీ హయాంలో కాపులను వేధించడం ఒక ఉద్యమంలా పెట్టుకున్నారు. ఉద్యమనేత ముద్రగడను అక్రమంగా అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించి భయానక వాతావరణం సృష్టించారు. ఈ విషయం తెలిసి సినీనటుడు చిరంజీవి రాజమహేంద్రవరం రాగా ఎయిర్‌పోర్టులోనే ఉంచి వెనక్కి పంపడంతోపాటు ఆయనపై కేసులు బనాయించారు. ఈనాడు రాతలను పవన్‌కల్యాణ్ ఎలా చూస్తున్నారో చెప్పాలి.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే

8 నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

- గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు చెప్పారు. మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో గ్రంథాలయ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల నిర్వహణకు సంబంధించి 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 2023–24 బడ్జెట్ పద్దులను పరిశీలించి ఆమోదించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, సమీక్షలు, చిత్ర లేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు.

సొంత వెలుగు లేకే నటులతో తంటాలు

- చంద్రబాబుపై మంత్రి వేణు విమర్శ



రామచంద్రపురం/రాజోలు: సొంత వెలుగు లేకే చంద్రబాబునాయుడు.. పవన్‌కళ్యాణ్, తమిళ నటుడు రజనీకాంత్ సాయం తెచ్చుకుని తంటాలు పడుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. చంద్రబాబును విజన్ ఉన్న నాయకుడిగా చెబుతున్న ఆ నటులు పునరాలోచించుకోవాలని హితవు పలికారు. వారి మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం, రాజోలు మండలం తాటిపాకల్లో మంగళవారం జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో రాష్ట్ర అవసరాల గురించి కనీస ప్రస్తావన కూడా చేయకుండా రాష్ట్రానికి చంద్రబాబు తీవ్ర ద్రోహం చేశారని దుయ్యబట్టారు. ఈ రాష్ట్రానికి చంద్రబాబే పెద్ద ఖర్మ అని చెప్పారు.

సామాన్యులకు, సంపన్నులకు ఒకే చట్టం

ప్రజాస్వామ్యంలో సామాన్యులకు, సంపన్నులకు ఒకే చట్టం అమలవుతుందన్నారు. ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి, వ్యాపారాలు చేయడం నేరమని చెప్పారు. రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, వాసులకు చెందిన చిట్‌ఫండ్ కంపెనీపై ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపి, నిర్ధారించుకుని, చట్ట ప్రకారం సీబీసీఐడీ అరెస్టు చేస్తే, దాన్ని రాజకీయలబ్ధి కోసం టీడీపీ నాయకులు వాడుకుంటున్నారని విమర్శించారు. ఇంతకాలం రామోజీరావు తనకు ఎలాంటి చట్టాలు వర్తించవని చెప్పినా.. చట్టం ముందు అందరూ సమానులే అన్న రీతిలో సీఐడీ విచారణ జరుగుతోందని గుర్తుచేశారు. చట్టవిరుద్ధంగా వ్యాపారాలు చేస్తున్నారు కాబట్టే సీబీసీఐడీ విచారణ చేస్తోందని, ఆ వ్యాపారాలు చట్టబద్ధమా, చట్టవిరుద్ధమా అనే విషయాన్ని న్యాయస్థానాలు తేలుస్తాయని చెప్పారు.

వేదపాఠశాలల అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయసు పెంపు

తిరుమల: టీటీడీ పరిధిలోని ఏడు వేదపాఠశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయోపరిమితిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ జారీచేసింది. ప్రస్తుతం టీటీడీ వేదపాఠశాలల్లో అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయోపరిమితి 62 ఏళ్లు. కొంతకాలంగా వేదపాఠశాలల్లో అధ్యాపకుల కొరత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో టీటీడీ వేదపాఠశాలల అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీచేసింది. అభ్యంతరాలుంటే ఒక నెలలో తెలపాలని సూచించింది.

థాయ్‌లో పేకాట.. హైదరాబాద్ నుంచి ఫైనాన్స్

- థాయ్‌లాండ్‌లో పేకాట స్థావరంలో ప్రత్యక్ష ప్రసార ఉపకరణాలు
- అక్రమ క్యాసినోలో 4 రోజుల్లో 50 కోట్ల లావాదేవీలు
- అరెస్టయిన వారికి థాయ్ కోర్టు బెయిల్ మంజూరు

సాక్షి, హైదరాబాద్: చీకోటి ప్రవీణ్ సహా 84 మంది భారతీయుల అరెస్టుకు కారణమైన థాయ్‌లాండ్‌లోని అక్రమ క్యాసినోలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై అక్కడి పోలీసులు స్పష్టత ఇచ్చారు. గత నెల 27 నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు రూ.50 కోట్ల టర్నోవర్ జరిగినట్లు తేల్చారు. ఈ మేరకు చోన్బూరీ ప్రావిన్స్ పోలీసు చీఫ్ కంపోన్ లీలప్రపపోన్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ వివరాలు.. ఏడు అంతస్తుల్లో విస్తరించిన, ఫోర్ స్టార్ రేటింగ్ ఉన్న ఆసియా హోటల్లో మొత్తం 300 గదులు ఉన్నాయి. గత నెల 27న కొన్ని రూముల్లోకి దిగిన 84 మంది ఆ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో వెలసిన అక్రమ జూదగృహంలో పేకాట, స్నూకర్ తదితరాలు ఆడుతున్నారు. గేమింగ్ చిప్స్ వినియోగించి లావాదేవీలు జరుగుతుండగా ఆ వివరాలను 40 గేమింగ్ క్రెడిట్ పుస్తకాల్లో నమోదు చేస్తున్నారు. నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్ల లావాదేవీలు వాటిలో నమోదైనట్లు చోన్బూరీ పోలీసులు గుర్తించారు.

హైదరాబాద్‌లో స్ట్రీమ్ అయ్యేలా..

అక్రమంగా నడుస్తున్న ఈ పేకాట శిబిరంపై అక్కడి పోలీసులకు అదే హోటల్‌లో బస చేసిన ఓ గోవా వాసి ద్వారా సమాచారం అందింది. హోటల్‌పై దాడి చేసిన పోలీసులు అందులో నాలుగు పేకాట టేబుళ్లు, మూడు పోకర్ టేబుళ్లు ఉన్నట్లు గుర్తించారు. 16 మంది మహిళలు సహా 84 మంది భారతీయులు, థాయ్‌లాండ్‌కు చెందిన నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలను పట్టుకున్నారు. వీరిలో చీకోటి ప్రవీణ్, మాధవరెడ్డి సహా పలువురు తెలుగు వాళ్లు ఉన్నారు. వీరందరికీ థాయ్‌లాండ్ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. పూచీకత్తుగా 4,500 బాట్స్ (దాదాపు రూ.11వేలు) చెల్లించాలని ఆదేశించింది. ఈ తతంగమంతా పూర్తి చేసుకుని, పాస్‌పోర్టులు పొందిన తర్వాత భారతీయులంతా తిరిగి రానున్నారు. ఆ పేకాట శిబిరంలో 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు వాటిని ఇంటర్‌నెట్‌తో అనుసంధానించారు. ఆ లైవ్ ఫీడ్ హైదరాబాద్‌లో స్ట్రీమ్ అయ్యేలా ఏర్పాటు చేసినట్లు చోన్బూరీ పోలీసులు గుర్తించారు. ఫైనాన్షియర్ కోసమే ఈ క్యాసినో లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

సీత, దేవ్ నుంచి ఆహ్వానం: చీకోటి

థాయ్‌లాండ్ వ్యవహారంపై చీకోటి ప్రవీణ్ మంగళవారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. తనకు దేవ్, సీతల నుంచి పోకర్ టోర్నమెంట్ ఉందని ఆహ్వానం అందితేనే థాయ్‌లాండ్ వచ్చానని పేర్కొన్నారు. ఇక్కడ గ్యాంబ్లింగ్ నిషేధం అన్న విషయం తనకు తెలియదని, ఆ అక్రమ క్యాసినో నిర్వాహకుడిని తాను కాదన్నారు. తన నిర్దోషిత్వాన్ని థాయ్ పోలీసుల ఎదుట నిరూపించుకున్నట్లు చెప్పారు.

సీలేరులో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏపీ జెన్‌కోలో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో మంగళవారం విద్యుత్ ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. 1, 4 యూనిట్లలో సాంకేతిక లోపంతో ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో అధికారులు మరమ్మతులు చేపట్టేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. 4వ నంబర్ యూనిట్‌లో గత నెలలో ట్రస్ట్ బేరింగ్ కూలర్ పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయినప్పటికీ యూనిట్ వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేశారు. అయితే యూనిట్ ట్రిప్ అయిపోవడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. యూనిట్‌ను పరిశీలించగా ట్రస్ట్ కాయిల్ కాలిపోయినట్లు గుర్తించారు. దీంతో అభిరాం కంపెనీకి అప్పగించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. 1వ నంబర్ యూనిట్ బట్టర్ ఫ్లైవాల్ సమస్య తలెత్తడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. డీఎఫ్ వాల్ మోటారు మధ్యలో కొన్ని సామగ్రి పాడైపోవడాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ఇంజనీర్లు, కార్మికులు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. సాధ్యమైనంత త్వరలో యూనిట్లను వినియోగంలోకి తీసుకొస్తామని చీఫ్ ఇంజనీర్ శ్రీధర్ చెప్పారు.



విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిన 1వ నంబర్ యూనిట్



చుక్కా చుక్కా కలిసి నీటి కుండ నిండుతుంది.
అదేవిధంగా, వివేకి కొంచెం కొంచెంగా తనలో
మంచితనాన్ని నింపుకొంటాడు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 3 మే 2023

మేనిఫెస్టోల మహా యుద్ధం

సమయం దగ్గర పడుతున్నకొద్దీ సమరం తీవ్రమవుతోంది. మే 10న జరగనున్న పోలింగ్‌కు మరో వారం రోజులే ఉన్న వేళ ప్రధాన పార్టీలైన అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌ల మధ్య కర్ణాటకలో మాటల తూటాలు పేలుతున్నాయి. మేనిఫెస్టోలతో మహా యుద్ధమే జరుగుతోంది. బీజేపీ 'డబుల్ ఇంజన్ సర్కార్' జపం చేస్తూ ఉంటే, కాంగ్రెస్ మాత్రం రాష్ట్రంలో మళ్ళీ బీజేపీ గద్దెనెక్కితే అది 'డబుల్ డిజాస్టర్' అని ఎద్దేవా చేస్తోంది. మళ్ళీ కింగ్‌మేకర్ తానేనని జేడీ–ఎస్ భావిస్తోంది. గత 30 ఏళ్ళలో ఇంత పోటాపోటీగా కర్ణాటక ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. బీజేపీ, కాంగ్రెస్‌లు పైచేయి సాధించడమే లక్ష్యంగా ప్రకటించిన మేనిఫెస్టోలే అందుకు సాక్ష్యం.

ప్రతిపక్షాల కుల సమీకరణాలను అభివృద్ధి, సంక్షేమ అజెండాలతో ఢీ కొట్టి, దక్షిణాదిలో తాము అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ శ్రమిస్తోంది. అభ్యర్థుల జాబితా ప్రకటన అనంతరం నిరసన ఎదుర్కొన్న ఆ పార్టీ తన ప్రాథమిక బలాలే ఆసరాగా పరిస్థితిని చక్కదిద్దే పనిలో పడింది. అందుకే, ఇటు సంక్షేమం, అటు హిందూత్వ డిమాండ్ల మేళవింపుగా మేనిఫెస్టోను అందించింది. ప్రజలకు ఉచితంగా ఇచ్చే సంక్షేమ పథకాలను 'తాయిలాలు' అంటూ రాష్ట్రాలను నిత్యం విమర్శించే జాతీయ పార్టీ కర్ణాటకలో మాత్రం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి (బీపీఎల్) అంటూనే సంక్షేమ హామీలు గుప్పించింది. 3 హిందూ పండుగలకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, అందుబాటు ధరల్లో ఆహార క్యాంటీన్లు, రోజూ అరలీటరు పాలు, వృద్ధులకు ఉచిత ఆరోగ్య చెకప్‌లు వాగ్దానం చేసింది. ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) లాంటి తన సైద్ధాంతిక అంశాలనూ జోడించింది.

కాంగ్రెస్ నిరుద్యోగం, మహిళా సాధికారతపై దృష్టి పెడుతూనే, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇంటి గృహలక్ష్మికి నెలనెలా రూ. 2 వేలు, బీపీఎల్ కుటుంబాలకు నెలకు 10 కిలోల ధాన్యాలు, నిరుద్యోగులకు నెలవారీ డబ్బులు, స్త్రీలకు ఉచిత ప్రయాణ సౌకర్యం లాంటివి వాగ్దానం చేసింది. రెండు పార్టీలూ మేనిఫెస్టోల సమరంలోకి దిగాయి. కూడు, గూడు, గుడ్డ లాంటి ప్రాథమిక సంక్షేమం అందించకుండా కేవలం రోడ్ల విస్తరణ లాంటి అభివృద్ధిపైనే దృష్టి పెట్టడం వల్ల ప్రజల స్థితిగతుల్లో పెనుమార్పులు ఉండవు. కాబట్టి సంక్షేమ వాగ్దానాలు తప్పేమీ కాదు. కాకుంటే, పోలింగ్‌కు 9 రోజుల ముందు ప్రకటించిన ఇవి కంటితుడుపు కాకూడదు. ఎన్నికల వాగ్దానపత్రాలను అమలుచేసే చిత్తశుద్ధి ఎన్ని పార్టీలకు ఉన్నాయన్నది ప్రశ్న. నిజానికి, మేనిఫెస్టోను అధికారంలోకి వచ్చాక పార్టీలు అమలు చేశాయా అన్నదానిపై ఎన్నికల సంఘపు ఆడిటింగ్ అభిలషణీయం.

కర్ణాటక, కేరళల్లో బలంగా వేళ్ళూనుకున్న తీవ్రవాద సంస్థ 'పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా' (పీఎఫ్ఐ)పై 'ఉపా' చట్టం కింద గత సెప్టెంబర్‌లో కేంద్రం విధించిన నిషేధాన్ని కొనసాగిస్తామని బీజేపీ హామీ ఇస్తోంది. అందుకు ప్రతిగా కాంగ్రెస్ విద్వేషాన్ని ప్రోత్సహించే పీఎఫ్ఐ సహా బజరంగ్ దళ్ లాంటి అన్నిటినీ నిషేధిస్తామని ప్రకటించింది. ఈ వివాదాస్పద ప్రకటన కథలో కొత్త మలుపు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు సాక్ష్యమంటూ కమలనాథులంతా ధ్వజమెత్తే అవకాశం దొరికింది. ఇది సాక్షాత్తూ బజరంగ్‌ను (హనుమంతుణ్ణి) అవమానించడమే అనే కథనంతో హిందూత్వ అంశాన్ని బీజేపీ పైకి తెచ్చింది. కరడుగట్టిన కాషాయ దళమే అయినా, కర్ణాటకలో కొన్నిసార్లు మైనారిటీలపై దాడులకు దిగినా – బజరంగ్ దళ్‌ను, దేశ వ్యతిరేక పీఎఫ్ఐతో ఒకే గాటన కట్టవచ్చా? కానీ, తప్పొప్పులు మరిచిన మాటల పోటీలో ఎవరిని మాత్రం తప్పు పట్టగలం!

చిత్రమేమిటంటే కర్ణాటకలో కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్న మోదీ మాత్రం మేనిఫెస్టోలో తమ పార్టీ సైతం సంక్షేమ పథకాలు ప్రకటించిన సంగతి విస్మరించి, కాంగ్రెస్ మేనిఫెస్టోపై ఉక్రోషం వెళ్ళగక్కడం! కాంగ్రెస్‌వన్నీ అవాస్తవిక హామీలనీ, వాటిని నెరవేరిస్తే రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతుందనీ ఆయన కొత్త పల్లవి అందుకున్నారు. కాంగ్రెస్ తన హామీలను నెరవేరిస్తే, ఇప్పటి దాకా బీజేపీ సర్కార్ చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు ఆగిపోతాయంటూ వింతవాదన తెరపైకి తెచ్చారు. ఇది సామాన్యులు హర్షిస్తారా అన్నది ప్రశ్న. ఇప్పటికే కొంత ప్రజాభిప్రాయం, ప్రధాన సర్వేలు అధికార బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నాయి. కానీ, కర్ణాటకలో ముందుండి ప్రచారాన్ని నడిపిస్తున్న అమిత్ షా మాత్రం తమకు మెజారిటీ దాటి 15 సీట్లయినా వస్తాయంటున్నారు. అయితే అధికారంలో ఉన్న పార్టీ ఎన్నికల్లో అధికారం నిలబెట్టుకోవడం గత రెండు దశాబ్దాల్లో కర్ణాటకలో జరగని కథ.

మొత్తానికి, ప్రధానపార్టీలు రెండూ తమ లక్ష్యం ఎవరనే స్పష్టతతో మేనిఫెస్టోలు తెచ్చాయి. వాటితోపాటు తమ వాదనలు తాము చేస్తున్నాయి. అయితే, ముస్లిమ్ రిజర్వేషన్ల రద్దు సహా విభజన రాజకీయాలతో కొత్త ఓటర్లను బీజేపీ ఆకట్టుకోవడం సాధ్యమేనా? అలాగే, బీజేపీది 40 శాతం కమిషన్ల అవినీతి సర్కార్ అనే వాదన ఒక్కటే పట్టుకుంటే కాంగ్రెస్ గద్దెనెక్కగలదా? 224 అసెంబ్లీ స్థానాల కర్ణాటక 2004 నుంచి ఇప్పటికి 11 మంది సీఎంలను చూసింది. కొన్నేళ్ళుగా మతోద్రిక్తతలు పెంచడం ద్వారా ఓటు బ్యాంక్ స్థిరీకరణ యత్నాలూ సాగాయి. 2018 తర్వాత ఆ అంశంపై ఓట్లు సంతృప్తస్థాయికి చేరాయనీ, కొత్తగా వచ్చేవేమీ లేవనీ బీజేపీకి అర్థమైంది. మరి ఆఖరులో అంది వచ్చిన బజరంగ్‌దళ్ వివాదం కలిసొస్తుందా? ఓట్లశాతంలో కొద్ది తేడాతో తలరాత మారే వేళ నిశ్శబ్ద ఓటర్ల మన్‌కీ బాత్ కీలకం. కాకపోతే, తరచూ ఎమ్మెల్యేల బేరసారాలు చూస్తున్న కన్నడసీమ ఈసారి హంగ్ తీర్పునివ్వదనీ, ఏదో ఒక పార్టీకే మెజారిటీ ఇస్తుందన్న సర్వే నిపుణుల హామీయే సాంత్వన.

జనాభా పెరుగుదల కలిసొచ్చేనా?

విశ్లేషణ



మనోజ్ జోషి

చైనాను అధిగమించి, ఇండియా ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా నిలిచింది. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతున్న నేపథ్యంలో యువశక్తితో కూడిన భారత్ కొంత ఈర్ష్య పుట్టించేదే. ఇదంతా కూడా యువజనానికి సరైన వేతనాలున్న ఉద్యోగాలు, ఉత్పత్తి అవకాశాలు ఉన్నాయని అనుకున్నప్పుడే. సమస్య మొత్తం ఇక్కడే ఉంది. ఉద్యోగాల్లో వ్యవసాయ రంగ భాగస్వామ్యం ఏకంగా 43 శాతం. చైనాలో ఇది 25 శాతమే. యువజనం ఉత్పాదకత పెరగాలంటే వారు గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు రావాల్సి ఉంటుంది. భారత్ వ్యవసాయ సంబంధిత ఉద్యోగాలను 15 శాతం వరకూ తగ్గించాలనుకుంటే రాగల 25 ఏళ్లలో కనీసం 9.3 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుంది.

ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది! ఈ క్రమంలో మనం చైనాను అధిగమించామని ఐక్యరాజ్యసమితి జనాభా డ్యాష్ బోర్డ్ అంచనా వేసింది. 2011 తరువాత దేశంలో జనాభా లెక్కల నిర్వహణ జరగలేదు కాబట్టి ఐరాస అంచనాలపై మనం ఆధారపడాల్సి వచ్చింది. కోవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనాభా లెక్కలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. అధికారిక జన గణన ఎప్పుడు జరుగుతుందో ఇప్పటివరకూ ఎలాంటి సూచనా లేదు.

జనాభా పెరిగిపోతోందంటే ఒకప్పుడు ఎంతో ఆందోళన వ్యక్తమయ్యేది. కానీ ప్రపంచంలోని చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతున్న నేపథ్యంలో యువశక్తితో కూడిన భారత్‌ను కొంత ఈర్ష్యతో చూసే సందర్భం! ఐరాస లెక్కల ప్రకారం, దేశ జనాభా సగటు వయసు 28 ఏళ్లు. జనాభాలో సగం కంటే ఎక్కువ మంది వయసు ముప్పై ఏళ్ల లోపే. ఉద్యోగం లేదా పని చేసే వయసు 15 – 64 ఏళ్లనుకుంటే అలాంటివాళ్లు 92.5 కోట్ల మంది ఉన్నారు. వీళ్లు ఉత్పత్తి, వినియోగం, ఆదా కూడా బాగా చేయగలరు. అదే సమయంలో వయోవృద్ధుల సంక్షేమానికి పెట్టాల్సిన ఖర్చు తక్కువ.

ఇక్కడ మనమో విషయం గుర్తుంచుకోవాలి. పైన చెప్పుకున్న అంచనాలన్నీ ఇతర అంశాలతో ముడిపడి ఉన్నవే. దేశంలోని యువజనానికి సరైన వేతనాలున్న ఉద్యోగాలు, ఉత్పత్తి అవకాశాలు ఉన్నాయన్నది వీటిల్లో ఒకటి. ఉద్యోగాల ద్వారా వారికి తినేందుకు తగినంత ఆహారం, వినోదాలు అందుతున్నాయనీ, ఆరోగ్యం బాగుందనీ, పనికొచ్చే విద్యతో లాభాలు చేకూరాయనీ అనుకోవాలి. సమస్య మొత్తం ఇక్కడే ఉంది. ఉద్యోగాల్లో వ్యవసాయ రంగ భాగస్వామ్యం ఏకంగా 43 శాతం. చైనాలో ఇది 25 శాతమే. అమెరికాలో రెండు శాతం కంటే తక్కువ మంది ఉద్యోగాల కోసం వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. ఒకవేళ భారత్ వ్యవసాయ సంబంధిత ఉద్యోగాలను 15 శాతం వరకూ తగ్గించాలనుకుంటే రాగల 25 ఏళ్లలో కనీసం 9.3 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుంది.

ఉద్యోగాల కల్పన జరగాలి

యువజనం ఉత్పాదకత పెరగాలంటే వారు గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు రావాల్సి ఉంటుంది. నగరీకరణ ఫలితంగా నగరాల మౌలిక సదుపాయాలపై ఒత్తిడి పడుతుంది. ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితిని గమనిస్తే తయారీ రంగం బలహీనతలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. మేకిన్ ఇండియా, ఉత్పాదకతతో ముడిపడిన ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) వంటి పథకాలతో అధిగమించే ప్రయత్నం జరిగినా సాధించింది కొంతే. భారత ఆర్థిక వ్యవస్థ మొత్తమ్మీద తయారీ రంగం వాటా 14 శాతం మాత్రమే. చైనాలో ఇది దాదాపు 30 శాతం.

ఉద్యోగాల విషయానికి వస్తే గత ఏడాది జూలైలో పార్లమెంటులో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానమిస్తూ, 2014– 22 మధ్య కాలంలో ప్రభుత్వానికి 22.05 కోట్ల దరఖాస్తులు వచ్చాయనీ, వీటిల్లో నియామక ఉత్తర్వులు అందుకున్నది కేవలం 7.22 లక్షలు లేదా 0.3 శాతం మాత్రమేననీ తెలిపింది. ప్రస్తుతం దేశంలోని యువతకు ఉద్యోగాలు లేకపోవడమే కాదు... నిరాశా నిస్పృహలతో వాటి కోసం ఎదురు చూసే సహనాన్నీ కోల్పోయినట్లు కనిపిస్తోంది. ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం, దేశ యువ జనాభాలో 30.7 శాతం అటు చదువుకోడం లేదు... ఇటు ఉద్యోగమూ చేయడం లేదు. అలా గని ఏదైనా శిక్షణ పొందుతున్నారా అంటే అదీ లేదు!



గత ఏడాది అక్టోబరులో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం... దేశంలో మునుపటి కంటే ఎక్కువ మంది పిల్లలు బడుల్లోకి చేరుతున్నారు. వదిలిపోయేవారు తక్కువయ్యారు. బోధన నాణ్యత, ఉపాధ్యాయుల సంఖ్యలు గత దశాబ్ద కాలంలో పెరిగాయి. అయితే ప్రాథమిక విద్యా రంగం చాలా సవాళ్లను ఎదుర్కొంటోందనీ, గ్రామీణ ప్రాంతాల్లో సాక్షరతను వృద్ధి చేయడం, అంకెలకు సంబంధించిన నైపుణ్యాన్ని పెంచడం వీటిల్లో కొన్ని మాత్రమేననీ తెలిపింది.

ప్రాథమిక విద్యాభ్యాసం సమస్యలు ఒకవైపు అలా ఉండగా... ఉన్నత విద్య పరిస్థితి ఏమంత బాగోలేదు. కొత్త కాలేజీలు బోలెడన్ని పుట్టుకొస్తున్నా, విద్యారంగం పరిశ్రమ స్థాయికి చేరుకున్నా చాలా మంది పట్టభద్రుల నైపుణ్యాల స్థాయి తక్కువగా, కొన్ని సందర్భాల్లో అస్సలు లేకుండా పోయినట్లు బ్లూమ్‌బెర్గ్ విడుదల చేసిన ఒక నివేదిక తెలిపింది. ఆర్థిక వ్యవస్థ వృద్ధి బాటకు ఇవి స్పీడ్ బ్రేకర్లే.

దేశం ఎదుర్కొంటున్న ఇంకో ముఖ్యమైన సవాలు పనిచేసే వారిలో మహిళల సంఖ్యను పెంచడం. అంతర్జాతీయ కార్మిక సంస్థ లెక్కల ప్రకారం దేశంలో పని చేస్తున్న లేదా పనికోసం ఎదురు చూస్తున్న (లేబర్‌ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ లేదా ఎల్ఎఫ్‌పీఆర్) వారు 52 శాతం. మహిళలు అతితక్కువగా (22 శాతం) ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతూండటం ఇందుకు కారణం. ఎక్కువమంది భాగస్వాములయ్యే అమెరికాలో ఇది 73, చైనాలో ఇది 76 శాతం. వాస్తవానికి ఈ పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉండవచ్చుననీ, ఎల్ఎఫ్‌పీఆర్ 40 శాతానికి తగ్గిపోయిందనీ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ చెబుతోంది. మహిళల విషయానికి వస్తే అది కేవలం 19 శాతమేనని తేల్చింది. ఇది సౌదీ అరేబియా (31) కంటే తక్కువ కావడం గమనార్హం.

సమస్యల జాబితా ఇక్కడితో ఆగిపోలేదు. ఆరోగ్యంపై దేశం పెడుతున్న ఖర్చు ప్రపంచంలోనే అత్యల్పం. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (2019– 21) చెబుతున్న దాని ప్రకారం, దేశంలో ఐదేళ్ల కంటే తక్కువ వయసున్న వారిలో 35 శాతం మంది తమ సామర్థ్యానికి తగ్గట్టుగా ఎదగడం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం దేశంలో ప్రతి పదివేల మంది పౌరులకు కేవలం ఐదు ఆసుపత్రి బెడ్లు ఉన్నాయి. చైనాలో ఈ సంఖ్య 43. అలాగే 15–49 మధ్య వయస్కులైన మహిళల్లో సగం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు.

ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రయత్నిస్తోందన్న దానికి నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే వ్యవస్థలు కొంతవరకూ నిదర్శనంగా కనిపిస్తున్నాయి. అయితే ప్రజా సేవల విషయంలో మరింత ఎక్కువ జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరముంది. ఆరోగ్యం, విద్య వంటి రంగాలకు నిధుల కేటాయింపులు తక్కువగా ఉండటం మానవ వనరులపై దుష్ప్రభావం చూపుతుంది. ఇది కాస్తా ఉత్పాదకత తగ్గేందుకు, కార్మికులు, ఉద్యోగాలు చేసే వారిలో నైపుణ్యాల లేమికి దారి తీస్తుంది. జపాన్, చైనా వంటి దేశాలు తమ జనాభాల కారణంగా ఎదిగేందుకు ఇవే కారణమన్నవి ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. భారత్ కూడా వీటి ఆధారంగానే వృద్ధి పథంలో అగ్రస్థానానికి చేరాలని ఆశిస్తోంది. అయితే జనాభా తీరుతెన్నుల వల్ల వచ్చే లాభాలు వాటంతటవే రావు. సుస్థిర ఆర్థికాభివృద్ధి కావాలంటే వినూత్నమైన విధానాలు, సమర్థమైన అమలు అత్యవసరమవుతాయి.

చైనా విషయాన్నే తీసుకుంటే... కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేయడమే కాకుండా, తయారీ రంగంలో సూపర్ పవర్‌గా ఎదుగుతోంది. అయితే ప్రస్తుతం చైనా జనాభా తగ్గుముఖం పడుతోంది. దీంతో ఆ దేశం ఎదుర్కొనే సవాళ్లూ కూడా మారిపోతాయి. ఈ సవాళ్లలో ప్రధానమైంది తగ్గిపోతున్న కార్మిక శక్తి ఉత్పాదకతను వేగంగా పెంచాల్సిన అవసరం ఉండటం. చైనాకు కొన్ని లాభాలూ ఉన్నాయి. జనాభా తక్కువగా ఉండటం వల్ల పర్యావరణంపై దుష్ప్రభావం తక్కువగా ఉంటుంది. నిరుద్యోగిత తగ్గి వేతనాలు పెరిగేందుకు దోహదపడవచ్చు.

డిస్టింగ్విష్డ్ ఫెలో, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పాలుపోని స్థితి



సౌత్ ఇండియా రిపబ్లిక్ అనే ఆలోచన అసౌకర్యానికి గురిచేసే కఠిన వాస్తవం. తెలుగువాళ్లు దాన్ని 'అరవ' ఆధిపత్యంగా భావించి సహించలేరు. ఢిల్లీ రాజ్యం చీదరే. కానీ తమిళ ద్రావిడ రాజ్యం అంత కంటే రోత!

– సాయి స్వరూప, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఆడవాళ్లే కనగలరు



ప్రపంచ జనాభా: 803,06,10,062. ఇందులో ఆడవాళ్లకు పుట్టినవాళ్లు: 803,06,10,062. మగవాళ్లకు పుట్టినవాళ్లు: 0. కావాలంటే మీరు దీన్ని 'ఫ్యాక్ట్ చెక్' చేసుకోవచ్చు.

– అనస్తాసియా మారియా లూపిస్, వైద్యురాలు

హిందూ యూదులు



'హిందూ జియోనిజం' అనే మాటను పాకిస్తాన్‌లో నేను 90ల్లో 'లష్కర్ ఎ తైయబా'లో చేరినప్పుడు విన్నాను. హిందువులను 'జియోనిస్టులు' (యూదు జాతీయత మద్దతుదారులు) అంటూ ఒక తీవ్రమైన ద్వేషపూరిత వాతావరణాన్ని కల్పించి టీనేజర్ల బ్రెయిన్‌వాష్ చేస్తారు. హిందూ జియోనిస్టులు అనే మాటను ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా లష్కర్ ఎ తైయబా చీఫ్ హఫీజ్ సయీద్ ఉపయోగించారు.

– నూర్ దాహ్రీ, రచయిత

చెప్పకోకూడదు



నా ఆఫీసులోని ముగ్గురు లాయర్లు ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్ పాసయ్యారు. నా నుంచి ఏ ప్రయత్నం లేనివాటికి కూడా నేను క్రెడిట్ తీసుకునే ఉద్దేశంతో ఇది చెబుతున్నాను.

– విక్రమ్ హెగ్డే, సుప్రీంకోర్టు న్యాయవాది

ఎందుకీ విపరీతం?



బస్సుల్లో, రైళ్లల్లో అత్యంత పెద్ద శబ్దంతో మ్యూజిక్ వినడం, వీడియోలు చూడటం చేసే మనుషుల మానసిక పరిస్థితి బాగానే ఉన్నట్టా?


– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

ఇన్‌బాక్స్

పత్రికా స్వేచ్ఛతోనే వికాసం

దక్షిణాఫ్రికా నుంచి నడిపిన 'ఇండియన్ ఒపీనియన్' తొలి సంచిక సంపాదకీయంలో 'జర్నలిజం ఏకైక లక్ష్యం సేవ మాత్రమే' అని తాను గ్రహించానని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. కొన్ని దశాబ్దాల తర్వాత ఆ ఖండం నుంచే 'ప్రపంచ పత్రికాస్వేచ్ఛ దినోత్సవం' పుట్టుకొచ్చింది. ఇది ఏడాదికొక్కసారి మీడియా వ్యవస్థను సమీక్షించుకునేలా చేస్తుంది. పత్రికా స్వేచ్ఛ విశ్వమానవ వికాసానికి ఎంతో దోహదకారని ఎలుగెత్తి చాటుతుంది.

మానవాభివృద్ధి, భద్రత, భాగస్వామ్యం, జవాబుదారీతనం, సుపరిపాలనను ప్రోత్సహించడానికి మీడియా మహత్తర సాధనంగా మారింది. వీటన్నింటి ద్వారా పేదరిక నిర్మూలనకు దారులు పడ్డాయి. ప్యారిస్‌కి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ పొలిటికల్ స్టడీస్ పత్రికాస్వేచ్ఛ– అభివృద్ధికి మధ్య ఉన్న సంబంధాన్ని నిర్ధారించడానికి అధ్యయనాలు నిర్వహించింది. పర్యావరణం మొదలుకొని విద్య, ఆరోగ్యం, ఆహారం, ఆర్థిక రక్షణలు, సుపరిపాలన, సుస్థిర అభివృద్ధి వంటి అన్ని విషయాల్లో పత్రికాస్వేచ్ఛ కీలక భూమిక పోషిస్తున్నట్టు గణాంకాలతో సహా వెల్లడించింది. భారత రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పత్రికాస్వేచ్ఛను గట్టిగా సమర్థించారు. అమెరికాలో తొలిరాజ్యాంగ సవరణ... భావ వ్యక్తీకరణ హక్కుకు మరింత బలం చేకూర్చే విధంగా జరిగింది. దీనికి పూర్తి విరుద్ధంగా మొదటి భారత రాజ్యాంగ సవరణ వాక్ స్వాతంత్ర్య హక్కులను అరికట్టే విధంగా జరిగింది. కాలక్రమంలో సర్వోన్నత న్యాయస్థానం రొమేష్ థాపర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్, బ్రిజ్ భూషణ్, మరొకరు వర్సెస్ స్టేట్ ఆఫ్ ఢిల్లీ వంటి కేసులకు సంబంధించి కొన్ని మైలురాయి తీర్పులను వెలువరించింది. వీటి ద్వారా వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛల్లో పత్రికాస్వేచ్ఛ ముఖ్యభాగమని పేర్కొంది. తదనంతరం ఈ కేసుల ఆధారంగా భారతదేశంలో ఎన్నో పత్రికలకు, పాత్రికేయులకు న్యాయస్థానాల్లో విజయాలు దక్కాయి. ప్రభుత్వాల నుంచి రక్షణలు లభించాయి. అలాగే ఎన్నో కీలక ఘట్టాల్లో, అత్యవసర పరిస్థితుల్లో ప్రపంచ దేశాల్ని, వాటి గౌరవాల్ని పరిరక్షించిన శక్తి పత్రికలకే సాధ్యమని ఎన్నో ఘటనలు నిరూపించాయి.



– జి. యోగేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు
(నేడు ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం)

చైనా నిరుద్యోగ పర్వం

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

ప్రపంచం నేడు ఆర్థిక మాంద్యంలో ఉంది. ఉద్యోగ కల్పనలో ఇండియా, చైనా, కెనడా లాంటి దేశాలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాయి. పాలక విధానాలు కార్పొరేట్ల కొమ్ము కాస్తున్నాయి. పేదల స్థితినీ, నిరుద్యోగాన్నీ, సామాన్యుల కొనుగోలు శక్తినీ పట్టించుకోవడం లేదు. ఇదే సమయంలో చైనా యువత నేడు ఉద్యోగాల వేటలో తీవ్ర పోటీని ఎదుర్కొంటోందని షాంఘై సహాయ ఆచార్యురాలు జియా మియావో అన్నారు. ఆమె ప్రకారం... ఉపాధి పరంగా చైనా యువత నిరాశలో మునిగి ఉంది. పరిశ్రమల మూసివేతలు, ఉద్యోగుల తొలగింపులు కరోనాతో దెబ్బతిన్న ఆర్థికవ్యవస్థ... ఇలా అనేక సమస్యలతో చైనా సతమతమవుతోంది. చైనా తేజో రహిత సంస్కృతిని అలవర్చుకుంది. 16–20 ఏళ్ల యువత నిరుద్యోగం 20 శాతానికి పెరిగిందనీ, (2021లో ఇది 16.2 శాతం) నగరాలలో ఈ వయసు ఉద్యోగులు 5.4 శాతమనీ, నగర వాసుల సగటు నెలసరి ఆదాయం రూ. 48 వేలనీ... 2022 ఆగస్టు అధికారిక సర్వే తెలిపింది. ఫిబ్రవరి 2023లో 16–24 ఏళ్ల నిరుద్యోగులు 18.1 శాతం. కొన్ని కంపెనీలు 996 (ఉదయం 9 నుండి రాత్రి 9 వరకు వారానికి 6 రోజులు) శ్రమసంస్కృతిని అమలుచేస్తున్నాయి. ఉద్యోగ వయోపరిమితిని 35 ఏళ్లు చేయాలనీ, పెరుగుతున్న వృద్ధ జనాభాకు అనుగుణంగా పదవీ విరమణ వయస్సును పెంచాలనీ చైనా నిర్ణయించింది. దీంతో చైనాలో 35 ఏళ్ల యువత జాబ్ ఫెయిర్‌లో సంక్షోభంలో పడింది.



అనేక సంస్థలు యువ ఉద్యోగులను ఇష్టపడతాయి. యువకుల తక్కువ ఆరోగ్య నిర్వహణ ఖర్చులు, అపరిమిత శక్తిసామర్థ్యాలను పరిగణనలోకి తీసుకొని కంపెనీలు వారిని ఉద్యోగాలలో నియమించుకోడం సమంజసమే. అయితే ఈ ఎంపిక అనుభవ శ్రామిక శక్తి వృధాకు దారితీస్తుంది. వాణిజ్య సంస్థల వయసు పక్షపాతం, పెద్ద వయసు వారి ఉద్యోగ దరఖాస్తుల తిరస్కరణలను వెంటనే నిలిపి వేయాలి. అంతేకాక కార్యాలయంలో వయసు ఆధార వివక్షను నిషేధించడానికి శాసన పరమైన చర్యలను ప్రవేశపెట్టాలి. ప్రస్తుతం చైనా కార్మిక చట్టంలో అలాంటి నిబంధన లేకపోవడం వల్ల పెద్ద వయసు కార్మికుల పట్ల కంపెనీల పక్షపాతం ఏర్పడింది.

1929–30లో ప్రపంచంలో ఏర్పడిన తీవ్ర ఆర్థిక మాంద్యం నుంచి బయట పడటానికి బ్రిటిష్ ఆర్థిక వేత్త 'జాన్ కీ' సూచించిన సూచన లను అమెరికా అధ్యక్షుడు రూజ్వెల్ట్ 'న్యూ డీల్' పేరుతో అమలు జరిపి సానుకూల ఫలితాలను సాధించారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా భారత్‌తో సహా అనేక దేశాలు ఈ తరహా పథకాలను అమలు చేస్తున్నాయి. అయితే అవి అభివృద్ధికి దారితీయని, కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే పథకాలు.

కమ్యూనిజాన్ని సడలించి 'తనదైన నమూనా' సోషలిజాన్ని చైనా పాటిస్తోంది. పెరిగిన కళాశాల విద్యతో ఉద్యోగార్థులు పెరిగారనీ, అందుకే నిరుద్యోగం పెరిగిందని ప్రస్తుత నిరుద్యోగితకు చైనా సంజాయిషీ చెబుతోంది. ఇది సరికాదు. చైనా సామ్రాజ్యవాద వ్యతిరేక శిబిరంలో ప్రధాన ప్రత్యామ్నాయ శక్తి. అది అమెరికా శిబిరానికి విమర్శల అస్త్రాలను అందించరాదు. అందుకే స్వదేశీ సమస్యల పరిష్కారంలోనూ ఆదర్శంగా నిలవాలి.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 94902 04545

చలం ఆఖరి ఉత్తరం!?


సందర్భం



జయసూర్య

''దీపం ఇచ్చే కాంతి, ఆవు ఇచ్చే పాలను బట్టి వాటి విలువలు ఉన్నట్టే – సంతోష పెట్టడం, సేవించడం, పిల్లల్ని కనటం సామర్థ్యాన్ని బట్టి మహిళ విలువ, గుర్తింపు పొందుతోంది.'' ఇది సుమారు వందేళ్ల క్రితం 'చలం', ఇంగ్లిష్‌లో 'మ్యాన్ అండ్ ఉమన్' పేరిట ప్రచురించిన మేనిఫెస్టో సారాంశం.

గుడిపాటి వెంకటా చలం జన్మించి 129 ఏళ్లు, మరణించి 44 సంవత్సరాలైంది. ''స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి విజ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి'' అంటూ బూజు పట్టిన పాతివ్రత్య నియమాలు, సంసారిక నీతి నియమాల దుష్టత్వంపై జీవితం, సాహిత్యం ఒకటిగా చలం పోరాటం చేశారు. నిరంతరం సంఘర్షణ, అశాంతి, నిందారోపణలు, కువిమర్శలు ఎదుర్కొంటూ ఎన్నో నవలలు, కథలు, నాటికలు, వ్యాసాలు, కవితలు, లేఖలు రాశారు.



1899 మే 19న జన్మించి, 1979 మే 4న తుదిశ్వాస వదిలే వరకు ఉన్న జీవితంలో... 58 ఏళ్లు తెలుగు నాట, 27 ఏళ్లు అరుణాచల రమణాశ్రమంలో జీవితానందపు లోలోతుల వెలుగులను అన్వేషిస్తూ తనను తాను అర్పించుకున్నారు. 1927లో చలం రాసిన మొదటి నవల మైదానం. దాదాపు ఆరు దశాబ్దాలు నిరీశ్వరవాదిగా, అరుణాచల ఆశ్రమవాసిగా, కవిగా, తాత్వికుడిగా, సత్యాన్వేషిగా ఈశ్వరుణ్ణి కూడా ప్రశ్నించారు. అరుణాచలం వెళ్లిపోయాక, ఆంధ్రదేశం చలాన్ని పలాయన వాదిగా నిందించింది. అక్కడ నుండి కూడా తన చిరంతన ఆత్మాన్వేషణ అనిర్వచనీయ భక్త్యానుభవాల్ని రచనలుగా, అసంఖ్యాకంగా అభిమానులకు ఉత్తరాలుగా అందచేశారు.

చలం సాహిత్య ప్రభావం యువతరంపై గాఢంగా పడడంతో అసంఖ్యాకంగా ఉత్తరాలు ఆయనను ప్రశ్నిస్తూ వచ్చేవి. అపరిచితులకు కూడా ప్రత్యుత్తరాలు రాసి సంతోషపెట్టే సున్నిత హృదయం ఆయనది. ఆయన దస్తూరీ, ఆత్మీయంగా ఉండే పలకరింపు, పసి హృదయ స్వచ్ఛత, ఆలోచనల శైలి ఉత్తరాలలో స్పష్టమవుతున్నాయి. 1927 నుంచి 30 ఏళ్లు... చింతా దీక్షితులకు రాసిన ఉత్తరాలలో ప్రేమ, హాస్యం, నిర్మలత్వం, వేదన వంటి ఎన్నో అంశాలు కనిపిస్తాయి.

ఆయనను స్వయంగా చూడకపోయినా... 1969–1979 మధ్య ఈ వ్యాస రచయితకు ఆయన అయిదు జవాబులు దయతో రాసి ధన్యుణ్ణి చేశారు. ఈశ్వర కరుణ, ఈశ్వరాదరణ, ఈశ్వరాశీర్వాదాలు ప్రేమగా పలకరింప చేసేవారు. అపరిణత భావోద్వేగంగా, తెలిసీ తెలియని జ్ఞానంతో, చిలిపి ఎకచకియంగా, భగవాన్ నుంచి ఆయన అవలోకించిన దివ్యానుభూతిని ప్రశ్నిస్తూ నాకూ పంపమని నేను రాయడం నాడు ఎంత అవివేకం? అప్పటికే జీవన చరమాంకంలో ప్రవేశించిన చలం... నా అజ్ఞానాన్ని సహించి, ఎంతో సహనంతో నన్ను క్షమించి జవాబు రాయడం ఎంతటి ఔదార్యం! అప్పటికే శారీరకంగా వార్ధక్యంలో ఉన్న ఆయన రాసే అక్షరాలు వంకర్లు తిరిగి వణుకుతున్నాయి. ఆ స్థితిలో రాయడానికి ఎంత ఓపిక కావాలి? ''భగవాన్ నుంచి నేను అవలోకించిన దివ్యానుభూతి నాకే చాలకుండా ఉంది. మీకెక్కడ పంపగలను?'' అని రాస్తూ లేఖకుణ్ణి గురించి ఏం ఊహించారో ఏమో... 'అప్పుడే కాదు' అని కూడా రాశారు. బహుశా అది ఆయన స్వదస్తూరితో రాసిన ఆఖరి ఉత్తరం కావచ్చు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
(రేపు చలం వర్ధంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.10.38 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** హస్త రా.8.01 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** తె.4.21 నుండి 6.01 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ప.11.31 నుండి 12.22 వరకు, **అమృతఘడియలు:** ప.1.34 నుండి 3.20 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.37, **సూర్యాస్తమయం:** 6.15.

క్లుప్తంగా...

దుర్గమ్మ సేవలో జస్టిస్ శ్రీనివాస్



జస్టిస్ వి.శ్రీనివాస్‌కు అమ్మవారి ప్రసాదాలు అందజేస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్న జస్టిస్ శ్రీనివాస్ అనంతరం దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు వేద పండితుల ఆశీర్వచనం అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

దుర్గమ్మకు రూ.20 లక్షల వజ్రాలహారం



వజ్రాల హారాన్ని ఆలయ ఈవోకు అందచేస్తున్న దాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.20 లక్షల విలువైన వజ్రాలహారాన్ని కానుకగా అందించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన సీహెచ్ రాజేష్, ప్రకృతి కుటుంబ సమేతంగా మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి సుమారు 180 గ్రాముల బరువు కలిగిన వజ్రాలు పొదిగిన బంగారు హారాన్ని అందజేశారు. అమ్మవారికి జరిగే విశేష ఉత్సవాల్లో హారాన్ని అలంకరించాలని దాతలు కోరారు.

11 మంది 'ఎర్ర' స్మగ్లర్లు అరెస్టు



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ శ్రీలక్ష్మి

చిత్తూరు అర్బన్: శేషాచలం అటవీప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలు తీసుకెళుతున్న 11 మంది నిందితులను చిత్తూరు పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం చిత్తూరులోని ఏఆర్ కార్యాలయం వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఎస్‌ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి వివరాలను వెల్లడించారు. మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో గుడిపాల మండలంలోని చెన్నై–బెంగళూరు బైపాస్ రోడ్డు వద్ద ఎస్‌ఐ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. చిత్తూరు నుంచి చెన్నైవైపు వెళుతున్న ఓ కారును పరిశీలించగా ఎర్రచందనం దుంగలు కనిపించాయి. దుంగలతో పాటు ఆ కారులో ఉన్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. దీనివెనుకే మరో కారులో ఐదుగురు నిందితులు, ఎర్రచందనం దుంగలు గుర్తించారు. మొత్తం రూ.15 లక్షల విలువచేసే రెండు వాహనాల్లోని 103 కిలోల ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ 11 మంది నిందితుల్లో చిత్తూరుకు చెందిన రాజశేఖర్ (30), విజయ్ (26), హిమగిరి (46), తమిళనాడు తిరువణ్ణామలై, వేలూరు జిల్లాలకు చెందిన విజయ్‌కుమార్ (30), ఏలుమలై (40), మహేంద్ర ముత్తు (29), దాడ్నినాథన్ (25), దొరైస్వామి (27), జయరామన్ (50), కార్తిక్ (21), వెంకటేశన్ (23) ఉన్నారు.

వైద్య పరిశోధనలకు ప్రోత్సాహం

సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో నూతన వైద్య విధానాలపై అధ్యయనం

- మన ప్రాంతంలో సోకే వ్యాధులకు పరిష్కారాలపై పరిశోధనలు
- క్లినికల్ రీసెర్చ్ సైతం...
- అందుకయ్యే వ్యయం కేంద్ర ప్రభుత్వమే చెల్లింపు
- వైద్య విద్యార్థులకు ఎంతో ప్రయోజనం



పాథాలజీ ల్యాబ్‌లో పరిశోధన చేస్తున్న వైద్యురాలు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో నూతన వైద్య విధానాలపై పరిశోధనలు చేసేలా వైద్యులు, విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. మన ప్రాంతంలో సోకే వ్యాధులకు అవసరమైన వైద్య పరిష్కారాలపై ఇక్కడ పరిశోధనలు సాగిస్తున్నారు. ఇందుకు కళాశాలలో మల్టీడిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్(ఎంఆర్‌యూ)ను ఏర్పాటు చేశారు. దీని కేంద్రంగా వివిధ విభాగాల్లోని వైద్యులు, పోస్టుగాడ్యుయేట్ విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. అందుకయ్యే ఖర్చును కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేయనుంది. అయితే ముందుగా పరిశోధనలకు కళాశాల ఎథికల్ కమిటీ నుంచి అనుమతి పొందాలి. ఇలా అనుమతి పొందిన పరిశోధనలకు అయ్యే ఖర్చు మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఏం పరిశోధనలు చేయాలనుకుంటున్నారు? ఎలా చేస్తారు? ఏ అంశంపై చేస్తారు? అనే వివరాలను పేపర్ ప్రజెంటేషన్ రూపంలో సమర్పించాల్సి ఉంది. వీటిని వైద్య కళాశాలలోని ఎథికల్ కమిటీ పరిశీలించి అనుమతి ఇస్తుంది. తర్వాత కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం పంపుతారు. అక్కడి నుంచి అనుమతులు వచ్చాక పరిశోధనలు ప్రారంభించవచ్చు.

పలు విభాగాల్లో పరిశోధనలు

సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇప్పటికే ఎనస్థీషియా, మైక్రోబయాలజీ విభాగాల్లో పరిశోధనలు పూర్తి చేశారు.

కొత్త చికిత్సలపై అవగాహన పెరుగుతుంది..



వైద్య కళాశాలలోని పలు విభాగాల్లో పరిశోధనలతో వైద్య విద్యార్థుల్లో పరిజ్ఞానం మరింత పెరుగుతుంది. నూతన వైద్య విధానాలు, కొత్త చికిత్సలపై అవగాహన పెంపొందించుకోవచ్చు. ప్రస్తుతం ఎనస్థీషియా, మైక్రోబయాలజీ విభాగాల్లో పరిశోధనలు పూర్తయ్యాయి. పరిశోధనల కోసం వైద్య కళాశాలలో ప్రత్యేకంగా మల్టీడిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్‌ను ఏర్పాటు చేశాం.

– డాక్టర్ కంచర్ల సుధాకర్, ప్రిన్సిపాల్, సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల, విజయవాడ

ప్రస్తుతం కమ్యూనిటీ మెడిసిన్(ఎస్పీఎం)లో పరిశోధనలు కొనసాగుతున్నాయి. అలాగే పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, మైక్రోబయాలజీ విభాగాల్లో పరిశోధనలకు ఎథికల్ కమిటీ నుంచి అనుమతి పొంది కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. అక్కడి నుంచి అనుమతి రావాల్సి ఉంది.

క్లినికల్ రీసెర్చ్ సైతం..

ఔషధ రంగంలో కొత్తగా కనిపెట్టిన మందుల పనితీరుపై కూడా సిద్ధార్థ వైద్య కళాశాలలో క్లినికల్ రీసెర్చ్ చేస్తున్నారు. ఆయా వ్యాధులకు మందులు ఎలా పనిచేస్తున్నాయి? వంటి అంశాలపై పరిశోధనలు కొనసాగిస్తున్నారు. వీటికి సైతం ముందుగా ఎథికల్ కమిటీ నుంచి అనుమతులు తప్పనిసరి. అలాగే రోగి అంగీకారం కూడా అవసరం. కాగా కళాశాలలో జీనోమ్ సీక్వెన్స్ ల్యాబ్ అందుబాటులో ఉంది. ఇందులో కొత్తగా సోకే వ్యాధుల జీన్స్, ఏ రకం వ్యాధి అనేది గుర్తించనున్నారు. కరోనాలో కొత్త వేరియెంట్‌లతో పాటు హెచ్3ఎన్2 వైరస్ వంటి వాటిని కూడా గుర్తించే సదుపాయం ఉంది.

అందుబాటులోకి నూతన వైద్య విధానాలు

ఇప్పటివరకు వివిధ వ్యాధులకు ఎక్కడో చేసిన పరిశోధనల ఆధారంగా చికిత్స అందిస్తున్నారు. అలా కాకుండా మన ప్రాంతంలో సోకే వ్యాధులకు అవసరమైన వైద్య పద్ధతులపై ఇక్కడే పరిశోధనలు చేయడం ద్వారా నూతన వైద్య విధానాలు అందుబాటులోకి రానున్నాయి. వైద్యులు చేసే పరిశోధనల్లో వైద్య విద్యార్థులు సైతం భాగస్వాములు కానుండటంతో వారికి కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. చదువుకునే సమయంలోనే పరిశోధనలపై పట్టు సాధించడంతో పాటు కొత్త విధానాలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని చెబుతున్నారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారానికి ఎల్లో మీడియా తాపత్రయం

947వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందనే భ్రమ కల్పించేందుకు ఎల్లో మీడియా తాపత్రయ పడుతుండడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 947వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో మంగళవారం పలువురు మాట్లాడారు. గత ప్రభుత్వం సమీకరణ సమయంలో రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన తరువాతే ప్రస్తుత ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నదని, దీనిని అడ్డుకునేందుకు రైతుల ముసుగులో కులవాదులు తప్పుడు కేసులు వేయడం వెనుక ఎవరున్నారో అందరికీ తెలుసన్నారు. కులవాదుల పంచన చేరి బాబు వద్ద ప్యాకేజీలు తీసుకుని చిలక పలుకులు పలుకుతున్న దళిత దళారులు ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. మీకు నిజంగా ధైర్యం ఉంటే బహుజనులకు జరిగిన అన్యాయాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకెళ్లి వివరిస్తే... సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదవాడికి అవసరమైన విద్య, వైద్యం, సంక్షేమాన్ని చేరువ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తుండటం బాబుకు కంటగింపుగా మారిందని తెలిపారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, పులి దాసు, సాంబయ్య, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.

కాపులపై బాబు పన్నిన కుట్ర భగ్నమైంది

జాతీయ కాపు సమాఖ్య అధ్యక్షుడు శ్రీహరి

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): కాపులపై చంద్రబాబు పన్నిన కుట్రను రైల్వే కోర్టు చక్కటి తీర్పు ద్వారా భగ్నం చేసిందని, కాపులపై పడ్డ మచ్చను తొలగించిందని జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి చెప్పారు. తుని ఘటనలను ఆసరా చేసుకొని కాపులపై దుర్మార్గంగా కేసులను బనాయించిన తెలుగుదేశం పార్టీ అసలు స్వరూపం బయట పడిందన్నారు. చంద్రబాబుకు మొదటి నుంచి కాపులను హింసించటం, వారిపై కేసులు బనాయించటం పరిపాటేనన్నారు. కాపు నేత, మాజీ ఎంపీ ముద్రగడ పద్మనాభం కుటుంబంపై కక్ష కట్టి వారిని హింసించిన విషయం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. ముద్రగడ ఇంటి మహిళలను సైతం అవమానించిన నీచుడు చంద్రబాబు అని అన్నారు. లోకేశ్ సైతం పద్మనాభం కుటుంబాన్ని తూలనాడారన్నారు. వంగవీటి మోహన రంగా నుంచి నేటి పద్మనాభం కుటుంబం వరకు కాపు జాతిని హింసలకు గురిచేసిన చరిత్ర చంద్రబాబుదని తెలిపారు. కాపు జాతి చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాపులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉండి గౌరవిస్తున్నారని వివరించారు.

యజ్ఞానికి నేడు భూమి పూజ

ఎద్దుల నాగలితో యజ్ఞశాలను దున్ని.. 108 కుండాల నిర్మాణం

- మే 12న ప్రారంభ కార్యక్రమానికి సీఎం జగన్ హాజరు
- ఏర్పాట్లపై సమీక్షించిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర సంక్షేమం, సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పరిపాలన మరింత బలోపేతం కావాలనే సంకల్పంతో దేవదాయ శాఖ తలపెట్టిన 'అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం' నిర్వహణకు బుధవారం భూమి పూజ జరగనుంది. ఉదయం 7.14 గంటలకు యజ్ఞశాలను ఎద్దుల నాగలితో దున్ని.. నవధాన్యాలు చల్లి 108 కుండాల నిర్మాణానికి అంకురార్పణ చేయనున్నారు. యజ్ఞ నిర్వహణ ఏర్పాట్లపై ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దేవదాయ, ఇతర శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు.

6 రోజుల పాటు కార్యక్రమాలు



అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు సౌభాగ్యంతో వర్ధిల్లాలని చేపట్టే ఈ యజ్ఞం మే 12న ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పం తీసుకుంటారని తెలిపారు. యజ్ఞం జరిగే 6 రోజులపాటు దేవదాయ శాఖ మంత్రిగా తాను యజ్ఞధారణ స్వీకరిస్తానన్నారు. మే 17న ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా మహాపూర్ణాహుతితో కార్యక్రమం ముగుస్తుందని వెల్లడించారు. భూమి పూజకు ముందు వరుణ దేవుడు వర్షం కురిపించి యజ్ఞశాలను శుద్ధి చేయడం శుభసూచకంగా భావిస్తున్నామని చెప్పారు. ప్రతిరోజు 1008 కలశాలతో సప్త నదులు, మూడు సముద్రాల జలాలతో మహాలక్ష్మి స్వర్ణ ప్రతిమకు అభిషేకం జరుగుతుందన్నారు. సాయంత్రం వేళ ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆగమ సలహా మండలి, అర్చక ట్రైనింగ్ అకాడమీకి సంబంధించిన నిష్ణాతుల సలహాలు, సూచనలు పాటించి ఈ క్రతువు నిర్వహిస్తున్నామన్నారు.

తల్లిని కడతేర్చిన కసాయి కొడుకు

- గతంలో తండ్రినీ చంపిన ఘనుడు
- తాగుడుకు బానిసై దురాగతాలు



వెంకమ్మ మృతదేహం

చెన్నవరం (గంపలగూడెం): తాగుడుకు బానిసైన కొడుకు డబ్బు కోసం కన్నతల్లిని హతమార్చిన ఘటన ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం చింతనర్వ శివారు చెన్నవరం గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంబాబు తెలిపిన సమాచారం ప్రకారం.. చెన్నవరం గ్రామానికి చెందిన మరీదు జగన్నాధరావు, వెంకమ్మ కుమారుడు వెంకటేశ్వర్లు తాగుడుకు బానిసయ్యాడు. పాతికేళ్ల క్రితం వివాహం కాగా ఇతని ప్రవర్తన, దురలవాట్లు నచ్చని భార్య సరోజిని ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. 2006లో తండ్రి జగన్నాధరావును వెంకటేశ్వర్లు హత్య చేశాడు. ఈ ఘటనపై అప్పట్లో నమోదైన కేసులో జైలు శిక్ష విధించగా సత్‌ప్రవర్తన కింద 2009లో విడుదలయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తల్లి మరీదు వెంకమ్మ (70)తో గొడవ పడి డబ్బివ్వలేదని కర్రతో తలపై కొట్టగా తీవ్రగాయాలై మృతి చెందింది. మృతురాలి కూతురు వంగల మాణిక్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొడుకును చంపి ఖననం చేసిన తండ్రి

- తాగుడుకు బానిసై వేధిస్తున్న కారణంగా..
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన



మృతదేహాన్ని పూడ్చినట్లు చెబుతున్న ప్రాంతంలో పోలీసు కాపలా

శాంతిపురం (చిత్తూరు జిల్లా): తాగుడుకు బానిసగా మారి వేధింపులకు గురిచేస్తున్న కొడుకును కన్న తండ్రే హతమార్చి, శవాన్ని ఖననం చేసిన ఘటన వారం రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. రాళ్లబూదుగూరు ఎస్‌ఐ మునస్వామి, స్థానికుల కథనం మేరకు.. అబకలదొడ్డి పంచాయతీలోని కాకర్లవంక వద్ద పొలాల్లో రెండిళ్లు కట్టుకుని పెద్దన్న కుటుంబం నివసిస్తోంది. చిన్న కొడుకు ఈశ్వరప్ప భార్య ఐదేళ్ల క్రితం మృతి చెందడంతో తండ్రితో ఓ ఇంట్లో, పెద్దకొడుకు రమేష్ పక్కనే ఉన్న మరో ఇంట్లో కాపురం ఉంటున్నారు. మద్యానికి బానిసగా మారిన ఈశ్వరప్ప (35) దొరికిన వస్తువులను, పాడి ఆవులను అమ్మి జల్సాగా గడిపేవాడు. ఈ క్రమంలో గతనెల 26న ఇంటి వద్ద ఉన్న పాడి ఆవును అమ్మేందుకు తీసుకెళ్తుంటే తండ్రి దానికి అడ్డుపడ్డాడు. మద్యం మత్తులో ఉన్న ఈశ్వరప్ప తండ్రి పెద్దన్నను కొట్టి ఆవును తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో ఆగ్రహంతో పెద్దన్న పక్కనే ఉన్న కర్రతో కొడుకును కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పెద్దన్న ఇంటి పక్కనే ఉన్న మామిడి తోటలోకి మృతదేహాన్ని తీసుకుపోయి తోటలోని దొడ్డయ్య చెరువు వంక వద్ద గుంత తీసి పూడ్చిపెట్టి వచ్చేశాడు. కానీ తమ్ముడు వారం రోజులుగా కనిపించకపోవడంతో మృతుడి అన్న రమేష్ మంగళవారం తండ్రిని ఆరా తీశాడు. నిలదీసి అడగడంతో తాను హతమార్చి, పూడ్చి పెట్టిన విషయాన్ని నిందితుడు పెద్దన్న అంగీకరించాడు. పెద్దన్నను రాళ్లబూదుగూరు పోలీసులకు అప్పగించడంతో కేసు నమోదు చేశారు. బుధవారం మృతదేహాన్ని తవ్వితీసి, అక్కడే పోస్టుమార్టం నిర్వహించేందుకు పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వెంచర్‌ను దున్నిన కేసులో టీడీపీ నేతల అరెస్టు

చక్రాయపేట: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం, చక్రాయపేట మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లెలో ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌ను దౌర్జన్యంగా దున్నేసిన కేసులో ఎనిమిది మంది టీడీపీ నాయకులను పోలీసులు అరెస్ట్‌చేశారు. టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవితోపాటు వందలాది మంది ఆయన అనుచరులు ఇటీవల నాగలగుట్టపల్లెలో రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ట్రాక్టర్‌తో దున్నేసి వీరంగం సృష్టించిన విషయం తెలిసిందే. బీటెక్ రవి, స్థానిక టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వరరెడ్డితోపాటు సుమారు 200 మందిపై బాధిత వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో మంగళవారం శంకర్‌రెడ్డి, యోగీశ్వరరెడ్డి, కుమార్‌రెడ్డి, వెంకటవిజయభాస్కర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, రెడ్డెయ్య, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రాజేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చక్రాయపేట ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వెంచర్‌ను దున్నేసినవారిలో ఇప్పటి వరకు 32మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేశామని చెప్పారు. వారిలో ఎనిమిది మందిని అరెస్టు చేయగా, మిగిలినవారి కోసం గాలిస్తున్నామన్నారు. ఈ ఘటనలో పాల్గొన్నవారిని ఇంకా గుర్తించాల్సి ఉందని తెలిపారు. కాగా, ఈ కేసులో ప్రధాన నిందితులైన బీటెక్ రవితో పాటు మహేశ్వరరెడ్డి, మరికొందరు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం.

జర్నలిజంలో ప్రమాణాలు ముఖ్యం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



పురస్కార ప్రదానోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కొమ్మినేని శ్రీనివాసరావు

గుంటూరు వెస్ట్/గుంటూరు రూరల్: సమాజాన్ని ప్రభావితం చేసే పవిత్రమైన వృత్తి అయిన జర్నలిజంలో ప్రమాణాలు, పారదర్శకత ఎంతో ముఖ్యమని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. తెలుగు జర్నలిజం సంక్షేమ సంఘం ఆధ్వర్యాన మంగళవారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఒకప్పుడు రాజకీయాలు, జర్నలిజం, విద్య, వైద్యంలో నీతి, నియమాలు, విలువలు ఉండేవన్నారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ఆ నాలుగింటినీ చాలా వరకు కలుషితం చేస్తున్నారని చెప్పారు. జర్నలిస్టులకు ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అరకొర జీతాలతో చాలామంది జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారని, వారిని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. సోషల్ మీడియా పేరుతో కొందరు స్వార్థపరులు జర్నలిస్టుల అవతారం ఎత్తుతున్నారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలువురు జర్నలిస్టులకు వెంకయ్యనాయుడు, లక్ష్మీనారాయణ, ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. తెలుగు జర్నలిజం సంక్షేమ సంఘం మేడవరపు రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా, గుంటూరులో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు జయంతి సందర్భంగా మంగళవారం కోడెల మిత్రమండలి ఆధ్వర్యాన కోడెల స్మారక పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. భారత్ బయోటెక్ వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ ఎల్లా, డాక్టర్ సుచిత్ర కె ఎల్లా, సినీనటుడు బ్రహ్మానందం, ప్రముఖ గుండె శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ గోపాలకృష్ణ గోఖలేకు పురస్కారాలను వెంకయ్యనాయుడు అందజేశారు.

మూడు కుటుంబాల వెలి

- వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారని కక్ష సాధింపు
- టీడీపీ నేతల ప్రోద్బలంతో సాంఘిక బహిష్కరణ
- పల్నాడు జిల్లా పొడపాడులో కలకలం



పొడపాడులో కుల పెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ ఆదినారాయణ, రెవెన్యూ సిబ్బంది

పెదకూరపాడు: పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం పొడపాడు గ్రామంలో మూడు కుటుంబాలపై వెలి వేసిన (సాంఘిక బహిష్కరణ) ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామంలో ముస్లిం (దూదేకుల) సామాజిక వర్గానికి చెందిన 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గడచిన పంచాయతీ ఎన్నికల్లో గ్రామానికి చెందిన మూడు కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచాయి. కుల కట్టుబాటు ప్రకారం.. టీడీపీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు ఆ కుల పెద్దలు ఆ మూడు కుటుంబాల వారికి చెప్పారు. అయితే, ఆ మూడు కుటుంబాలు వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థికి ఓటు వేయడంతో ఎన్నికల నాటినుంచీ వారిని టీడీపీ నేతల ప్రోద్బలంతో సాంఘికంగా బహిష్కరించి.. మిగిలిన కుటుంబాలన్నీ వేరుగా చూస్తున్నాయి. దీంతో బాధిత కుటుంబాలు ఆదివారం పెదకూరపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ, సీఐ వీరాస్వామి, తహసీల్దార్ క్షమారాణి సోమవారం రాత్రి గ్రామంలో ఆ సామాజిక వర్గం వారితో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలకు తావు లేదని, శాంతియుతంగా ఉండాలని అధికారులు సూచించారు. కాగా.. ఆ మూడు కుటుంబాలు క్షమాపణ చెబితేనే కలిసి ఉంటామని కుల పెద్దలు చెప్పగా.. అందుకు ఆ మూడు కుటుంబాలు నిరాకరించాయి. దీంతో గందరగోళ పరిస్థితి ఏర్పడగా.. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరువర్గాలతో మాట్లాడినా ఎలాంటి ఫలితాలు రాకపోవడంతో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ ఆదినారాయణ హెచ్చరించారు.

• తెలంగాణ

గిరిజన మహిళపై హత్యాచారం

ఖమ్మంలో దారుణ ఘటన

- దాడి చేసి అత్యాచారానికి పాల్పడి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వదలివెళ్లిన దుండగులు
- చికిత్స పొందుతూ బాధితురాలి మృతి
- ఐదు రోజుల తర్వాత వెలుగులోకి ఘటన

ఖమ్మంక్రైం: ఓ గిరిజన మహిళను హింసించి అత్యాచారం చేయడంతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలానికి చెందిన గిరిజన మహిళ (45) తన అత్త మానసిక స్థితి సరిగ్గా లేక అనారోగ్యానికి గురవడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించేందుకు గత నెల 27న నెక్కొండ నుంచి కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఖమ్మం వచ్చారు. ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌కు చూపించాక తిరిగి ఊరు వెళ్లేందుకు ఆ సమయంలో రైళ్లు ఉండవని తెలిసి కొత్త బస్టాండ్‌కు ఆటోలో బయలుదేరారు. బైపాస్ రోడ్డులో వెళ్తుండగా అత్త మూత్ర విసర్జన కోసం ఆటో ఆపించి పక్కకు వెళ్లింది. ఇదే అదునుగా ఒంటరిగా ఉన్న గిరిజన మహిళను తీసుకుని ఆటో డ్రైవర్ పరారయ్యాడు. దీంతో 70ఏళ్ల వృద్ధురాలు రోదిస్తూ స్థానికుల సాయంతో సొంతూరుకు చేరుకుంది.

అపస్మారక స్థితిలో ఆస్పత్రికి...

గత నెల 28న ఉదయం 10 గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు అపస్మారక స్థితిలో ఉన్న గిరిజన మహిళను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి క్యాజువాలిటీ వద్ద వదిలేశారు. దీంతో సిబ్బంది గుర్తు తెలియని మహిళగా పేరు నమోదు చేసుకుని చికిత్స చేసినా ఆమె మధ్యాహ్నం 3గంటలకు మృతిచెందింది. దీంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. కాగా, ఆ మహిళను కిడ్నాప్ చేసిన ఆగంతకుడు తలపై బలమైన వస్తువుతో మోది అత్యాచారం చేసినట్లు అనుమానిస్తున్నారు. ఆరోజు రాత్రంతా ఆమెపై ఒకరి కంటే ఎక్కువ మంది అత్యాచారం చేసి ఉంటారని, అపస్మారక స్థితికి చేరుకున్నాక భయంతో ఆస్పత్రిలో వదిలేశారని భావిస్తున్నారు.

ట్రైనీ ఐపీఎస్ చొరవతో..

ఈనెల 27న అదృశ్యమైన గిరిజన మహిళ కోసం 28న ఖమ్మం వచ్చిన బంధువులు ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, హవేలీ పోలీస్‌స్టేషన్లకు వెళ్లగా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. చివరకు ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ధరావత్ రామ్మూర్తినాయక్ సహకారంతో మంగళవారం టూటౌన్ స్టేషన్‌కు వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్ స్టేషన్‌కు వచ్చిన మృతదేహాల ఫొటోలను చూపించడంతో వారు తమ బంధువైన గిరిజన మహిళను గుర్తించారు. దీంతో కేసు తీవ్రతను గుర్తించిన అవినాష్ సూచనలతో పోలీసులు రంగంలోకి దిగారు. కాగా, ఆ మహిళను ఆస్పత్రికి తీసుకొచ్చిన సమ.ంలో సీసీ కెమెరాలు పనిచేయలేదని తెలిసింది. దీంతో సమీప మెడికల్ షాపు సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలిస్తూ ఖమ్మం రైల్వేస్టేషన్, ప్రైవేట్ ఆస్పత్రి అడ్డాల్లోని ఆటోడ్రైవర్లను విచారిస్తున్నారు. కేసు దర్యాప్తు కోసం ఏసీపీ గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేయగా ఖమ్మం స్టేషన్‌తో పాటు ఇతర చోట్ల సీసీ కెమెరా పుటేజీలు పరిశీలిస్తున్నారు. మృతురాలికి ఓ కుమార్తె ఉంది. భర్త ఫిర్యాదు మేరకు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు కిడ్నాప్, అత్యాచారం, హత్యకు సంబంధించిన కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా సీఎం కప్ పోటీలు



గుంటూరు- విశాఖ జట్ల మధ్య కబడ్డీ మ్యాచ్

తిరుపతి ఎడ్యుకేషన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యాన తిరుపతిలో నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మొత్తం 14 క్రీడాంశాల్లో ఉమ్మడి 13 జిల్లాల నుంచి సుమారు 2,700 మంది బాలురు, 1,800 మంది బాలికలు పోటీపడుతున్నారు. రెండో రోజు మంగళవారం లీగ్ పోటీలు నిర్వహించారు.

హాకీ మ్యాచ్‌ల ఫలితాలు...

హాకీ బాలికల విభాగంలో ప్రకాశం జట్టుపై 0–8 తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. కర్నూలు జట్టుపై 0–17 తేడాతో తూర్పు గోదావరి, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జట్టుపై 0–12 తేడాతో వైఎస్సార్ జిల్లా జట్టు, విశాఖపట్నం జట్టుపై 0–10 తేడాతో శ్రీకాకుళం జట్టు గెలుపొందాయి. పురుషుల హాకీ మ్యాచ్‌లలో అనంతపురం జట్టుపై 1–2 తేడాతో వైఎస్సార్ జిల్లా జట్టు, గుంటూరుపై 1–2 తేడాతో విజయనగరం జట్టు విజయం సాధించాయి. కర్నూలు–విశాఖపట్నం, తూర్పు గోదావరి–పశ్చిమ గోదావరి, కర్నూలు–శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.

కబడ్డీ మ్యాచ్‌ల వివరాలు...

కబడ్డీ మహిళల విభాగంలో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జట్టుపై గుంటూరు జట్టు, ప్రకాశం జట్టుపై విశాఖపట్నం జట్టు, కృష్ణా జట్టుపై వైఎస్సార్ జట్టు విజయం సాధించాయి. పురుషుల కబడ్డీ మ్యాచ్‌లలో తూర్పు గోదావరి జట్టుపై వైఎస్సార్ జట్టు, గుంటూరు జట్టుపై పశ్చిమ గోదావరి జట్టు, విజయనగరం జట్టుపై శ్రీకాకుళం జట్టు గెలుపొందాయి.

టెన్నిస్, బ్యాడ్మింటన్ వివరాలు...

టెన్నిస్ పురుషుల విభాగంలో తూర్పు గోదావరి జట్టుపై వైఎస్సార్ జట్టు, గుంటూరు జట్టుపై విశాఖపట్నం జట్టు విజయం సాధించాయి. మహిళల విభాగంలో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జట్టుపై వైఎస్సార్ జట్టు, తూర్పు గోదావరి జట్టుపై విశాఖపట్నం జట్టు గెలుపొందాయి. బ్యాడ్మింటన్ టీం చాంపియన్‌షిప్ లీగ్ పోటీల్లో పురుషుల విభాగంలో పశ్చిమ గోదావరి, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, కృష్ణా, వైఎస్సార్ జిల్లా జట్లు గెలుపొంది నాకౌట్ దశకు చేరుకున్నాయి. మహిళల విభాగంలో కృష్ణా, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల జట్లు నాకౌట్‌కు చేరాయి.

'వరమహాలక్ష్మి'లో ఐటీ తనిఖీలు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): విజయవాడ మహాత్మాగాంధీరోడ్డులోని కాంచీవరం వరమహాలక్ష్మి వస్త్ర దుకాణంలో మంగళవారం ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో షోరూమ్‌కు వచ్చిన అధికారులు సాయంత్రం వరకూ చేస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించిన అధికారులు, కీలక ఆధారాలు సేకరించినట్లు తెలిసింది.

క్లుప్తంగా

గూగుల్‌ను వీడిన ఏఐ గాడ్‌ఫాదర్



వాషింగ్టన్: గాడ్ ఫాదర్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌గా పేరొందని జెఫ్రీ హింటన్(75) టెక్ దిగ్గజం గూగుల్‌కు రాజీనామా చేశారు. తాజాగా ఆయన బీబీసీతో మాట్లాడారు. కృత్రిమ మేధతో కలిగే ముప్పుపై ఇకపై స్వేచ్ఛగా మాట్లాడుతానన్నారు. ''ప్రస్తుతానికి కృత్రిమ మేధ మనుషుల కంటే తెలివైందేమీ కాదు. కానీ, త్వరలోనే వారిని మించిపోవచ్చునన్నారు. అదే పెద్ద ప్రమాదం'' అని హెచ్చరించారు. ''సాధారణ పరిజ్ఞానం విషయంలో అవిప్పటికే మనుషులను దాటేశాయి. తార్కిక జ్ఞానం విషయంలోనూ త్వరలోనే మెరుగవుతాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తత అవసరం. ఉద్యోగాల తొలగింపునకు కారణమవుతుంది. ఏది నిజమో తెలుసుకోలేని ప్రపంచాన్ని సృష్టించే సామర్థ్యం ఏఐకి ఉంది'అని హింటన్ హెచ్చరించారు. ఫేక్ ఫొటోలు, నకిలీ సమాచారం వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. ఈ సాంకేతికత దుర్వినియోగాన్ని అడ్డుకోవడం కూడా చాలా కష్టమని చెప్పారు. గూగుల్ ఏఐ పరిశోధనల్లో హింటన్ ఏళ్లుగా పాలుపంచుకుంటున్నారు.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు దక్కని ఊరట

అహ్మదాబాద్: పరువు నష్టం కేసులో గుజరాత్ హైకోర్టులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఊరట లభించలేదు. మోదీ ఇంటి పేరుపై వ్యాఖ్యల కేసులో సూరత్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ తీర్పుతో రాహుల్ లోక్‌సభ సభ్యత్వం కూడా రద్దయింది. ఈ తీర్పుపై మధ్యంతర స్టే ఇవ్వాలన్న రాహుల్ పిటిషన్‌పై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ ప్రాచ్ఛక్ విచారణ జరిపారు. ఈ కేసును అత్యవసరమైందిగా భావించి మంగళవారమే తీర్పు వెలువరించాలని రాహుల్ తరఫున వాదించిన అభిషేక్ మను సింఘ్వీ కోరారు. ఈ దశలో మధ్యంతర స్టే మంజూరు చేయలేమని జడ్జి స్పష్టం చేశారు. జూన్ 3న వేసవి సెలవులు ముగిశాకే తుది ఉత్తర్వులిస్తామని స్పష్టం చేశారు.

పాక్ చొరబాటుదారుల కాల్చివేత..డ్రగ్స్ స్వాధీనం

న్యూఢిల్లీ: సరిహద్దులు దాటి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన ఇద్దరిని కాల్చివేసి డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు బీఎస్ఎఫ్ తెలిపింది. రాజస్తాన్‌లోని బార్మేర్ వద్ద పాక్ సరిహద్దుల వెంట సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వారినుంచి మూడు ప్యాకెట్లలో హెరాయిన్ దొరికిందని బీఎస్ఎఫ్ ప్రతినిధి తెలిపారు. తెలిపింది. వారిద్దరినీ డ్రగ్స్ స్మగ్లర్లుగా భావిస్తున్నట్లు చెప్పారు.

బీజేపీ అడ్డాపై కాంగ్రెస్ కన్ను

కన్నడ పోరు

ఏడు జిల్లాలు, 50 అసెంబ్లీ స్థానాలున్న ముంబై కర్ణాటక ప్రాంతం కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజేతను తేల్చడంలో కీలకంగా ఉంటోంది. బీజేపీకి ప్రధాన ఓటుబ్యాంకైన లింగాయత్‌లు అధికంగా ఉండటంతో ఇక్కడ ఆ పార్టీ ఎంతో బలంగా ఉంది. ఈసారి సత్తా చాటాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. జేడీ(ఎస్) ఉనికి ఇక్కడ కూడా నామమాత్రమే..



ముంబై కర్ణాటకలో హోరాహోరి పోరు

ఈ లింగాయత్ ప్రాబల్య ప్రాంతంలో యడియూరప్పదే హవా


సాక్షి, బెంగళూరు: బ్రిటిషర్లతో పోరాడిన స్వాతంత్ర్య సమరయోధురాలు రాణి కిత్తూరు చెన్నమ్మ పేరిట 2021లో ముంబై కర్ణాటక పేరును కిత్తూరు కర్ణాటకగా మార్చారు. ఇక్కడ ఉత్తర కన్నడ మినహాయించి మిగతా ఆరు జిల్లాల్లోనూ లింగాయత్‌లదే ప్రాబల్యం. దశాబ్దాలుగా వారు బీజేపీకి దన్నుగా నిలుస్తున్నారు.

ఆధిక్యం అటూ ఇటూ

- ముంబై కర్ణాటక తొలినాళ్లల్లో కాంగ్రెస్ కంచుకోట. 1990 ఎన్నికల్లో లింగాయత్ వర్గానికి చెందిన నాటి సీఎం వీరేంద్ర పాటిల్ పక్షవాతం బారిన పడటంతో ప్రధాని రాజీవ్ గాంధీ ఆయన్ను తొలగించారు. దాంతో కాంగ్రెస్‌పై లింగాయత్‌లు భగ్గుమన్నారు. తర్వాత బీజేపీ లింగాయత్ నేత బీఎస్ యడియూరప్ప వెనక నడిచారు.
- క్రమంగా ఈ ప్రాంతం బీజేపీ కంచుకోటగా మారింది. అలా సాగిన బీజేపీ హవాకు యడియూరప్ప తిరుగుబావుట ఎగరేసి సొంత కుంపటి పెట్టుకోవడంతో 2013లో అడ్డుకట్ట పడింది. ఆ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఏకంగా 30 సీట్లు గెలిచింది.
- 2014 లోక్‌సభ ఎన్నికల అనంతరం యడియూరప్ప తిరిగి బీజేపీ గూటికి చేరడంతో ముంబై కర్ణాటక మళ్లీ బీజేపీ పట్టులోకి వెళ్లింది. దాంతో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 30, కాంగ్రెస్ 17 సీట్లు గెలిచాయి.
- యడియూరప్ప ఎన్నికల రాజకీయాల నుంచి తప్పుకున్న నేపథ్యంలో అంతటి లింగాయత్ నేతను బీజేపీ అవమానించిందంటూ కాంగ్రెస్ జోరుగా ప్రచారం చేస్తోంది.
- అధికార బీజేపీ కూడా సరిగ్గా ఎన్నికలకు నెల ముందు లింగాయత్‌ల ఓటుబ్యాంకును కాపాడుకునేందుకు వారి రిజర్వేషన్లను 2 నుంచి 4 శాతానికి పెంచింది. ఇది బాగా కలిసొస్తుందని ఆశిస్తోంది.
- ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బెళగావి, ధారవాడల్లో భారీ సభలు, మెగా రోడ్ షోలతో హోరెత్తించారు. కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ బెళగావిలో యువ క్రాంతి, యువ సమావేశాలు నిర్వహించారు.

బెళగావిలో కీలక పోరు

- బెంగళూరు నగరం (28 సీట్లు) తర్వాత అత్యధిక అసెంబ్లీ సీట్లు (18)న్న బెళగావి జిల్లా ముంబై కర్ణాటక ప్రాంతంలోనే ఉంది. ఈ జిల్లా రాజకీయంగానూ చాలా కీలకం. 2018 ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ 10, కాంగ్రెస్ 8 సీట్లు గెలుచుకున్నాయి.
- ఉమేశ్ కత్తి, సవదత్తి మామని వంటి కీలక నేతల హఠాన్మరణంతో బీజేపీ ఇక్కడ కాస్త బలహీనపడింది. దీనికి తోడు మాజీ సీఎం జగదీశ్ శెట్టర్, మాజీ డిప్యూటీ సీఎం లక్ష్మణ సవది వంటి సీనియర్లు పార్టీని వీడటంతో మరింత డీలా పడింది. శెట్టర్ హుబ్లీ సెంట్రల్ నుంచి కాంగ్రెస్ తరఫున బీజేపీకి సవాలు విసురుతున్నారు.
- రెండు పార్టీల్లోనూ గట్టి రాజకీయ కుటుంబాలున్నాయి. జిల్లాలో చాలామంది ప్రజాప్రతినిధులు చక్కెర సహకార సంఘాలున్నాయి. నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ బెళగావి నుంచే ప్రజాధ్వని యాత్ర పేరిట ఎన్నికల బస్సు యాత్రకు శ్రీకారం చుట్టింది.
- సీఎం బసవరాజ్ బొమ్మై ప్రాతినిధ్యం వహిస్తున్న శిగ్గావ్ స్థానం ముంబై కర్ణాటక కిందకే వస్తుంది. 2018 నుంచీ ఇక్కడ పలు జిల్లాల్లో కాంగ్రెస్ పుంజుకుంటోంది. ఆ పార్టీకి చెందిన విపక్ష నేత సిద్ధరామయ్య బాగలకోటె జిల్లా బాదామి నుంచి గెలుపొందారు.
- విజయపుర జిల్లాలో బీజేపీ సీనియర్ నేత బసవనగౌడ పాటిల్ నోటి దురుసు పార్టీకి తలనొప్పిగా మారింది. గతంలో యడియూరప్పపై బహిరంగంగా విమర్శలతో పార్టీకి నష్టం చేసిన చరిత్ర ఆయనది. ఈసారీ సీఎం అభ్యర్థి తానేనంటూ హల్‌చల్ చేస్తున్నారు.
- ఇక 7 సీట్లున్న ధారవాడ జిల్లా కూడా బీజేపీకి కీలకమే. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



పవార్ అస్త్రసన్యాసం

ఎన్సీపీ అధ్యక్షునిగా తప్పుకుంటున్నట్టు ప్రకటన | **పార్టీలో కలకలం, కార్యకర్తల ఆందోళనలు** | **నిర్ణయంపై రెండు రోజుల్లో పునరాలోచన: అజిత్**



టైం అయిపోయింది..!
మంగళవారం రాజీనామా ప్రకటన అనంతరం పవార్

ముంబై: దేశ రాజకీయాల్లో కురువృద్ధుడు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్ (82) ఉన్నట్టుండి బాంబు పేల్చారు. పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్టు మంగళవారం ప్రకటించారు. తన ఆత్మకథ తాజా వెర్షన్ విడుదల కార్యక్రమాన్ని ఇందుకు వేదిక చేసుకున్నారు. ''1960లో మొదలైన నా రాజకీయ జీవితం 63 ఏళ్లుగా నిర్నిరోధంగా కొనసాగుతూ వస్తోంది. ఇక తప్పుకోవాల్సిన సమయం వచ్చింది. విద్య, వ్యవసాయం, క్రీడలు, సంస్కృతి తదితర రంగాల్లో యువత, విద్యార్థులు, దళితులు, గిరిజనులు తదితరులకు సేవ చేయాలనుకుంటున్నా. రాజ్యసభ సభ్యునిగా నాకు మిగిలిన మూడేళ్ల పదవీకాలంలో మహారాష్ట్రకు, దేశానికి సంబంధించిన అంశాలపై దృష్టి పెడతా. పార్టీలో ఇక ఎలాంటి పదవీ స్వీకరించబోను'' అంటూ ఆకస్మిక ప్రకటన చేశారు. దాంతో పార్టీలో పెను కలకలం రేగింది. పవార్ నిర్ణయానికి నిరసనగా నేతలు, కార్యకర్తలు ఆందోళనకు, మూకుమ్మడి రాజీనామాలకు దిగారు. దాన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని కోరారు. పలువురు కార్యకర్తలు భావోద్వేగంతో కంటతడి పెట్టారు. పవార్ వారసుని ఎన్నిక కోసమంటూ మొదలైన ఎన్సీపీ నేతల కమిటీ భేటీ ఈ ఆందోళనల నేపథ్యంలో అర్ధాంతరంగా ముగిసింది. పునరాలోచనకు పవార్‌కు రెండు మూడు రోజులు సమయం కావాలని ఎన్సీపీ నేత అజిత్ పవార్ చెప్పారు. తొందరపాటు చర్యలకు దిగొద్దని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. రాజీనామాలు మాని ఆందోళనలు విరమించాలని కోరారు. 15 రోజుల్లో ఢిల్లీలో, మహారాష్ట్రలో భారీ బాంబులు పేలనున్నాయని పవార్ కుమార్తె సుప్రియా సులే ఇటీవలే చెప్పడం తెలిసిందే. కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల ముంగిట బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలన్నింటినీ ఒక్కతాటిపైకి తేవడంలో కీలకంగా వ్యవహరించగల నేతల్లో ఒకరిగా పవార్ గురించి చెబుతుంటారు.

కాకలుతీరిన యోధుడు

దేశ రాజకీయాల్లో కాకలుతీరిన యోధునిగా శరద్ పవార్‌కు పేరుంది. కాంగ్రెస్‌లో సుదీర్ఘ కాలం కొనసాగి కీలక స్థాయికి ఎదిగారు. మహారాష్ట్రకు ఏకంగా నాలుగుసార్లు సీఎంగా పని చేశారు. రక్షణ మంత్రిగా కేంద్ర వ్యవసాయ మంత్రిగా చేశారు. ప్రధాని పదవి కోసం గట్టిగా పోటీ పడ్డారు. ఆ ఆశ నెరవేరకపోవడంతో సోనియాగాంధీ విదేశీయతపై విమర్శల వర్షం కురిపిస్తూ ఆమెతో విభేదించి కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అనంతరం 1999లో ఎన్సీపీని స్థాపించారు. నాటి నుంచే పవారే అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. 2019 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎవరూ ఊహించని విధంగా కాంగ్రెస్, శివసేన, ఎన్సీపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో పవార్‌దే కీలక పాత్ర!

డీకే హెలికాప్టర్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం



బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం మధ్యాహ్నం ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు పక్షి తగిలింది. దాంతో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ పగిలింది. తాకిడి తీవ్రతకు అది పగిలి ముక్కలు కావడంతో ఒక్కసారిగా గాలి లోపలికి ప్రవేశించింది. దాంతో పైలట్ సమీపంలోని హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్టులో హెలికాప్టర్‌ను సురక్షితంగా ల్యాండ్ చేశారు.

సంయమనం పాటించండి

కర్ణాటకలో పార్టీలకు ఈసీ హితవు

న్యూఢిల్లీ: విషసర్పం, విషకన్య, పనికిమాలిన కుమారుడు. ఇలా కర్ణాటక ఎన్నికల ప్రచారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల తూటాలు శ్రుతిమించుతున్నాయి. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహించింది. పార్టీలు, స్టార్ ప్రచారకులు సంయమనం పాటించాలంటూ హితవు పలికింది. ఆమోదనీయం కాని పదజాలంతో ఎన్నికల వాతావరణాన్ని పాడుచేయొద్దని సూచించింది. కోడ్‌కు అనుగుణంగా హుందాగా నడచుకోవడం పార్టీల విధి అని స్పష్టం చేసింది. మరోవైపు, బీజేపీ స్టార్ ప్రచారకులు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ విద్వేష ప్రసంగాలతో కర్ణాటక ప్రజలను రెచ్చగొట్టజూస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్రంలో ప్రచారం చేయకుండా వారిపై తక్షణం నిషేధం విధించాలని ఈసీని కోరింది.

బజరంగ్ దళ్‌పై నిషేధం

- బీజేపీ సర్కారు ప్రజా వ్యతిరేక చట్టాల రద్దు
- గృహ జ్యోతి, గృహ లక్ష్మి తదితర ఐదు గ్యారెంటీలు
- కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీలు



మేనిఫెస్టోతో సిద్ధరామయ్య, ఖర్గే, శివకుమార్

శివాజీనగర: అధికారంలోకి వస్తే సమాజంలో కులం, మతం ప్రాతిపదికన విద్వేషాన్ని వ్యాప్తి చేసే వ్యక్తులు, బజరంగ్‌దళ్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)వంటి సంస్థలపై నిషేధం విధిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజావ్యతిరేక చట్టాలను రద్దు చేస్తామని తెలిపింది. ఈ నెల 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఆ పార్టీ మేనిఫెస్టో 'సర్వ జనుల శాంతి వనం'ను మంగళవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్, సీఎల్పీ నేత సిద్దరామయ్య తదితరులు పాల్గొన్నారు. 'రాజ్యాంగం, చట్టం పవిత్రతపై మాకు విశ్వాసం ఉంది. ఇదే సమయంలో మెజారిటీ, మైనారిటీ వర్గాల మధ్య విద్వేషాన్ని, శత్రుత్వాన్ని ప్రేరేపించే బజరంగ్‌దళ్, పీఎఫ్ఐ వంటి సంస్థలను ఉపేక్షించం. వీటిపై చట్ట ప్రకారం నిషేధం విధించడం వంటి చర్యలు తీసుకుంటాం'అని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పేర్కొంది. అంతేకాకుండా, గృహ జ్యోతి, గృహ లక్ష్మి, అన్న భాగ్య, యువ నిధి, శక్తి వంటి అయిదు గ్యారెంటీలను పునరుద్ఘాటించింది. 'ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరిగే క్యాబినెట్ మొదటి రోజు సమావేశం నుంచే ఈ హామీలను అమలు చేస్తాం. ఇదే నా ఆరో హామీ'అని ఖర్గే ఈ సందర్భంగా ప్రకటించారు. తమకు అధికారమిస్తే హామీలన్నిటినీ అమలు చేసేందుకు కట్టుబడి ఉంటామని శివకుమార్ అన్నారు.

కాంగ్రెస్ ప్రకటించిన పథకాలివీ..

ప్రభుత్వ బస్సుల్లో రాష్ట్రమంతటా మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు వీలు కల్పించే పథకం శక్తి. ప్రతి కుటుంబం మహిళా యజమానికి నెలకు రూ.2 వేల ఆర్థిక సాయం అందించే గృహ లక్ష్మి పథకం. గృహస్తులందరికీ నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందించే గృహ జ్యోతి పథకం. అన్న భాగ్య పథకం ద్వారా నిరుపేదల కుటుంబాలకు నెలకు 10 కిలోల ఆహారధాన్యాల పంపిణీ. 'యువ నిధి'ద్వారా నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు నెలకు రూ.3 వేల భృతి, 18–25 ఏళ్ల నిరుద్యోగ డిప్లొమా గ్రాడ్యుయేట్లకు రెండేళ్లపాటు రూ.1,500 సాయం. వీటితోపాటు అవినీతిని వెలుగులోకి తెచ్చే కర్ణాటక విజిల్‌బ్లోయర్స్ రక్షణకు చట్టం. పన్ను ఆదాయంలో కేంద్రం నుంచి న్యాయబద్ధంగా కర్ణాటకకు రావాల్సిన వాటాను డిమాండ్ చేయడం. సమాఖ్య వ్యవస్థలో రాజ్యాంగ హక్కులను దెబ్బతీసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవడం. కేంద్రం తీసుకువచ్చిన నూతన విద్యావిధానాన్ని తిరస్కరిస్తూ రాష్ట్ర విద్యా విధానానికి రూపకల్పన చేయడం.

హనుమపై అంత ద్వేషమా?

కాంగ్రెస్ చరిత్రంతా ఉగ్రవాదం, ఉగ్రవాదుల సంతుష్టీకరణే: మోదీ



బహిరంగ సభలో దప్పు వాయిస్తున్న మోదీ

హొసపేటె/రాయచూరు రూరల్/సాక్షి, బళ్లారి: కర్ణాటకలో అధికారంలోకి వస్తే బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం కర్ణాటకలోని విజయనగర జిల్లాలో ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. ''కాంగ్రెస్ చరిత్రంతా ఉగ్రవాద, ఉగ్రవాదుల సంతుష్టీకరణమయం. ఉగ్రవాదులు హతమైతే కన్నీరు కారుస్తుంది. చివరికి సైనికులనూ అవమానిస్తుంది. సర్జికల్ దాడులకు రుజువులు డిమాండ్ చేస్తుంది. బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్లో ఉగ్రవాదులు హతమయ్యారని విని కాంగ్రెస్ అత్యున్నత నేత కళ్ల వెంట బొటబొటా నీళ్లు రాలాయి! గతంలో వారికి రామునితో సమస్య. ఇప్పుడు జై బజరంగ బలీ అని నినదించే వాళ్లతో సమస్య. హనుమంతుడు పుట్టిన గడ్డకు వచ్చి ఆ రామభక్తునికి ప్రణామాలు సమర్పించే భాగ్యం నేడు నాకు దక్కింది. కానీ మన దేశ దౌర్భాగ్యం చూడండి! కాంగ్రెస్ వాళ్లు అప్పట్లో రామున్ని ఖైదు చేసినట్టే ఇప్పుడు హనుమాన్ భక్తులపైనా పడతామంటున్నారు. ఇటువంటి పనుల వల్లే ఆ పార్టీ ఇప్పుడు కేవలం మూడు రాష్ట్రాలకు పరిమితమైంది'' అంటూ దుయ్యబట్టారు. కర్ణాటకను కాంగ్రెస్ ఉగ్రవాదుల అడ్డాగా మారిస్తే తాము వారి వెన్ను విరిచామన్నారు. అలాంటి కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. శ్రీకృష్ణదేవరాయలు పాలించిన విజయనగర సామ్రాజ్యానికి దేశ చరిత్రలో గర్వించదగ్గ స్థానముందన్నారు. ఆ సామ్రాజ్యంలో భాగమైన ఈ ప్రాంతాన్ని కిష్కింద క్షేత్రంగా కొందరు చరిత్రకారులు భావిస్తారు. ఇక్కడికి సమీపంలో హంపికి పక్కనే కొప్పల్ జిల్లాలో ఉన్న అంజనాద్రిని హనుమంతుని జన్మస్థలంగా స్థానికులు నమ్ముతారు. రాయలు చూపిన బాటలోనే దేశాన్ని కేంద్రం ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. రాయచూరు జిల్లా సింధనూరు ర్యాలీలో, చిత్రదుర్గ బహిరంగ సభలోనూ ఆయన మాట్లాడారు. బీజేపీని మళ్లీ గెలిపిస్తే కర్ణాటకను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

పేదలకిచ్చిన ఏ హామీనీ నిలుపుకోని చరిత్ర కాంగ్రెస్‌దంటూ మోదీ ఎద్దేవా చేశారు. ఇప్పుడు సొంత అస్తిత్వమే ప్రమాదంలో పడేసరికి మరోసారి కర్ణాటకలో హామీల పేరుతో ప్రజలను వంచించజూస్తోం

ఖర్గేలకు ఓటుతో బదులివ్వండి

దని ఆరోపించారు. దేశంలో కాంగ్రెస్‌ది ముగిసిన అధ్యాయమన్నారు. తనను విష సర్పం, పనికిరాని కొడుకు అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆయన కొడుకు ప్రియాంక్ చేసిన విమర్శలకు ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, జేడీ(ఎస్) దొందూ దొందేనంటూ మోదీ ఎద్దేవా చేశారు.

బురదలో కూరుకుపోయిన మోదీ హెలికాప్టర్

ప్రధాని మోదీ హెలికాప్టర్ సింధనూర్ వద్ద భారీ వర్షం కారణంగా బురదలో కూరుకుపోయింది. సిబ్బంది ఎంతగానో శ్రమించి పొక్లెయిన్లు తదితరాల సాయంతో దాన్ని బయటికి లాగారు. సంబంధిత వీడియోలు వైరల్‌గా మారాయి. అయితే అది మోదీ కోసం ఉంచిన స్పేర్ హెలికాప్టర్. అప్పటికే ఆయన మరో హెలికాప్టర్లో వెళ్లిపోయారు.

రెచ్చగొట్టే యత్నం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: హనుమాన్‌ను బజరంగ్ దళ్‌తో పోల్చడం సిగ్గుచేటంటూ కాంగ్రెస్ మండిపడింది. తద్వారా మత సెంటిమెంట్లను రగిల్చేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ఆరోపించారు. కోట్లాది హనుమద్భక్తులను అవమానించినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కర్ణాటకలోనూ మోదీది స్వోత్కర్షే

ప్రధానిపై మరోసారి కాంగ్రెస్ నేత రాహుల్ ధ్వజం



శివమొగ్గ: కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో కూడా ప్రధాని మోదీ కేవలం తన గురించి మాత్రమే చెప్పుకుంటున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ''భూమిపై మోదీ ఒక్కరే లేరు. సామాన్య ప్రజలు కూడా ఉన్నారు. కానీ ఆయన మరే విషయమూ మాట్లాడటం లేదు'' అన్నారు. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి తాలూకా బాళేబైలులో మంగళవారం ఎన్నికల ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. మోదీ మొదటగా సామాన్య ప్రజల గురించి మాట్లాడాలని సూచించారు. కర్ణాటకలో సొంత పార్టీ నేతల అవినీతిపై ఆయన ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

ఇదొక లూట్, జూట్ సర్కార్

కర్ణాటక బీజేపీ ప్రభుత్వంపై ప్రియాంకా గాంధీ నిప్పులు

మండ్య: ''మూడున్నరేళ్లుగా కర్ణాటకను పాలిస్తున్న బీజేపీ ప్రజలను మోసం చేసింది. ఇదొక లూట్, జూట్ సర్కారు'' అని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వద్రా విమర్శించారు. మంగళవారం ఇక్కడ కాంగ్రెస్ ప్రచార సభలో ఆమె మాట్లాడారు. లంచగొండి బీజేపీ వద్దని, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం కావాలని అన్నారు. 40 శాతం కమీషన్ల ప్రభుత్వం ప్రజలను లూటీ చేస్తోందని ఆరోపించారు. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ విధించిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు.

మహాత్మాగాంధీ మనవడు అరుణ్ కన్నుమూత



ముంబై: మహాత్మాగాంధీ మనవడు, సామాజిక కార్యకర్త అరుణ్ మణిలాల్ గాంధీ(89) మంగళవారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో కన్నుమూశారు. తన తండ్రి కొంతకాలంగా స్వల్ప అస్వస్థతతో బాధపడుతున్నారని ఆయన కొడుకు తుషార్ గాంధీ చెప్పారు. మహాత్మాగాంధీ నలుగురు కొడుకుల్లో రెండో వాడైన మణిలాల్ గాంధీ కొడుకే అరుణ్ గాంధీ. ఈయన 1934లో దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో పుట్టారు. 12 ఏళ్ల వయస్సులో భారత్‌కు వచ్చి, సేవాగ్రామ్‌లో గాంధీజీతోపాటు గడిపారు. 1948లో తిరిగి దక్షిణాఫ్రికాకు వెళ్లి, అక్కడే సామాజిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1957 ప్రాంతంలో భార్య సునందతోపాటు తిరిగి భారత్‌కు వచ్చారు. టైమ్స్ ఆఫ్ ఇండియాలో 30 ఏళ్లపాటు జర్నలిస్టుగా పనిచేశారు. పేద పిల్లలు, వలస కార్మికుల కోసం పనిచేసే అవని సంస్థతో ఈయనకు సుదీర్ఘ అనుబంధం ఉంది. 1987లో అమెరికాలోని మెంఫిస్‌లోని క్రిస్టియన్ బ్రదర్స్ వర్సిటీలో ఎంకే గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ నాన్ వయొలెన్స్‌ను ఏర్పాటు చేశారు.

పెరుగుతున్న పప్పుధాన్యాల సాగు

గతేడాది కంటే పెరిగిన విస్తీర్ణం • పెసర సాగులో వృద్ధి: కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత సీజన్‌లో దేశవ్యాప్తంగా అన్ని పంటల సాగు విస్తీర్ణం గతేడాది కంటే తగ్గినా పప్పుధాన్యాల సాగు మాత్రం పెరిగినట్లు కేంద్రం వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలో 66.02 లక్షల హెక్టార్లలో వేసవి పంటలు వేయగా, ఈసారి 65.29 లక్షల హెక్టార్లలో సాగు చేశారని వ్యవసాయ శాఖ తాజా గణాంకాల్లో పేర్కొంది. పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం మాత్రం గతేడాది 16.23 లక్షల హెక్టార్లు కాగా ఈసారి 17.57 లక్షల హెక్టార్లని తెలిపింది. పెసర గతేడాది 12.83 లక్షల హెక్టార్లలో ఉండగా అనూహ్యంగా 14.27 లక్షల హెక్టార్లకు పెరిగిందని తెలిపింది. పెసరకు జాతీయంగా పెరిగిన డిమాండ్ దృష్ట్యానే సాగు పెరిగిందని వెల్లడించింది. మినుముల సాగు గతేడాది మాదిరే 3 లక్షల హెక్టార్ల వరకు ఉందని తెలిపింది. వేరుశెనగ, పొద్దుతిరుగుడు వంటి నూనె పంటలు గతేడాది 10.46 లక్షల హెక్టార్లలో సాగవగా ఈ ఏడాది 9.40 లక్షల హెక్టార్లకు తగ్గిందని తెలిపింది.

తిహార్ జైల్లో గ్యాంగ్‌స్టర్ హత్య

'రోహిణి కోర్టు కాల్పుల' నిందితుడిని చంపిన ప్రత్యర్థి గ్యాంగ్

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని తిహార్ జైలులో ఒక ముఠాకు చెందిన ఖైదీల దాడిలో టిల్లు తాజ్‌పురియా అలియాస్ సునీల్ మాన్ అనే గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. హైరిస్క్ వార్డులో ఉన్న టిల్లుపై ప్రత్యర్థి గ్యాంగ్‌స్టర్ యోగేశ్ అలియాస్ తుండా, అతడి అనుచరులు దీపక్ అలియాస్ టిటార్, రాజేశ్, రియాజ్ ఖాన్ దాడికి దిగారు. తమ సెల్‌కున్న ఐరన్ గ్రిల్స్‌ను కోసి టిల్లూ సెల్‌లోకి లోపలికి ప్రవేశించారు. పదునైన ఆయుధంతో ఏకంగా 92సార్లు సార్లు తీవ్రంగా పొడిచినట్లు అధికారులు తెలిపారు.

ఎవరీ టిల్లు..?

ఢిల్లీలోని అత్యంత క్రూరమైన గ్యాంగ్‌ను నడుపుతున్న వ్యక్తిగా టిల్లు గురించి చెబుతారు. 2015లో ఓ కేసులో అరెస్టయి అప్పటి నుంచి తిహార్ జైలులో ఉంటున్నాడు. ఢిల్లీకే చెందిన మరో గ్యాంగ్‌స్టర్ జితేందర్ గోగితో అతనికి చిరకాల శత్రుత్వం. 2021 సెప్టెంబర్‌లో గోగి ఢిల్లీలోని రోహిణి కోర్టులో దారుణ హత్యకు గురయ్యాడు. ఓ కేసులో విచారణకు హాజరయ్యేందుకు వచ్చిన గోగిని లాయర్ల వేషంలో వచ్చిన ఇద్దరు టిల్లు అనుచరులు కోర్టు ఆవరణలోనే కాల్చి చంపారు. ఈ కాల్పులకు తిహార్ జైలు నుంచి టిల్లు ఫోన్‌లో ఆదేశాలిచ్చినట్లు అప్పట్లో వార్తలొచ్చాయి. ఈ ఘటనలో టిల్లు ప్రధాన నిందితుడుగా ఉన్నాడు. తాజాగా టిల్లుపై దాడి చేసిన యోగేశ్‌ను గోగి ముఠాకు చెందిన షార్ప్‌షూటర్‌గా చెబుతున్నారు. గోగి హత్యకు ప్రతీకారంగానే తాజా ఘటన చోటుచేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.





ఢిల్లీలో వాప్కోస్ మాజీ చైర్మన్, ఎండీ రాజీందర్ గుప్తా ఇళ్లలో మంగళవారం సీబీఐ దాడుల్లో దొరికిన రూ.20 కోట్ల పై చిలుకు నోట్ల కట్టలివి. ఆస్తి పత్రాలు, విలువైన వస్తువులనూ స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

బుధవారం : 3 : మే : 2023



పల్లె జాతర

మంగళవారం ధార్వాడ తాలూకా నరేంద్ర గ్రామంలో ద్యామవ్వ, శ్రీదుర్గవ్వ గ్రామదేవతల జాతర. వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు

వారొస్తే రాష్ట్రం, దేశం నాశనమే

- కాంగ్రెస్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధ్వజం
- నంజనగూడ తాలూకాలో ప్రచార సభ
- బెంగళూరులో బృహత్ రోడ్ షో

మైసూరు/ బనశంకరి: కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కితే దేశం, రాష్ట్రం నాశనం అవుతాయని, దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మంగళవారం ఆయన మైసూరు జిల్లాలోని నంజనగూడు తాలూకా హోసకోటె గ్రామంలో బీజేపీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ హైకమాండ్ రాష్ట్రాన్ని ఒక ఏటీఎంలా మార్చుకుంటుందని ఆరోపించారు. అవినీతి తప్ప ఎలాంటి అభివృద్ధి జరగదని, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని, బీజేపీకి వేసే ఒక్కో ఓటు కర్ణాటక భద్రతకు, అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. తాము నిషేధించిన పీఎఫ్ఐను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తిరిగి ఆ నిషేధాన్ని ఎత్తివేస్తారని అన్నారు. అధికారంలో ఉండగా అవినీతి తప్పించి ఇంకేమి అభివృద్ధి చేయలేదన్నారు.



బెంగళూరులో రోడ్ షోలో అభివాదం చేస్తున్న హోంమంత్రి అమిత్ షా



కలబురిగిలో జరిగిన రోడ్ షోలో ప్రధాని మోదీ

బెంగళూరులో భారీ రోడ్ షో

బెంగళూరు బీటీఎం లేఔట్‌లో మంగళవారం సాయంత్రం కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారీ రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షోలో భారీ ఎత్తున బీజేపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై, బీజేపీ విజయం సాధించాలి, జై మోదీ అని నినాదాలతో హోరెత్తించారు. బీజేపీ కి ఓటు వేయాలని ప్రజలకు అమిత్ షా విన్నవించారు. బీజేపీ కార్యకర్తలు కాషాయ శాలువాలు తిప్పుతూ జైభజరంగభళి, జైశ్రీరామ్, జైజైశ్రీరామ్ అంటూ నినదించారు. అమిత్‌షా రోడ్‌షో కు బీటీఎంలేఔట్‌లో భారీ స్పందన రావడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. బీటీఎం లేఔట్‌లో రోడ్‌షోకు భారీఎత్తున బీజేపీ కార్యకర్తలు, ప్రజలు తరలిరావడంతో కాషాయమయంగా మారింది. రోడ్‌షో లో బీటీఎం లేఔట్ బీజేపీ అభ్యర్థి శ్రీదర్‌రెడ్డి, దక్షిణ ఎంపీ తేజస్వీసూర్య పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సుడిగాలి పర్యటన

మరోవైపు ప్రధాని మోదీ ఉత్తర కర్ణాటక జిల్లాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. హొసపేట, సింధనూరు, చిత్రదుర్గలో బహిరంగ సభల్లో పాల్గొని కాంగ్రెస్‌పై విమర్శలతో దాడి చేశారు. తండ్రీ కొడుకులకు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక్‌ఖర్గేలపై మోదీ ధ్వజమెత్తారు.



ఐటీ సిటీలో అమిత్ షా రోడ్‌లో జనం



హొసపేటె బహిరంగ సభలో మోదీ

మోదీకి అవేమీ పట్టవు: రాహుల్

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పలు జిల్లాల్లో ప్రచార సభల్లో పాల్గొన్నారు. శివమొగ్గ తీర్థహళ్లి వద్ద సభలో ప్రసంగిస్తూ మోదీ పరిపాలనలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయని, ఆయనకు అవేమీ పట్టవని దుయ్యబట్టారు. చిక్కమగళూరులో జన సందోహంతో రోడ్ షో నిర్వహించారు.



చిక్కమగళూరులో రాహుల్ రోడ్ షో

ఇంట్లో అబార్షన్ల దందా

- శిర పట్టణంలో వెలుగులోకి

తుమకూరు: జిల్లాలోని శిర పట్టణంలోని జ్యోతినగరలో ఉన్న ఒక ఇంటిలో అబార్షన్లు చేస్తున్నారనే సమాచారం రావడంతో రాష్ట్ర సమగ్ర అబార్షన్ సేవల నోడల్ అధికారి బీఆర్ చంద్రిక సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అబార్షన్‌కు వినియోగిస్తున్న పరికరాలను, ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఆయాగా పని చేస్తున్న సౌజన్యపై కేసు నమోదు చేశారు. చంద్రిక మాట్లాడుతూ అనధికారికంగా అబార్షన్‌లు చేస్తున్నారని తెలిసి దాడి చేసినట్లు తెలిపారు. ఇలాంటి అబార్షన్ల కారణంగా మరణాలు సంభవించడంతో పాటు శాశ్వత వైకల్యం, ఇన్‌ఫెక్షన్, ఇతరత్రా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ దందా వెనుక ఒక నర్సు పాత్ర ఉందని, అందరినీ కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఒక నర్సు ఈ సెంటర్‌ను నడుపుతోందని, పెళ్లికానివారు, కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తేలినవారికి అబార్షన్లను చేస్తూ పెద్దమొత్తంలో డబ్బు వసూళ్లు చేస్తున్నట్లు తెలిసింది. ఆమె గతంలో తురువెకెరె పీహెచ్‌సీలో ఉద్యోగం చేసేది. విధులకు సరిగా రాకపోవడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పటినుంచి అబార్షన్లు చేయడం ప్రారంభించింది. పావగడలోని ఒక స్కానింగ్ సెంటర్ ఆమెకు సహకరిస్తోంది.

రాహుల్ సభలో హీరో శివరాజ్

శివమొగ్గ: చిత్ర నటుడు శివరాజ్‌కుమార్ మూడు రోజులుగా శివమొగ్గ జిల్లాలో సుడిగాలి పర్యటనలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో తీర్థహళ్లి బాళెబైలులో మంగళవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సమావేశంలో కూడా పాల్గొన్నారు. రాహుల్‌గాంధీతో పాటు వేదికను శివరాజ్‌కుమార్ పంచుకున్నారు.

ఈ సందర్భంగా శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ... తాను రాహుల్‌గాంధీ అభిమానినని, ఆయనను చూసేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. భారత జోడో యాత్రను చూసి ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయన ఫిట్‌నెస్ ఎంతో నచ్చిందన్నారు. తన భార్య గీతా క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చిందని, అయితే తాను రాజకీయాల్లోకి రాబోనని తెలిపారు.

న్యూస్‌రీల్

తుమకూరులో నళిన్



తుమకూరు: నగర విధానసభ నియోజకవర్గ పరిధిలో బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్ ప్రచారం నిర్వహించారు. నగరంలోని సప్తగిరి లేఔట్, నలంద స్కూల్ రోడ్డులో ఇంటింటికి వెళ్లి తమ పార్టీ కరపత్రాలను పంచి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నళిన్ మాట్లాడుతూ... ప్రపంచం నచ్చిన ప్రధాని మోదీ గురించి అవహేళనకరంగా మాట్లాడుతున్న ప్రియాంక ఖర్గే తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈసారి కలబురిగి నియోజకవర్గ ప్రజలు కూడా ఖర్గేను క్షమించరని, ఆయనను ఓడిస్తారని జోస్యం చెప్పారు. బీజేపీకి అన్ని ప్రాంతాలను అనూహ్య స్పందన వస్తోందని, తిరిగి పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. తుమకూరులో జ్యోతిగణేశ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

పరమేశ్వర్‌తో విభేదాలు లేవు: సిద్దు

తుమకూరు: రాష్ట్ర సమస్యలకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పరిష్కారం ఉందని మాజీ సీఎం సిద్ధరామయ్య చెప్పారు. కొరటిగెరె రాజీవ్ భవన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్రచార సమావేశంలో సిద్ధరామయ్య మాట్లాడుతూ పార్టీ ఇప్పటికే 5 గ్యారంటీ కార్డులను రాష్ట్ర ప్రజలకు ఇచ్చినట్లు తెలిపారు. కొరటిగెరెలో పరమేశ్వర గెలిస్తే తాను గెలిచినట్లే భావిస్తానని చెప్పారు. పరమేశ్వర తాను 8 ఏళ్లుగా ప్రతిపక్ష పార్టీలో ఉండి కలసి పని చేశామని, 2013లో ఓడిపోయిన తర్వాత ఎమ్మెల్సీగా అయిన తర్వాత హోం మంత్రిగా మారిన తర్వాత పరమేశ్వర తాను కలసి పని చేశామని, అయితే కొందరు తమమధ్య విభేదాలు ఉన్నాయని ప్రచారం చేశారని, అయితే తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని తెలిపారు.

చింతామణిలో ప్రియాంక ప్రచారం



రోడ్డు షోలో పాల్గొన్న ప్రియాంక గాంధీ

చింతామణి: చింతామణి నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ మంగళవారం ప్రచారం చేశారు. పట్టణ శివార్లలోని ప్రగతి పాఠశాల ఆవరణలో హెలికాప్టర్‌లో దిగారు. అక్కడి నుంచి వివిధ కూడళ్ల గుండా రోడ్ షో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం అవినీతిమయమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సర్కారును ఏర్పాటు చేయడం ఖాయమన్నారు.

క్రియాశీలక రాజకీయాల్లో లేను: రమ్య



మీడియాతో మాట్లాడుతున్న రమ్య

మండ్య: ప్రస్తుతానికి తాను క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చే విషయంపై ఇంకా ఆలోచించలేదని, భవిష్యత్తులో ఆలోచిస్తానని మాజీ ఎంపీ రమ్య స్పష్టం చేశారు. మీడియాతో మంగళవారం మాట్లాడుతూ ప్రస్తుతం తాను సినిమా నిర్మాణంలో బిజీగా ఉన్నానని తెలిపారు. ఉత్తరకాండ అనే సినిమాను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. తాను తరచూ మండ్యకు వస్తూ పోతుంటానన్నారు. ఇటీవలే నిమిషాంబ దేవాలయానికి వచ్చి వెళ్లానన్నారు. కెమెరా ముందే కనిపించడం లేదని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే విషయంపై ఆలోచన లేదన్నారు. తమ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థుల తరపున స్టార్ ప్రచారకురాలిగా వచ్చినట్లు తెలిపారు. మండ్యతో తనకు అవినాభావ సంబంధం ఉందన్నారు. మండ్య తన తల్లి ఊరు అని, తాను కష్టాల్లో ఉన్నప్పుడు ఇక్కడి ప్రజలు అండగా నిలిచారని, దాన్ని ఎప్పటికి మరవబోనన్నారు.

స్వయంవరం పెట్టండి

మండ్యలో ఒక ఫార్మ్‌హౌజ్‌ను నిర్మించుకుంటానని చెప్పారు. అలాగే ఒక గౌడ సామాజికవర్గ అబ్బాయిని పెళ్లి చేసుకుంటానని తెలిపారు. మొదట పెళ్లికొడుకుని నా కోసం వెతికి చూడాలని, అవసరం అయితే స్వయంవరం ఏర్పాటు చేయాలని మీడియాతో చమత్కరించారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రచారం

- ఫేస్‌బుక్ గ్రూప్‌పై కేసు

బనశంకరి: ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా, శాంతి సామరస్యానికి భంగం కలిగించేలా పోస్టులు పెట్టిన ఫేస్‌బుక్ అడ్మిన్స్‌పై బనశంకరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కర్ణాటక మరో వెస్ట్‌బెంగాల్, పంజాబ్, కేరళ కానుందని, హిందువులు తమహక్కుల్ని కాపాడుకోవడానికి ఫలానా పార్టీకి ఓటు వేయాలని పోస్టులో కోరారు. పంజాబ్, కేరళ లో ఏమైంది అనేది మీకు తెలుసునని పోస్ట్ పెట్టిన పీవైజేఎం-పద్మనాభనగర నియోజకవర్గం అని పేరున్న ఫేస్‌బుక్ గ్రూప్‌పై అధికారులు కేసు పెట్టారు.

మసీదుల దగ్గర ప్రచారం చేసినందుకు

ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రచారం చేశారని కాంగ్రెస్, ఎస్‌డీపీఐ, బీఎస్‌పీ, ఏఏపీ పార్టీ కార్యకర్తల పై ఆరోపణలు వచ్చాయి. గత నెల 28 తేదీన శుక్రవారం నమాజ్ సమయంలో డీజే హళ్లి మసీదు వద్ద ఎస్‌డీపీఐ, కాంగ్రెస్, బీఎస్‌పీ కార్యకర్తలు ప్రచారం చేశారు. మసీదులోకి వెళ్లేవారికి, వచ్చేవారికి ఓటే వేయాలని అడిగారు. ఈ వీడియోలు, ఫోటోలు బయటకు రావడంతో ఆ ప్రచారం చేసినవారిపై డీజే హళ్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.



లోకాయుక్తకు చిక్కిన ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు

యశవంతపుర: ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకుల నుంచి లంచం తీసుకుంటూ ఎస్ఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు లోకాయుక్తకు చిక్కారు. వివరాలు...గదగ జిల్లా గజేంద్రగడ పట్టణంలోని డాబాలో బెట్టింగ్ నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారికి స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి ఎస్ఐ రాఘవేంద్ర రూ. 2 లక్షలు డిమాండ్ చేశాడు. రూ. లక్ష ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. సమాచారం అందుకున్న లోకాయుక్త డీఎస్పీ శంకర్ తన సిబ్బందితో నిఘా ఉంచారు. ఇద్దరు కానిస్టేబుళ్లు వినాయక అనే వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకున్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపండి

యశవంతపుర: కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం చేసినంత అవినీతి దేశంలో ఎక్కడ జరగలేదని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఆరోపించారు. ఎన్నికలలో భాగంగా ఆయన మంగళవారం మంగళూరులో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ శ్రీరామ, హనుమ పేరుతో నీచమైన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ జాతులు, మతాల మధ్య విషబీజం వేస్తున్నట్లు ఆరోపించారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం 40 శాతం కమీషన్‌తో దేశంలో అవినీతిలో మొదటి స్థానంలో ఉందన్నారు. బీజేపీ విడుదల చేసి ప్రణాళికలో ఎలాంటి అభివృద్ధి అంశాలు లేవన్నారు. రాష్ట్ర ప్రజలకు బీజేపీపై నమ్మకంలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయమన్నారు.

డీకే హెలికాప్టర్‌కు ప్రమాదం



పక్షి తగలడంతో దెబ్బతిన్న హెలికాప్టర్ అద్దం

- పక్షి ఢీకొని అద్దాలు బద్ధలు

శివాజీనగర: ఎన్నికల ప్రచారం కోసం వెళుతున్న కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ హెలికాప్టర్‌ను ఓ పక్షి ఢీ కొనటంతో హెలికాప్టర్ అద్దాలు పగిలిపోగా, వెంటనే ల్యాండింగ్ అయిన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం బెంగళూరులో మేనిఫెస్టో విడుదల తరువాత ఆయన హెచ్ఏఎల్ విమానాశ్రయం నుంచి కోలార్‌లోని ముళబాగిలులో ప్రచారం కోసం హెలికాప్టర్‌లో బయలుదేరారు. 10 నిమిషాలకే హోసకోట వద్ద ఓ పక్షి హెలికాప్టర్ ముందు కుడివైపు అద్దాలను ఢీ కొంది. ఆ తాకిడికి అద్దం పగిలి ముక్కలైంది. ఆ సమయంలో పైలెట్, డీకే, మరో ఐదు మంది ఉన్నారు. పైలట్ వెంటనే హెచ్ఏఎల్‌కు మళ్లించి క్షేమంగా ల్యాండయ్యారు. హెలికాప్టర్‌లో డీకేని ఇంటర్వ్యూ చేస్తున్న టీవీ చానెల్ సిబ్బంది కులకర్ణి, డీకే సలహాదారుడు అమిత్ పాళ్యకు చిన్నపాటి గాయాలయ్యాయి.

దేవుడే కాపాడాడు

ఈ ప్రమాదంపై డీ.కే మాట్లాడుతూ నమ్మిన శక్తి, దేవుడు తనతో ఉన్నాడని, కాపాడారని అన్నారు. తాము హోసకోటను సమీపిస్తుండగానే పెద్ద పక్షి ఢీకొట్టిందని తెలిపారు. పైలెట్ చాకచక్యంగా నడిపి తమను కాపాడారని చెప్పారు.



తిరిగి ల్యాండయిన హెలికాప్టర్

దేవెగౌడ కుటుంబంపై సుమలత ఫైర్

- కుటుంబ రాజకీయాలు తిప్పికొట్టాలంటూ పిలుపు

దొడ్డబళ్లాపురం: మూడు తరాలుగా ఒకే కుటుంబానికి అవకాశం ఇస్తున్నారని, తాత, కుమారుడు, మనవడు ఇలా దేవెగౌడ కుటుంబానికి ఎన్ని తరాలు రాజకీయ భవిష్యత్తు ఇస్తారని మండ్య ఎంపీ సుమలత రామనగర ప్రజలను ప్రశ్నించారు. మంగళవారం రామనగరలో బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సభలో మాట్లాడిన ఆమె అంబరీష్ రాజకీయ జీవితం ప్రారంభించిందే రామనగర నుంచి అని, రామనగరకు, తమ కుటుంబానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. మండ్యలో నాపై ఎన్నికల్లో పోటీ చేసినవారే ఇక్కడా పోటీ చేస్తున్నారని, తను వారి కుటుంబంపై ఎన్నికల్లో పోటీ చేయడమే తప్పుగా వారు భావించారన్నారు. కనీసం మహిళ అనే గౌరవం లేకుండా ఎన్నో మాటలు అన్నారన్నారు. ఎంపీ ఎన్నికల్లో రూ.150 కోట్లు ఖర్చు చేసినా మండ్య ప్రజలు తనను గెలిపించారన్నారు. ఈ ఎన్నికల్లో స్థానికులకు ఓటువేసి గెలిపించాలన్నారు. రైతు బిడ్డలమని చెప్పుకునే దేవెగౌడ కుటుంబం ఏ రైతు వందల కోట్ల ఆస్తి సంపాదించాడో చెప్పాలన్నారు.

ఓటర్లను బెదిరిస్తే కఠిన చర్యలు

- బీబీఎంపీ కమిషనర్

బనశంకరి: బెంగళూరులో ఓటర్లను బెదిరించి రౌడీ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని నగర ఎన్నికల అధికారి, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీట్ ద ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. పోలీసుల ద్వారా రౌడీ కార్యకలాపాలను నియంత్రించామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా పెట్టామని చెప్పారు. ఓటర్లపై బెదిరింపు దిగేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బెంగళూరులో ప్రతి ఎన్నికల్లో 52 శాతం మాత్రమే పోలింగ్ జరుగుతుండగా, ఈసారి 75 శాతానికి పెంచడానికి అనేక జాగృతి కార్యక్రమాలు చేపట్టామన్నారు. యువ ఓటర్లు సరైన అభ్యర్థికి ఓటువేయాలని సూచించామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవడం గురించి జాగృతం చేశామని తెలిపారు.

ఎన్నికల అక్రమాలు జరుగుతుంటే ప్రజలు సీ విజిల్ యాప్‌లో ఫోటో, వీడియో ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే అధికారులు ఘటనాస్థలానికి వెళ్లి చర్యలు తీసుకుంటారని తెలిపారు. బీబీఎంపీ పాలనా వ్యవస్థ అనేక ఏళ్ల సవాళ్లు ఎదుర్కొంటోందని, ఇతర సవాళ్లు కూడా ఉన్నాయని అన్నింటినీ సమర్థంగా ఎదుర్కొన్నామని చెప్పారు. నగర రోడ్లపై చిన్న గుంత ఏర్పడినా వెంటనే పూడ్చివేయాలన్నారు. రోడ్ల గుంతల సమస్య ప్రతి ఏటా ఉంటుందని చెప్పారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ సిబ్బంది, గ్రామస్తుల మధ్య ఘర్షణ

- కారు, బైక్‌లకు నిప్పు

దొడ్డబళ్లాపురం: భూవివాదం నేపథ్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సిబ్బంది, గ్రామస్తుల మధ్య ఘర్షణ చోటుచేసుకుని కార్లు, బైక్‌లకు నిప్పంటించిన సంఘటన బెంగళూరు దక్షిణ తాలూకా వడేరహళ్లి గ్రామం వద్ద చోటుచేసుకుంది. వడేరహళ్లి గ్రామం పరిధిలో 137వ సర్వే నంబర్‌లో 36 కుంటల భూమికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారు రాత్రికి రాత్రి ఫెన్సింగ్ వేసారు. అయితే ఇదే భూమిలో గ్రామస్తులు చాలా కాలంగా వ్యవసాయం చేస్తున్నారు. తమ భూమిలో ఎలా ఫెన్సింగ్ వేస్తారని గ్రామస్తులు మంగళవారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సిబ్బందితో ఘర్షణపడ్డారు. ఘర్షణ తారాస్థాయికి వెళ్లి ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లోని మధువన ఫార్మ్‌హౌస్‌లో ఉన్న 8 బైక్‌లకు గ్రామస్తులు నిప్పంటించారు. సెక్యూరిటీ రూంను, మరో 5 బైక్‌లు, నాలుగు కార్లను కూడా ధ్వంసం చేసారు. ఘటనకు సంబంధించి గ్రామస్తులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సిబ్బంది పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. కగ్గలీపుర పోలీసులు ఇరువైపుల ఫిర్యాదులు స్వీకరించి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడడంతో పోలీసులను మోహరింపచేసారు. జిల్లా ఎస్పీ కార్తీక్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



కాలిపోయిన వాహనాలు

హై ఓల్టేజ్ సీట్లలో అమీతుమీ

- సీఎం, మాజీ సీఎం, ప్రముఖుల నియోజకవర్గాల్లో ఉత్కంఠ

సాక్షి, కర్ణాటక ఎలక్షన్ డెస్క్: కర్ణాటక ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రముఖులు పోటీ చేస్తోన్న నియోజకవర్గాలపై అందరి దృష్టి నిలిచింది. సీఎం బసవరాజ బొమ్మై, సీఎల్పీ నేత సిద్దరామయ్య, కేపీసీసీ నేత డీకే శివకుమార్, యడియూరప్ప తనయుడు బీవై విజయేంద్ర, కుమారస్వామి, ఆయన కొడుకు నిఖిల్‌గౌడ తదితరుల నియోజకవర్గాల్లో గాలి ఎలా ఉందనేది చర్చనీయాంశమైంది. ప్రముఖులు కావడం, నియోజకవర్గాల్లో అన్ని విధాలా పట్టు ఉన్న మూలంగా వీరి విజయానికి ఢోకా లేకపోవచ్చనేది మెజారిటీ మాట. కానీ సమయం అనుకూలించకపోతే ఎవరికైనా పరాజయం తప్పదని అనేకసార్లు ఎన్నికల ఫలితాలు చాటిచెప్పాయి.

శిగ్గావ్‌లో సీఎం బొమ్మైకు పరీక్ష

హావేరి జిల్లా శిగ్గావ్ నుంచి బీజేపీ అభ్యర్థిగా సీఎం బసవరాజ్ బొమ్మై పోటీలో ఉన్నారు. బొమ్మై గత మూడు పర్యాయాలు 2008లో 12వేలు, 2013లో 9,600, 2018 ఎన్నికల్లో 9,200 మెజారిటీతో గట్టెక్కడం గమనార్హం. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా యాసిర్ అహ్మద్ ఖాన్ పఠాన్ బరిలో ఉన్నారు. బొమ్మైకి లింగాయత్ వర్గాల ఓటర్ల బలముంటే, కాంగ్రెస్‌కు మైనారిటీ ఓటర్లు అండగా ఉన్నారు. ఈసారి పోటీ గట్టిగానే ఉండొచ్చని తెలుస్తోంది.

చెన్నపట్టణలో కుమారకు పోటీ

రామనగర జిల్లా చెన్నపట్టణ నుంచి జేడీఎస్ తరపున మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి బరిలో ఉన్నారు. కాంగ్రెస్‌కు పెట్టని కోటగా చెన్నపట్టణను చెబుతారు. ప్రస్తుతం బీజేపీ తరపున పోటీ చేస్తోన్న సీపీ యోగేశ్వర్ 1999, 2004, 2011, 2013 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. యోగేశ్వర్ ఒకసారి స్వతంత్ర, మరోసారి కాంగ్రెస్, ఇంకోసారి బీజేపీ, నాల్గోసారి ఎస్పీ నుంచి విజయం సాధించారు. 2018లో జేడీఎస్ తరపున పోటీ చేసిన కుమారస్వామి స్వల్ప మెజారిటీతో గట్టెక్కారు. మరోసారి ఇద్దరి మధ్య పోటీ నెలకొంది.



గతంలో కంటే ఈసారి అధిక పోటీ ఉండొచ్చు

వరుణలో సిద్దుకు తేలికేనా?

మైసూరు జిల్లా వరుణలో కాంగ్రెస్ మాజీ సీఎం సిద్దరామయ్యకు ఎదురు లేదు. 2008, 2013 భారీ మెజారిటీతో విజయం సాధించారు. 2018లో తన తనయుడు యతీంద్రను పోటీ చేసి గెలిపించారు. అయితే పక్క నియోజకవర్గమైన చాముండేశ్వరిలో నిలబడిన సిద్దరామయ్య ఓడిపోయారు. ఈసారి వరుణ నుంచే బరిలో ఉన్నారు. ఆయనకు మంత్రి వి.సోమణ్ణ పోటీ చేస్తున్నారు.

రామనగరలో తనయుని కోసం..

రామనగర నుంచి మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి తనయుడు నిఖిల్‌గౌడ జేడీఎస్ నుంచి బరిలో దిగారు. రామనగరలో 2004 నుంచి నాలుగుసార్లు హెచ్‌డీ కుమారస్వామి గెలుస్తూ వచ్చారు, గత ఎన్నికల్లో భార్య అనితకు అప్పజెప్పారు. ఉప ఎన్నికల్లో ఆమె కూడా గెలిచారు. ఈసారి తనయుడు పోటీలో ఉన్నాడు. దంపతులిద్దరూ కొడుకు కోసం ప్రచార వ్యూహాల్లో మునిగారు.

విజయేంద్రకు ఢోకా లేదా!

శివమొగ్గ జిల్లా శికారిపుర నుంచి మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప తనయుడు బీవై విజయేంద్ర బీజేపీ టికెట్‌తో పోటీలో ఉన్నారు. శికారిపురలో 1983 నుంచి 2018 వరకు ఒకసారి తప్ప యడియూరప్ప గెలుపొందారు. శికారిపుర అంటే యడియూరప్పే అనే పేరు వచ్చింది. ఈసారి వారసున్ని బరిలోకి దింపారు. గెలుపు నల్లేరుపై నడకే అంటున్నారు.

కనకపురలో ఇద్దరు దిగ్గజాలు

కనకపురలో కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌కు ఓడిపోయింది లేదు. ఇక్కడ కాంగ్రెస్ – జేడీఎస్ మధ్యనే పోటీ ఉంటోంది. బీజేపీది మూడో స్థానమే. గతంలో జేడీఎస్ నుంచి డీకేశిపై పోటీ చేసి ఓడిన నారాయణగౌడ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ నుంచి సీనియర్ మంత్రి ఆర్.అశోక్ డీకేను ఎదుర్కొంటున్నారు. ఇద్దరూ ఒకే వర్గానికి చెందినవారు, సమ ఉజ్జీలు కావడంతో ఈసారి ఏం జరుగుతుందా అనేద ఉత్కంఠ నెలకొంది.

క్లుప్తంగా

గాలి సోమశేఖరరెడ్డిని గెలిపించండి



ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ నామాల గోవిందరాజులు తదితరులు

బళ్లారిఅర్బన్: బళ్లారి నగర నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున బరిలో ఉన్న గాలి సోమశేఖరరెడ్డిని గెలిపిస్తేనే బళ్లారి అభివృద్ధి సాధ్యమని 11వ వార్డు కార్పొరేటర్ నామాల గోవిందరాజులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన వార్డు పరిధిలో ఇంటింటా ప్రచారం చేశారు. బలిజ సమాజానికి చెందిన నేతలు, కార్యకర్తలతో సమావేశం కూడా నిర్వహించి బీజేపీని గెలిపించాలని కోరారు. బళ్లారిలో అన్ని వర్గాల సంక్షేమం కోసం గాలి సోమశేఖరరెడ్డి కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. బలిజ సమాజ ప్రముఖులు సప్తగిరి సత్యనారాయణ,శ్రీనివాస్,మంజునాథ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పట్టం కట్టండి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి

సాక్షి,బళ్లారి: బళ్లారి అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన నగరంలోని బాపూజీ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. జనం మార్పు కోరుకుంటున్నారన్నారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో అనేక పథకాలు పొందుపరిచిందన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలన్నారు.

బీజేపీతో అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న కుమార

రాయచూరు రూరల్: బీజేపీకి ఓటు వేస్తే అభివృద్ధి జరగదని జేడీఎస్ నేత, మాజీ సీఎం కుమారస్వామి ఆరోపించారు. జిల్లాలో జేడీఎస్ అభ్యర్థుల తరఫున మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 40శాతం కమీషన్లు, నిత్యావసర ధరల పెంపుతో ప్రజలు బీజేపీపై విరక్తి చెందారన్నారు. అందుకే ప్రధాని మోదీ సభలకు ప్రజలు రావడం లేదన్నారు. కాంగ్రెస్‌లో ఖర్గే బలం నశించిపోతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉన్న జేడీఎస్‌ను గెలిపించాలని కోరారు.

రాయచూరురూరల్: కుమారస్వామి రాయచూరులో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ 40 శాతం కమీషన్లతో అవినీతిలో కూరుకుపోయిందన్నారు. ప్రజలు జేడీఎస్‌వైపు చూస్తున్నారన్నారు. కరెమ్మను గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామన్నారు.

అకాల వర్షాలతో అరటిపంటకు నష్టం



నేలకూలిన అరటి గెలలను పైకెత్తుతున్న రైతు

కంప్లి: ఈదురుగాలులతో కురిసిన వర్షానికి తాలూకాలోని నెంబర్ 2 ముద్దాపుర గ్రామంలో అరటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతు డీ.కొండయ్యకు చెందిన 3.50 ఎకరాల యాలక్కి అరటి పంట నేలకొరిగింది. ఇటీవలే టన్ను అరటి మార్కెట్‌కు తరలించాడు. మిగతా పంట 15 రోజుల్లో కోయాల్సి ఉండగా అకాల వర్షాలతో చెట్లు నేలకొరిగి సుమారు 65 శాతం మేర పంటకు నష్టం జరిగింది. సుమారు 6 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోతున్నాడు.

గ్రామస్తులకు బుజ్జగింపు

కంప్లి: ఇళ్ల పట్టాలు ఇవ్వని పక్షంలో ఎన్నికలను బహిష్కరిస్తామని కంప్లి షుగర్స్ హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులు హెచ్చరించిన నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ ఆదేశాలమేరకు తహసీల్దార్, మున్సిపల్ అధికారి వారితో చర్చించారు. రాష్ట్ర మాహితి హక్కు, సామాజిక కార్యకర్తల వేదిక జిల్లా అధ్యక్షుడు టీహెచ్‌ఎం రాజ్‌కుమార్ మాట్లాడుతూ సుందరి షుగర్స్ పేరిట ఉన్న నమూన రద్దు చేసి కర్ణాటక గృహ మండలి పేరిట నమూన 3 ప్రకారం చేయాలని హామీ ఇచ్చిన పక్షంలో ఎన్నికల బహిష్కారం వాపసు తీసుకుంటామన్నారు. ఈ విషయం జిల్లాధికారి దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

పేదల సమస్యలు పరిష్కరిస్తా

బళ్లారి రూరల్: తనను గెలిపిస్తే పేదల సమస్యలు పరిష్కరిస్తానని సందూరు నుంచి కేఆర్‌పీ తరఫున బరిలో ఉన్న అభ్యర్థి వేబకుమారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆమె తోరణగల్లులో ప్రచారం చేశారు.

ముక్కోణపు పోరులో విజేత ఎవరో ?

- కోలారులో రసవత్తరంగా ఎన్నికల పోరు
- పట్టు కోసం జేడీఎస్ తాపత్రయం
- పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు
- ఖాతా తెరవడానికి బీజేపీ తహతహ

కోలారు: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జరిగిన మొదటి ఎన్నికలోనే కాంగ్రెస్ పార్టీపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన స్వాతంత్ర్య సమర యోధుడు పట్టాభిసీతారామన్, దున్నే వాడిదే భూమి నినాదంతో పోరాటానికి ప్రాతినిధ్యం వహించిన పి వెంకటగిరియప్ప ప్రాతినిధ్యం వహించిన కోలారు నియోజకవర్గం రాష్ట్ర రాజకీయాల్లో ఎంతో గుర్తింపు పొందింది. కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలకు గట్టి పునాదులు కలిగిన నియోజకవర్గం. ఇంతవరకు జరిగిన 15 శాసనసభ ఎన్నికల్లో గెలిచింది కాంగ్రెస్, జేడీఎస్, స్వతంత్ర అభ్యర్థులు మాత్రమే. నియోజకవర్గంలో ఇంతవరకు కమలం వికసించలేదు.

ప్రస్తుత ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు ఉన్నారు. జేడీఎస్ నుంచి సిఎంఆర్ శ్రీనాథ్, కాంగ్రెస్ నుంచి కొత్తూరు మంజునాథ్, బీజేపీ నుంచి వర్తూరు ప్రకాష్ పోటీ చేస్తున్నారు. వర్తూరు ప్రకాష్ గత మూడు ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి రెండుసార్లు గెలిచారు. కాంగ్రెస్‌లో చేరడానికి



కోలారులోని క్లాక్‌టవర్

విఫల యత్నం చేసిన వర్తూరు ప్రకాష్ చివరికి బీజేపీలో చేరి ఆ పార్టీ తరఫున బరిలోకి దిగారు. మాజీ సీఎం సిద్దరామయ్య కోలారు నుంచి పోటీ చేయక పోవడంతో ఆ స్థానంలో కాంగ్రెస్ టికెట్‌ను పార్టీ



కాంగ్రెస్ అభ్యర్థి కొత్తూరు మంజునాథ్



జేడీఎస్ అభ్యర్థి సీఎంఆర్ శ్రీనాథ్



బీజేపీ అభ్యర్థి వర్తూరు ప్రకాష్

కొత్తూరు మంజునాథ్‌కు ఇచ్చింది.

గెలుపోటములపై గంపెడాశాలు

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంది. తమదే విజయని ఎవరికి వారు ధీమాతో ఉన్నారు. జేడీఎస్ ఒక్కలిగ సముదాయాన్ని, పార్టీ ఓట్లను నమ్ముకుంటే బీజేపీ కురుబ సముదాయంతో పాటు సాంప్రదాయ ఓట్లను నమ్ముకుంది. జాతి ఓట్ల కొరతను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎక్కువగా దళిత, మైనారిటీ ఓట్లపై ఆధారపడి ఉన్నారు. నియోజకవర్గంలో దళిత, మైనారిటీ ఓట్లే కీలకం కాగా దళితుల ఓట్లు కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్, కాంగ్రెస్‌లు పంచుకునే అవకాశం ఉంది. ఇక జయాపజయాలను మైనారిటీ ఓట్లే నిర్ణయించనున్నాయి. మొత్తం ఓటర్లు 2,40,000 మంది కాగా పురుషులు 1.19000 మంది, మహిళలు 1.21,000 మంది ఉన్నారు. కులాల వారీగా ఎస్సీలు 70వేలు, మైనారిటీలు 60వేలు, ఒక్కలిగులు 35వేలు, కురుబలు 25వేలు, బ్రాహ్మణ, వైశ్య, లింగాయత ఓటర్లు 15వేల మంది ఉన్నారు.

స్టార్ ప్రచారకుల అబ్బురం

కోలారు నియోజకవర్గం నుంచే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. జేడీఎస్ తన పంచరత్న రథయాత్రను కోలారు జిల్లా నుంచే ప్రారంభించింది. బీజేపీ తరఫున దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే ప్రచారం చేసి వెళ్లారు.

5న బళ్లారికి ప్రధాని మోదీ రాక

- బహిరంగసభ ఏర్పాట్లకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి

సాక్షి,బళ్లారి: ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 5న బళ్లారికి విచ్చేస్తున్నట్లు బళ్లారి నగర బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖరరెడ్డి తెలిపారు. ప్రధాని రాక సందర్భంగా నగర శివార్లలోని కప్పగళ్ రోడ్డులో సత్యం స్కూలు ఎదురుగా విశాలమైన మైదానంలో చేపట్టిన భారీ బహిరంగ సభ ఏర్పాట్లకు మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బళ్లారి సిటీ, బళ్లారి గ్రామీణ, సండూరు, సిరుగుప్ప, కంప్లి నియోజకవర్గాలనుంచి లక్షలాది మంది కార్యకర్తలు ప్రజలు సభకు తరలిరానున్నారన్నారు. మోదీ పర్యటన బళ్లారి జిల్లాలో ఐదు స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందేందుకు దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను పోటీ చేస్తున్న బళ్లారి నగర నియోజకవకవర్గ పరిధిలోకి మోదీ రానుండటంతో తన విజయం మరింత సులభంగా ఉంటుందన్నారు. నాయకులు విరుపాక్షిగౌడ, మురారిగౌడ, ఇందుశేఖర్, రాజీవ్ తొగరి పాల్గొన్నారు.

కేఎస్ ఆర్టీసీ బస్సు బోల్తా

- ఎన్నికల సిబ్బందికి గాయాలు

సాక్షి,బళ్లారి: ఎన్నికల సిబ్బంది ప్రయాణిస్తున్న బస్సు బోల్తా పడి 10 మంది గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం విజయపుర ముద్దేబిహాల్ తాలూకా హాళ్లూరు క్రాస్ సమీపంలో జరిగింది. మే 10న జరిగే అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. ఈక్రమంలో శిక్షణ కోసం 50 మంది సిబ్బంది కేఆర్‌టీసీ బస్సులో వెళ్తుండగా హాళ్లూరు క్రాస్ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. పదిమందికి గాయాలవ్వగా ముద్దేహాల్ ఆస్పత్రికి తరలించారు.

ప్రైవేటీకరణ ఆగాలంటే బీజేపీని ఓడించాలి

కంప్లి: విద్యుత్ ప్రైవేటీకరణ నిలిపేందుకు బీజేపీని ఓడించాలని ఎద్దేళు కర్ణాటక నీతిబద్ధ నాగరిక అభియాన రాష్ట్ర సమితి సభ్యుడు జీఎం వీరసంగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం సోమప్ప చెరువు వద్ద కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. భూసుధారణ చట్టం దోపిడీదారులకు వరంగా మారిందన్నారు.

'మతతత్వపార్టీకి ఓటు వేయొద్దు'

బళ్లారి రూరల్ : మతతత్వ పార్టీ బీజేపీకి ఓటెయ్యద్దండని సీపీఎం జిల్లామండలి కార్యదర్శి ఎం. చెన్నబసయ్య ఓటర్లకు సూచించారు. మంగళవారం తోరణగల్లు సీఐటీయు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సండూరు తాలూకాలో బీజేపీ బలపడడానికి పరోక్షంగా సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుకారాం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయక పోవడమేనన్నారు.

ప్రైవేటీకరణ చేయడమే బీజేపీ సాధన

కేజీఎఫ్ : ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడమే బీజేపీ ప్రభుత్వ సాధన అని కాంగ్రెస్ నాయకుడు జయసింహ కృష్ణప్ప ఆరోపించారు. మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. స్వాతంత్ర్యం అనంతరం దేశాభివృద్ధి కోసం బృహత్ పరిశ్రమలను స్థాపించిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. వీటిని ప్రైవేటు పరం చేస్తూ బీజేపీ ప్రభుత్వ సంస్థలను సర్వనాశనం చేస్తోందన్నారు.

కేఆర్‌పీపీలో చేరిన కోనంకి రామప్ప

- కార్పొరేటర్ కోనంకి తిలక్‌కి కూడా కేఆర్‌పీపీ తీర్థం

సాక్షి,బళ్లారి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ముండ్లూరు దివాకర్‌బాబు ఈ ఎన్నికల్లో తాను పుట్‌బాల్ ఆడుతానని చెబుతూ పరోక్షంగా కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి లక్ష్మీ అరుణకు మద్దతు ప్రకటించడంతో ఆపార్టీకి కొండంత బలం చేకూరింది. తాజాగా అదే సామాజిక వర్గానికి చెందిన మరో బలమైన నాయకుడు, బెస్ట్ స్కూల్ చైర్మన్ కోనంకి రామప్ప, ఆయన తనయుడు నగర 10వ వార్డు కార్పొరేటర కోనంకి తిలక్ కేఆర్‌పీపీకి తీర్థం పుచ్చుకున్నారు. ముందుగా గంగావతిలో గాలి జనార్దన రెడ్డిని కలిసి చర్చించారు. మంగళవారం నగరంలో కేఆర్‌పీపీ నగర అభ్యర్థి గాలి లక్ష్మీ అరుణ సమక్షంలో తండ్రీకొడుకులు పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలతో కలిసి కేఆర్‌పీపీ తీర్థం పుచ్చుకున్నారు. కోనంకి రామప్ప,తిలక్ మాట్లాడుతూ గాలి జనార్దనరెడ్డి బళ్లారిని ఎంతో అభివృద్ధి చేశారన్నారు.



గాలి జనార్దనరెడ్డితో కోనంకి రామప్ప,ఆయన తనయుడు కోనంకి తిలక్ తదితరులు

ఆయన సతీమణి బళ్లారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, ఆమెకు మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో తాము బీజేపీని వీడి కేఆర్‌పీపీలో చేరినట్లు తెలిపారు. మాజీ మేయర్ వెంకటరమణ, గాలి జనార్దనరెడ్డి కుమార్తె బ్రహ్మణి, కేఆర్‌పీపీ ప్రముఖులు సంజయ్ బెటగేరి పాల్గొన్నారు.

నిధి ఆశ చూపించి వంచన

- దంపతుల అరెస్ట్

చెళ్లకెరె రూరల్: దేవుడు ఆవహించినట్లు నటించి, నిధి ఉందని ఆశపెట్టి బంగారు ఆభరణాలు, నగదును దోచుకున్న దంపతులను చెళ్లకెరె సులు అరెస్టు చేశారు. యాదగిరి జిల్లా శహాపుర తాలూకా సురపురకు చెందిన ముద్దరంగప్ప హవల్దార్ (58), మధుమతి (38)దంపతులు చిత్రదుర్గ తాలూకా మదకరి పురలో నివాసం ఉంటున్నారు. ఈనెల 23న చెళ్లకెరెలోని అశ్విని హోటల్‌కు భోజనానికి వెళ్లారు. ఈ సమయంలో దేవుడు వచ్చినట్లు నటించిన మధుమతి... నిధి ఉందని, వెంటనే పూజలు చేయాలని, లేకుంటే కుటుంబంలో చావు సంభవిస్తుందని హోటల్ యజమానిని బయపెట్టింది. దీంతో యజమాని శంకరప్ప పూజలు చేసేందుకు అంగీకరించాడు. 21 రోజులు పూజలు చేస్తామని వంచకులు నమ్మించారు. నిత్యం రూ. 10 వేల ప్రకారం 1.80 లక్షలు తీసుకున్నారు. పూజ సమయంలో వజ్రం లభించిందని, దీనిని జోడించడానికి బంగారు ఆభరణాలు అవసరమని తెలిపారు. దీంతో శంకరప్ప 15 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్ ఇచ్చారు. నిధి బయటకు వస్తుందని, ఇక్కడే ఉండాలని చెప్పి ఉడాయించారు. ఎంత సేపటికీ నిధి లభించకపోవడం, దంపతులు ఉడాయించడంతో బాధితుడు శంకరప్ప చెళ్లకెరె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రూ.లక్ష నగదు, రూ. 85 వేల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్‌కు ఓటు.. సంక్షేమానికి బాట

బళ్లారి రూరల్: సండూరు తాలూకాలో మూడు సార్లు ఓటేసి గెలిపించారు. 15 ఏళ్లలో తానుచేసిన అభివృద్ధిని చూసి మరోసారిగెలిపించాలని సండూరు కాంగ్రెస్ అభ్యర్థి ఇ.తుకారాం ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన తోరణగల్లు గ్రామంలో రోడ్‌షో అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగసభలో పాల్గొని మాట్లాడారు, సీసీరోడ్లు, జిందాల్ సాయంతో సీఎస్ఆర్ ఫండ్ ద్వారా అత్యాధునిక పాఠశాల భవనాలు నిర్మించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. మాజీమంత్రి సంతోష్‌లాడ్ మాట్లాడుతూ అంబాని, అదాని తదితర కార్పొరేట్ సంస్థలకు చెందిన రూ. 25 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన ప్రధాని మోదీ నిత్యావసర ధరలు పెంచి పేదలపై భారం మోపారని మండిపడ్డారు. తోరణగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏకాంబరప్ప, మాజీ ఎమ్మెల్సీ కే.ఎస్.ఎల్. స్వామి, మండ్రిగినాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఇ.తుకారాం

బళ్లారి అభివృద్ధికి కేఆర్‌పీపీని గెలిపించండి

- బళ్లారి నగర అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణ

సాక్షి,బళ్లారి: బళ్లారి సమగ్రాభివృద్ధికి కేఆర్‌పీపీకి ఓటు వేయాలని ఆపార్టీ నగర అభ్యర్థి గాలి లక్ష్మీ అరుణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆమె నగరంలోని ఆంధ్రాళ్, ముండ్రగి, గుగ్గరహట్టి తదితర ప్రాంతాల్లో రోడ్‌షోలు, సమావేశాలు నిర్వహించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన భర్త గాలి జనార్దనరెడ్డి జిల్లా మంత్రిగా ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులు చూసి తనను గెలిపించాలని కోరారు.పేదల కన్నీరు తుడిచేందుకు కేఆర్‌పీపీ ఎన్నికల ప్రణాళికలో ఎన్నో పథకాలు రూపొందించినట్లు తెలిపారు. బళ్లారిలో రోజు తాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి పేదకూ డబుల్‌బెడ్ ఇళ్లు కట్టిస్తామన్నారు.



మాట్లాడుతున్న గాలి లక్ష్మీ అరుణ

నిస్వార్థంగా ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని, మీ దీవెనలు అందించి పుట్‌బాల్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. రాజశేఖరగౌడ,సంజయ్ బెటగేరి,ప్రకాష్‌రెడ్డి ,మున్నా తదితరులు పాల్గొన్నారు.

మరోమారు అవకాశం ఇవ్వండి

సాక్షిబళ్లారి: బళ్లారి సర్వతోముఖాభివృద్ధి కోసం కమలం గుర్తుకు ఓటు వేయాలని బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం బళ్లారి నగరంలోని 15వ వార్డు పరిధిలో కాటేగుడ్డంలో తదితర కాలనీల్లో ఇంటింటా తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాను ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచినప్పటి నుంచి బళ్లారి అభివృద్ధికి ఎంతో శ్రమించానన్నారు. ఈ సారి కూడా గెలిపిస్తే బళ్లారి నగరంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని, డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తు చేశారు.



ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖరరెడ్డి

మోదీ, అమిత్‌షా పర్యటించినా హస్తానిదే హవా

- తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి

రాయచూరు రూరల్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆధిత్యనాథ్ ఎన్నిసార్లు పర్యటించినా కాంగ్రెస్ విజయం ఖాయమని నల్గొండ ఎంపీ, రాయచూరు, బెంగళూరు జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికార బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, 40 శాతం కమీషన్లతో నేతలు అవీనీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచిన గ్యారంటీ కార్డు పథకంతో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి స్పందన వస్తోందన్నారు. 135 స్థానాల్లో విజయం ఖాయమన్నారు. తెలంగాణ సీఎం కే.చంద్రశేఖర్‌రావు తన కుటుంబ వాస్తు కోసమే కొత్త సచివాలయం నిర్మించారని, రూ.2వేల కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందని ఆరోపించారు.

అధ్యక్ష, ఉపాధ్యక్షుల నియామకం

కంప్లి: కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ జిల్లా సమితి వెనుకబడిన వర్గాల విభాగ ఉపాధ్యక్షునిగా బీ.పరశురామప్పను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు కే.మల్లికార్జున ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

రాయచూరురూరల్: జిల్లాలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను కలిసి ఓట్లను అభ్యర్థించారు. రాయచూరు రూరల్‌లో కల్మలో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి సుభాష్‌చంద్ర సంబూజీ ప్రచారం చేశారు. గంజలి గ్రామంలో బీజేపీ అభ్యర్థి తిప్పరాజ్ ప్రచారం చేశారు. కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. మటమరిలో కాంగ్రెస్ అభ్యర్థి బసనగౌడ, మాన్వి తాలూకా ఉప్పరదిన్నెల్లో బీజేపీ అభ్యర్థి బీవీ నాయక్, దేవదుర్గ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి శివనగౌడ నాయక్, కాంగ్రెస్ అభ్యర్థి శ్రీదేవినాయక్, జేడీఎస్ అభ్యర్థి కరెమ్మ ఎన్నికల ప్రచారం చేశారు. రాయచూరులోని హరిజనవాడలో కాంగ్రెస్ అభ్యర్థి .మహ్మద్ శాలం, బీజేపీ అభ్యర్థి శివరాజ్‌పాటిల్ మండిపేటలో ప్రచారం చేశారు. దేవినగర్‌లో జేడీఎస్ అభ్యర్థి వినయ్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థులు మహమ్మద్ కలస జవహార్ నగర్‌లో ప్రచారం చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థి ముజుబుద్దీన్ షియా తలబ్‌లో ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ శాలం తరఫున కేపీసీసీ ప్రచార సమితి ఉపాధ్యక్షుడు రవి బోసురాజ్ హరిజన వాడలో ప్రచారం చేశారు. రాత్రి దళితవాడలోనే నిద్రించారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బసనగౌడ

కోలారు వార్తలు...

కాంగ్రెస్‌ను గెలిపిస్తే అవినీతి రహిత పాలన



మాట్లాడుతున్న కేఆర్ రమేష్‌కుమార్

శ్రీనివాసపుర: అవినీతి రహిత పాలన కోసం కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని ఎమ్మెల్యే కేఆర్ రమేష్‌కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన తాలూకాలోని సోమయాజుల పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని మాట్లాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేదల సంక్షేమానికి అనేక పథకాలను తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే స్త్రీ శక్తి సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తామని, రుణ పరిమితి రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచుతామన్నారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దింబాల అశోక్, అశోక్‌కుమార్, మంజునాథరెడ్డి, ఏసీ సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా భోజన ఏర్పాట్లు

- ఎన్నికల సిబ్బంది ఆగ్రహం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎన్నికల సిబ్బంది

కేజీఎఫ్: భోజన ఏర్పాట్లు సరిగా లేకపోవడంతో ఎన్నికల సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నగరంలోని మహవీర్ జైన్ కళాశాలలో పీఆర్‌ఓ, ఏపీఆర్‌ఓ, పీఏలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 1200మంది సిబ్బంది పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనాలు చేసేందుకు సరైన టేబుల్స్ లేక నిలబడి భోజనం చేయాల్సి వచ్చింది. కొందరు సమీపంలోని హోటల్స్‌కు వెళ్లి ఆకలి తీర్చుకున్నారు. సిబ్బంది ఒక్కసారిగా క్యాంటీన్‌లోకి రావడంతో స్థలాభావం వల్ల కొంతసేపు గందరగోళం ఏర్పడిందని, కాదని సహాయక ఎన్నికల అధికారి హెచ్ శ్రీనివాస్ తెలిపారు.

సంతానం లేదని.. శిశువు కిడ్నాప్

- కిడ్నాపర్లు, మరొకరు అరెస్టు

గుంతకల్లు: ఆదోని వద్ద 7 నెలల మగశిశువును కిడ్నాప్ చేయగా, నిందితులను, అందుకు పురమాయించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్పీ కే.చౌడేశ్వరి తెలిపారు. మంగళవారం ఏపీలోని అనంతపురం జిల్లా గుంతకల్లులో కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వివరాలు.. మంత్రాలయం వద్ద కాచిపురంకు చెందిన వడ్డె అంజినేయులు, అంకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, 7 నెలల బాలుడు రాములు ఉన్నారు. వీరు మంత్రాలయంలోనే బిక్షాటన చేస్తూ జీవించేవారు. గత నెల 29వ తేదీన రాత్రి వర్షం పడుతుండడంతో మంత్రాలయం సమీపంలోని తుంగభద్ర ఓల్డ్ రైల్వేస్టేషన్ బిల్డింగ్‌లో నిద్రించారు. తెల్లవారుజామున లేచి చూడగా చిన్నారి బాలుడు కనిపించలేదు. దీంతో గట్టిగా రోదిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాయచూరులో పథకం

రైల్వే పోలీసులు దర్యాప్తు చేసి సీసీ కెమెరాల చిత్రాలను పరిశీలించారు. నిందితులు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన షేక్ మహమ్మద్ మహబుబ్, మహమ్మద్ అఫ్జల్‌ఖాన్ గుర్తించారు. గుంతకల్లుకు చెందిన వలీ బాషాకు పెళ్లయి 10 ఏళ్లయినా సంతానం లేదు. దీంతో ఎవరైనా అనాథ పిల్లలను పెంచుకోవాలని నిర్ణయించుకున్నాడు. వలీబాషా అక్క తాహిర బేగం రాయచూర్ ఉంటుంది. గత ఫిబ్రవరిలో అతడు రాయచూర్‌కు వెళ్లినప్పుడు మహమ్మద్ మహబూబ్‌తో (ఆటోడ్రైవర్) పరిచయం ఏర్పడింది. తనకు పెంచుకోవడానికి చిన్నారి కావాలని చెప్పగా, రూ. 3 లక్షలు ఇస్తే తెచ్చిస్తానని ఒప్పందం చేసుకున్నాడు. మొదట రూ.1.90 లక్షలు పంపాడు. దీంతో ఎలాగైనా వలీ బాషాకు బాలున్ని అప్పజెప్పాలని స్నేహితుడు అఫ్జల్‌ఖాన్‌తో కలిసి పథకం వేశాడు. అంకమ్మ, ఆంజినేయలు దంపతుల వద్ద ఉన్న మగశిశువుపై వీరి కన్నుపడింది. ఆ రోజు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. అక్కడి నుంచి గుంతకల్లుకు చేరుకుని ఓ కాలేజీ వద్ద ఉన్నామని, వస్తే బాలున్ని ఇస్తామని వలీ బాషకు కాల్ చేశారు. నిఘా ఉంచిన పోలీసులు దుండగులను అరెస్టు చేసి శిశువును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా శిశువును తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలను పెంచుకోవాలంటే చట్టపరంగా దత్తత తీసుకోవాలని, ఇటువంటి పద్ధతులు మంచిది కాదని ఎస్పీ తెలిపారు.



అంకమ్మ దంపతులకు శిశువును అప్పగిస్తున్న ఎస్పీ

కాంగ్రెస్‌పై భజరంగదళ్ ఆగ్రహం

కోలారు: భజరంగదళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ పార్టీ తన ప్రణాళికాలో చేర్చడాన్ని జిల్లా భజరంగదళ్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మతతత్వ కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని జిల్లా భజరంగదళ్ నాయకుడు బాలాజీ హెచ్చరించారు. ధర్మ రక్షణ కోసం శ్రమిస్తున్న భజరంగదళ్‌ను నిషేధిస్తే తదనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ పతనమవుతుందన్నారు.

రైలు కిందపడి టీసీ ఆత్మహత్య

హుబ్లీ: రైలు కింద పడి హుబ్లీ విభాగం రైల్వే టీసీ ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేంద్రకుమార్ (56) ఇటీవలే టీసీగా ప్రమోషన్ పొందాడు. సోమవారం హుబ్లీ 3వ ప్లాట్‌ఫారంలో కూర్చున్న అతను ప్లాట్‌ఫారంలోకి రైలు సమీపిస్తుండగానే పరుగున వెళ్లి పట్టాలపై తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. ఘటన స్థలాన్ని విభాగం రైల్వే వ్యవస్థాపకులతో పాటు సీనియర్ అధికారులు పరిశీలించారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

వంద శాతం పోలింగ్‌కు సహకరించాలి



జాగృతి జాతాను ప్రారంభిస్తున్న సీఈఓ

కోలారు: జిల్లాలో ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు జాగృతం చేసి జిల్లాలో వంద శాతం పోలింగ్ జరగడానికి సంకల్పం చేయాలని జెడ్పీ సీఈఓ యుకేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కోలారు తాలూకా పంచాయతీ ఆధ్వర్యంలో వివిధ కళాబృందాల ఊరేగింపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. గత ఎన్నికల్లో ఓటు వేయని ఓటర్ల మనసును పరివర్తన చేసి పోలింగ్ బూత్‌లకు తీసుకు రావాల్సి ఉందన్నారు. డొళ్లు కుణిత, తదితర కళా బృందాలు పాల్గొన్నాయి.

క్లుప్తంగా

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్



బనశంకరి: కళాశాల విద్యార్థి హత్య కేసులో బాగలూరు పోలీసులు మంగళవారం ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిందితులను శృంగ, అనిల్‌గా గుర్తించారు. గతనెల 28 తేదీ రాత్రి కాలేజీ ఫెస్టివల్ సమయంలో సదరు కాలేజీ విద్యార్థిగా ఉన్న భరతేశ్ స్నేహితుడి అత్త కుమార్తెపై శరత్ అనే విద్యార్థి క్రికెట్ బాల్ విసిరాడు. ఇదే విషయంపై శరత్, అతడి స్నేహితుడు భాస్కర్‌జెట్టితో భరతేశ్ వర్గం మధ్య గొడవ జరిగింది. జోక్యం చేసుకున్న అనిల్‌కు సంబంధం లేనప్పటికీ ఒక్కసారిగా భాస్కర్‌జెట్టిపై చాకుతో దాడి చేయడంతో తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న బాగలూరు పోలీసులు భరతేశ్‌ను అరెస్ట్ చేశారు. ఘటన జరిగిన వెంటనే కారులో మూడిగెరెకు పారిపోయిన అనిల్, శృంగ మూడిగెరె అటవీప్రాంతంలో తలదాచుకున్నారు. ఫోన్‌కాల్స్‌పై నిఘాపెట్టిన పోలీసులు మంగళవారం ఇద్దరిని అరెస్ట్ చేశారు.

10న ప్రభుత్వ సెలవు

సాక్షి బెంగళూరు: ఈ నెల 10న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఉన్నందున ఆరోజు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. పోలింగ్ రోజు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అనుకూలంగా ఉండేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, సంస్థలు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ సంస్థలన్నింటికీ సెలవును ప్రకటిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఆయనకు ఓటేస్తే నష్టమే

తుమకూరు: శిరా తాలూకా హులికుంటే హోబళి సరిహద్దు గ్రామం చిరతహళ్లి, కరిదాసరహళ్లి, హనుమంతనగర గ్రామాల్లో బీజేపీ తరఫున ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్ గౌడ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సదాశివ కమిషన్ నివేదిక అమలు చేసిన ఘనత బీజేపీది అని తెలిపారు. ఇదే తన చివరి ఎన్నికలు అని అంటున్న మాజీ మంత్రి టీబీ జయచంద్ర ఒక వేళ గెలిస్తే నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగవని తెలిపారు. జయచంద్ర గెలిస్తే ఆయన సొంత కుటుంబం అభివృద్ధికి మాత్రమే కృషి చేస్తారని, అందుకే అమూల్యమైన ఓటును బీజేపీకి వేసి గెలిపించాలని కోరారు.

ఆప్ ఎన్నికల ప్రణాళిక విడుదల

శివాజీనగర: ఎన్నికల సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఏఏపీ) నియోజకవర్గాల వారీగా ప్రణాళిక విడుదల చేసింది. ఇందులో బెంగళూరులోని శివాజీనగరకు ప్రపంచ స్థాయి సదుపాయాలను కల్పించాలని నిర్ధారించినట్లు శివాజీనగర అభ్యర్థి ప్రకాశ్ నెడుంగడి తెలిపారు. మంగళవారం బెంగళూరులో ఆ పార్టీ నాయకులు శివాజీనగర నియోజకవర్గ ప్రణాళిక విడుదల చేశారు.209 నియోజకవర్గాల వారీగా ప్రణాళిక విడుదల చేసినట్లు రాష్ట్రాధ్యక్షుడు పృథ్వీరెడ్డి తెలిపారు.

కన్నడ సంఘాల ఆక్రోశం

యశవంతపుర: బెంగళూరు నగరంలో వివిధ నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఇతర భాషా ఓటర్లను ఆకర్షించటానికి రాజకీయ పార్టీలు వారి భాషల్లో ముద్రించి ప్రచారం చేస్తున్నాయి. దీంతో రాజకీయ పార్టీలపై కన్నడ సంఘాలు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నాయి. సోమవారం ఎంపీ తేజస్వీ సూర్య బెంగళూరులో హిందీ భాషలో మాట్లాడిన వీడియో వైరల్ అయింది. మంగళవారం మధ్యప్రదేశ్ అసోసియేషన్ బెంగళూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హిందీలో ముద్రించిన కరపత్రాలతో కన్నడ సంఘాలు భగ్గుమంటున్నాయి. కరపత్రం పోస్ట్ చేసిన కన్నడ పరం పోరాట నాయకుడు రూపేశ్ రాజణ్ణ రాజకీయ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

పిల్లలకు సంస్కృతి, సంస్కారం నేర్పాలి




విజయపుర: చిన్న పిల్లలకు వారి మంచి భవిష్యత్తు కోసం బాల్యం నుంచే గురువులు, పెద్దలు, దేవుడిపై భయభక్తులు నేర్పాలని, అలాగే వారికి మన సంస్కృతిని తెలియజేస్తూ పెంచాలని, సంస్కారవంతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని నివేదిత ప్రతిష్ఠాపన భారతీ ప్రభుదేవ్ తెలిపారు. దేవనహళ్లి రోడ్డు ఫేస్‌కేక్ వద్ద నివేదిత ప్రతిష్ఠాన ఆధ్వర్యంలో గత 13 రోజులుగా జరుగుతున్న వేసవి శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్యం నుంచే చిన్నపిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసి సంస్కారవంతంగా వారిని పెంచాలని సూచించారు.

అఖండకు మద్దతుగా ప్రచారం

శివాజీనగర: పులకేశినగర నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఎమ్మెల్యే అఖండ శ్రీనివాసమూర్తికి మద్దతుగా మాజీ కార్పొరేటర్ ఆర్.ప్రదీప్‌కుమార్ రెడ్డి తెలుగు కాలనీల్లో మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఎస్.కే.గార్డెన్ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రదీప్ రెడ్డి ప్రచారం చేశారు. అభ్యర్థి అఖండ శ్రీనివాసమూర్తిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

బెంగళూరు దక్షిణలో పాగా వేసేదెవరో ?


- కాంగ్రెస్–బీజేపీ మధ్య తీవ్ర పోటీ
- తెలుగు ఓటర్లే కీలకం



బనశంకరి: ఎన్నికల తేదీ దగ్గరపడే కొద్ది బెంగళూరు దక్షిణ నియోజకవర్గంలో కాంగ్రెస్–బీజేపీ మధ్య నువ్వానేనా అనే స్థాయిలో నెలకొంది. రాజధాని బెంగళూరు నగరంలో అత్యధిక ఓటర్లు కలిగిన బెంగళూరు దక్షిణ నియోజకవర్గం 2008లో నియోజకవర్గాల పునర్విభజనలో ఆవిర్భవించింది. 2008 నుంచి 2018 వరుసగా మూడుసార్లు బీజేపీ ఎమ్మెల్యే ఎం కృష్ణప్ప విజయకేతనం ఎగురవేశారు. బీజేపీ ఎమ్మెల్యే కృష్ణప్పను ఓడించి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ అభ్యర్థి ఆర్‌కే.రమేశ్ ప్రచార పర్వంలో దూసుకెళుతున్నారు. గత 2018 ఎన్నికల్లో ఆర్‌కే.రమేశ్ ఓటమిపాలైనప్పటికీ నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలతో పోరాడుతుండటం కరోనా సమయంలో అందించిన సేవలతో ప్రజలకు మరింత చేరువయ్యారు.



ప్రచార సమయంలో ఓటర్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఆర్‌కే.రమేశ్‌కు అపూర్వ స్పందన లభిస్తోంది. జేడీఎస్ అభ్యర్థిగా హెచ్‌పీ. రాజగోపాల్‌రెడ్డి బరిలో ఉన్నారు. బెంగళూరు దక్షిణ నియోజకవర్గం పాలికె, పురసభ, నగరసభ, గ్రామపంచాయతీలతో కలిసి ఉంది. ఇందులో మొత్తం 8 వార్డులు ఉండగా గత పాలికె ఎన్నికల్లో 6 వార్డుల్లో బీజేపీ, రెండింటిలో కాంగ్రెస్ గెలుపొందింది. బెంగళూరు దక్షిణ నియోజకవర్గంలో తెలుగు ఓటర్లు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. వీరితో పాటు ఎస్సీ, ఎస్టీ, ఒక్కలిగ, రెడ్డి సముదాయం ఓటర్లు నియోజకవర్గంలో అభ్యర్థి గెలుపు ఓటముల్లో కీలక పాత్ర. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండటంతో కాంగ్రెస్ తనకు అనుకూలంగా మార్చుకుంటుంది. గత ఎన్నికల్లో ఓటమిపాలైన ఆర్‌కే.రమేశ్ తరఫున ప్రజల్లో సానుభూతి వ్యక్తమౌతుంది. జేడీఎస్ అభ్యర్థిగా హెచ్‌పీ. రాజగోపాల్‌రెడ్డి పోటీ చేస్తుండటంతో కాంగ్రెస్ పార్టీకి నష్టమని బీజేపీ భావిస్తోంది. హెచ్‌పీ. రాజగోపాల్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో చివరినిమిషంలో జేడీఎస్ పార్టీలో చేరి టికెట్ దక్కించుకున్నారు. జేడీఎస్ అభ్యర్థిగా ఉన్న ఆర్.ప్రభాకర్‌రెడ్డిని తప్పించి రాజగోపాల్‌రెడ్డికి జేడీఎస్ పార్టీ టికెట్ కేటాయించింది. దీంతో మన స్థాపానికి గుర్రైన ఆర్.ప్రభాకర్‌రెడ్డి వారం క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్‌కే.రమేశ్‌కు మరింత బలం చేకూరింది. నియోజకవర్గంలో మొత్తం 6.77 లక్షలు ఓటర్లు ఉండగా పురుషులు 3,57,417 మంది, మహిళలు 3,19,727 ఇతరులు 103 మంది ఓటర్లు ఉన్నారు.



ఆర్‌కే.రమేశ్ (కాంగ్రెస్ అభ్యర్థి)



ఎం.కృష్ణప్ప (బీజేపీ అభ్యర్థి)



హెచ్‌పీ.రాజగోపాల్‌రెడ్డి (జేడీఎస్ అభ్యర్థి)

కొరియర్ బాయ్ ఆత్మహత్య

బనశంకరి: కొరియర్ బాయ్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అన్నపూర్ణేశ్వరి నగర పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. మృతి చెందిన యువకుడు చిత్రదుర్గకు చెందిన నవీన్ (24)గా పోలీసులు గుర్తించారు. ఉద్యోగనిమిత్తం బెంగళూరు నగరానికి చేరుకున్న నవీన్ కొరియర్ కంపెనీలో పనిచేస్తూ నాగరబావిలో నివాసం ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం నాగరబావిలో ఆత్మహత్యకు పాల్పడిన స్థితిలో యువకుడు మృతదేహం లభ్యమైంది. అన్నపూర్ణేశ్వరి నగర పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి

మైసూరు: వరుణ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి వి.సోమణ్ణను 25 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని బీజేపీ పార్లమెంటరీ మండలి సభ్యుడు మాజీ సీఎం యడియూరప్ప పిలుపునిచ్చారు. నంజనగూడు తాలూకా హోసకోటె గ్రామంలో మంగళవారం బీజేపీ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సమావేశంలో బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రచారానికి ఇంకో వారం రోజులు గడువు మాత్రమే ఉందని, ఇంటింటికి వెళ్లి కార్యకర్తలు ప్రచారం చేయాలని, సోమణ్ణకు వరుణ నియోజకవర్గాన్ని బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు.

రామన్ నగర రాజెవరు?

- ఆది నుంచి కాషాయ పార్టీ హవా



రామన్ నగరలోని టెక్ పార్క్

శివాజీనగర: రాజధాని నగరంలోని సీవీ రామన్‌నగర నుంచి ఓటమి ఎరుగని బీజేపీ ఎమ్మెల్యే ఎస్.రఘును ఓడించి ఈసారి అక్కడ పాగా వేయాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలైన కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్‌కు సన్నిహితుడు మాజీ మేయర్ సంపత్‌రాజ్‌కు కాకుండా మాజీ కార్పొరేటర్ ఆనందకుమార్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. తెలుగువారు అధికంగా ఉన్న క్షేత్రాల్లో సీవీ రామన్ నగర నియోజకవర్గం ఒకటి. బీజేపీలో ప్రభావం కలిగిన నాయకుడిగా ఉండిన ఎస్.రఘు కార్పొరేటర్‌గా రాజకీయ జీవితాన్ని ఆరంభించారు. శాంతినగరను విభజించి సీ.వీ.రామన్‌నగర నియోజకవర్గం ఏర్పాటయ్యాక ఆయన వరుసగా మూడుసార్లు గెలుపొందారు. ఆయనకు ధీటైన అభ్యర్థిని బరిలోకి దింపాలని కసరత్తు చేపట్టిన కాంగ్రెస్ చివరకు మాజీ కార్పొరేటర్ ఆనందకుమార్‌ను పోటీకి నిలిపింది. ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిగా పార్టీ బెంగళూరు నగర అధ్యక్షుడు మోహన్ దాసరి పోటీలోకి వచ్చారు. బెంగళూరు నగర సమస్యలపై ఆయన తరచుగా ఆందోళనల్లో పాల్గొంటూ ఉన్నారు. సీవీ రామన్ నగరలో ఓటర్లకు అందుబాటులో ఉంటానని చెబుతున్నారు.



రామన్ నగర నియోజకవర్గం

ఇవీ ప్రధాన సమస్యలు

నియోజకవర్గం ఎన్నో ఐటీ కంపెనీలకు నిలయం. అయితే ఇందిరానగర, హలసూరు, న్యూ తిప్పసంద్ర తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండటంతో ప్రజలు ట్రాఫిక్ ఒత్తిడికి గురవుతున్నారు. మురికివాడల్లో తాగునీటి కొరతతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. ఎన్నికల సందర్భంలో నాయకులు ఓటు కోసం ఎన్నో భరోసాలు ఇచ్చి ఆ తరువాత తమ సమస్యలను పట్టించుకోవటం లేదని ఆంధ్ర కాలనీ, మర్ఫీటౌన్ తదితర ప్రాంతాల ప్రజలు వాపోయారు. చెత్త తొలగింపు సమస్య కూడా ఈ నియోజకవర్గంలో అధికంగా ఉండటంతో స్థానిక ప్రజలు ముక్కు మూసుకొని తిరిగే పరిస్థితి ఉంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఆసక్తి చూపే అభ్యర్థులకే తమ ఓటు వేస్తామని తెలియజేస్తున్నారు.

ఓటర్ల వివరాలు:

సీవీ రామన్ నగర నియోజకవర్గంలో 2,67,312 మంది ఓటర్లు ఉండగా, అందులో 1,40,612 మంది పురుషులు, 1,26,588 మహిళలు, ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 117 మంది ఉన్నారు. 2018 జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎస్.రఘు 58,887 ఓట్లు తీసుకొని మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాంగ్రెస్, జేడీఎస్ ఆ తరువాతి స్థానాల్లో వచ్చాయి.

జోరుగా ఎన్నికల ప్రచారం



లింగరాజపురంలో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి పద్మనాభరెడ్డి



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.ఏ.హ్యారిస్

శివాజీనగర: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఉధృతం చేశారు. మంగళవారం ఆయా పార్టీ అభ్యర్థులు గడప గడపకు వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలుకరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. సర్వజ్ఞనగర బీజేపీ అభ్యర్థి పద్మనాభరెడ్డి నియోజకవర్గ పరిధిలోని లింగరాజపురం చుట్టు పక్కల ప్రచారం చేపట్టారు. నియోజకవర్గ సమస్యలపై తనకు అవగాహన ఉందని, తనను ఒక్కసారి గెలిపిస్తే దశలవారిగా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగానే పులకేశినగర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏ.మురళి ఎస్‌కే.గార్డెన్ వార్డులోని ఆంధ్ర కాలనీ, గాంధీ గ్రామం, వాహబ్ గార్డెన్, ఎస్.కే.గార్డెన్‌లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ హయాంలో ఎంతో అభివృద్ధి సాధ్యమైందని, మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. శాంతినగర నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.ఏ. హ్యారిస్ శాంతలా వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. మరోసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. పులకేశినగర కాంగ్రెస్ అభ్యర్థి ఏ.సీ.శ్రీనివాస్ సగాయపురం, దొడ్డణ్ణగార్డెన్ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. రామస్వామి పాళ్య వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి రిజ్వాన్ హర్షద్ నిర్వహించిన ప్రచారంలో అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలసి ప్రచారం చేపట్టారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు సీ.క్రిష్ణేగౌడ, సుమతి ధనుంజయ, వీ.పీ.ఆనందరాజ్, ఎం.సీ.శ్రీనివాస్, ఓబులేశ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హెబ్బాళలో కట్టా జగదీశ్‌కు మద్దతుగా అణ్ణామలై ప్రచారం

హెబ్బాళలో అణ్ణామలై ప్రచారం:

హెబ్బాళలో బీజేపీ అభ్యర్థి కట్టా జగదీశ్ తరఫున తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు, కర్ణాటక రాష్ట్ర సహ ఇన్‌చార్జి అణ్ణామలై ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అభ్యర్థి కట్టా జగదీశ్ మాట్లాడుతూ బీజేపీకి ఓటు వేస్తే దేశ సమగ్రతకు పాటుపడుతుందని ప్రజలకు తెలియజేస్తూ ఓటును అభ్యర్థించారు. నియోజకవర్గంలోని గంగానగరలో ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. మాజీ మంత్రి కట్టా సుబ్రమణ్య నాయుడు రాధాకృష్ణ వార్డు గెద్దలహళ్లిలో ప్రచారం చేపట్టగా జేడీఎస్,కాంగ్రెస్ పార్టీకి చెందిన 500 మంది బీజేపీలో చేరారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

బనశంకరి: బెంగళూరు నగరంలో అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ఎమ్మెల్యేల్లో రామలింగారెడ్డి, సౌమ్యారెడ్డి ముందు ఉంటారని కేపీసీసీ అధ్యక్షుడు డీకే.శివకుమార్ తెలిపారు. మంగళవారం జయనగరలో కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి తరఫున నిర్వహించిన రోడ్‌షోలో డీకే.శివకుమార్ పాల్గొని మాట్లాడారు. జయనగర అభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్న ఏకైక మహిళా ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి అని అన్నారు. జయనగర ప్రజలకు అత్యంత ప్రామాణికంగా ప్రజాసేవ చేస్తున్నారని ఈసారి మళ్లీ అత్యధిక మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇక రామలింగారెడ్డి నిత్యం ప్రజలతో మమేకమై నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించే వ్యక్తి అని అన్నారు.



రోడ్‌షోలో కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి, డీకే శివకుమార్, రామలింగారెడ్డి

బస్సుల మీదకు దూసుకెళ్లిన టిప్పర్



ప్రమాద దృశ్యం

- మూడు ప్రైవేటు బస్సులు ధ్వంసం
- హోసూరులో దుర్ఘటన

హోసూరు: క్రిష్ణగిరి నుంచి బెంగళూరుకు వెళ్తున్న టిప్పర్ లారీ అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. రోడ్డుమధ్యన డివైడర్‌ను ఢీకొని ముందు వెళుతున్న బస్సులపైకి దూసుకెళ్లిన ఘటనలో మూడు బస్సులు ధ్వంసం కాగా, అదృష్టవశాత్తు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన మంగళవారం ఉదయం హోసూరు బస్టాండు సమీపంలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఓ టిప్పర్ లారీ హోసూరు బస్టాండ్ సమీపంలో ఫ్లై ఓవర్‌పై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని రామేశ్వరం నుంచి బెంగళూరుకు వెళుతున్న ప్రైవేట్ బస్సును, చెన్నై నుంచి బెంగళూరుకు, కేరళ నుంచి బెంగళూరు వెళ్లే రెండు ప్రైవేటు బస్సులను వెనుక నుంచి ఢీకొట్టింది. మూడు బస్సులు పాక్షికంగా దెబ్బతినగా, కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలు తగిలాయి. పట్టణ పోలీసులు చేరుకుని బస్సులను, లారీని ప్రక్కకు మళ్లించి ట్రాఫిక్‌ను సరిదిద్దారు. ఈ ఘటనతో హైవేపై గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మండ్య: లారీని వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మద్దూరు తాలూకా కె.కొడిహళ్లి బెంగళూరు–మైసూరు జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. కొడగు జిల్లా పొన్నంపేటే నివాసి రమేశ్ భీమయ్య కుమారుడు దీక్షిత్ అయ్యప్ప (23) ఈ ప్రమాదంలో మరణించాడు. దీక్షిత్ తలకు తీవ్ర గాయం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బెంగళూరులోని ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేసే దీక్షిత్ బుల్లెట్ వాహనంలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా బ్రేక్‌లు వేయడంతో బైక్ నియంత్రణ కోల్పోయి లారీ కిందభాగంలోకి దూసుకెళ్లింది. దీక్షిత్ తీవ్ర గాయాలతో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హోసూరు వార్తలు..

ఘనంగా అమ్మవారికి పూజలు



కెలమంగలం: వాసవి జయంతిని పురస్కరించుకొని డెంకణీకోట పట్టణ పంచాయతీ నేతాజీ రోడ్డులో వెలసిన శ్రీ కన్నికాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు, అలంకరణ, అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పల్లకీపై ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

కెలమంగలం: బెట్టముగిళాలం అటవీ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. డెంకణీకోట పోలీసులు బెట్టముగిళాలం ప్రాంతంలో సోమవారం సాయంత్రం గస్తీ తిరుగుతుండగా ఆ ప్రాంతంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో గంజాయి విక్రయిస్తున్నట్లు తేలింది. నిందితుడు కోట్టైయ్యూరుకొల్‌లై గ్రామానికి చెందిన మల్లేష్‌గా గుర్తించారు. అతని వద్ద నుంచి 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

డీఎంకే సభ్యత్వ నమోదు

హోసూరు: దివంగత కరుణానిధి జయంతిని పురస్కరించుకొని హోసూరు కార్పొరేషన్ పరిధిలో డీఎంకే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టింది. హోసూరు మేయర్ ఎస్.ఏ.సత్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని కొత్తగా చేరిన కార్యకర్తలకు సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. పట్టణంలోని టీవీఎస్ నగర్, రాయకోట రోడ్డు, బాగలూరు రోడ్డు, శానసంద్రం, నంజప్పనగర్, కలైనర్‌నగర్ తదితర ప్రాంతాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టారు. నాయకులు వేలూరు రమేష్, గిరీష్, ఎల్లోరామణి, శ్రీనివాసన్, సెందిల్‌కుమార్ పాల్గొన్నారు.

చిక్కబళ్లాపురను సుందరంగా తీర్చిదిద్దుతాం

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం నగరం సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని బీజేపీ అభ్యర్థి డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం ఆయన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో విలేకరులతో మాట్లాడారు. సబర్బన్ రైలు, మెట్రో రైలు ఔటర్‌రింగ్ రోడ్డును ఏర్పాటు చేస్తామని, పది లక్షల ఉద్యోగాలను సృష్టిస్తామన్నారు. అంతకు ముందు ఆయన తిప్పేనహళ్లి గ్రామ పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ గ్రామోద్యోగ మండలి అధ్యక్షుడు కెవి నాగరాజు, బీఎంటీసీ ఉపాధ్యక్షుడు కెవి నవీన్‌కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో కుండపోత వానలు

హోసూరు: క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు భారీ వర్షం కురిసింది. నెల ముందే వర్షాలు ప్రారంభం కావడంతో రైతుల్లో సంతోషం నెలకొంది. వర్షాధార పంటలు పండించే రైతులు ఏరువాక పనులను ప్రారంభించారు. హోసూరు పట్టణంలో రైల్వేస్టేషన్ నుంచి తాలూకా కార్యాలయం వెళ్లే మార్గంలో వంతెన కింద నీరు నిలిచి వాహన రాకపోకలు స్తంభించాయి. కొన్ని ప్రాంతాల్లో వాగులు, వంకలు ప్రవహించడంతో చెరువులకు, కుంటలకు నీరు చేరింది. జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షపాత వివరాలిలా ఉన్నాయి. బారూర్ 60, డెంకణీకోట 52, హోసూరు 41, క్రిష్ణగిరి 42, నెడుంగల్ 70, పెనుగొండాపురం 67.2, పోచ్చంపల్లి 64.4, రాయకోట 27, సూళగిరి 30 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 559.4 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది.



హోసూరు వద్ద వర్షం

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

కెలమంగలం: జీవితంపై విరక్తితో ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన తళి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని బళ్లపల్లి గ్రామానికి చెందిన సోమణ్ణ భార్య జయమ్మ (65) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో జీవితంపై విరక్తితో ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

కెలమంగలం: విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి చెందిన ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు ... డెంకణీకోట సమీపంలోని అరసకుప్పం గ్రామానికి చెందిన సుబ్రమణి కొడుకు శాంతకుమార్ (15) సోమవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటూ విద్యుత్ తీగను తాకడంతో ప్రమాదానికి గురయ్యాడు. హుటాహుటిన స్థానికులు డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

బీజేపీ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

హోసూరు: బీజేపీ రాష్ట్ర కమిటీ కోశాధికారి పిపిజిడి శంకర్ హత్యను ఖండిస్తూ మంగళవారం హోసూరు రామ్‌నగర్ అన్నావిగ్రహం వద్ద ఆ పార్టీ ఆందోళన చేపట్టింది. పార్టీ నాయకుడు తిమ్మరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు ఎం. నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... రాష్ట్రంలో బీజేపీ నాయకులపై దాడులు, దారుణ హత్యను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలోని డీఎంకే పాలనలో బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు రక్షణ లేకుండాపోయిందని ఆరోపించారు. ఆందోళనలో జిల్లా కోశాధికారి శ్రీనివాసన్, కస్తూరి, పోతరాజు, ఆనంద్, మనోహర్, ఇంద్రాణి, మురుగన్, శ్రీనివాసరెడ్డి, ఆజణ్ణ, ప్రవీణ్, రాజశేఖర్, పార్థిబన్, రమేష్, మణిగంటన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి మాట్లాడాలి

బాగేపల్లి: బాగేపల్లి నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూడలేకున్న ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రతి నెల తాను నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షల శిబిరంలో తనిఖీ చేయించుకోవాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అన్నారు. తాలూకాలోని జూల్యపాళ్య గ్రామ పంచాయతీ పరిధిలోని ఒడిగిరి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం పరిచయం లేకుండానే ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఇక్కడికి వచ్చి కొందరు బయటివారు అభ్యర్థులు అభివృద్ధి విషయంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను అభివృద్ధి చేసిన రోడ్లపై నిలుచుని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, వారి కంటికి అభివృద్ధి కనిపించడం లేదని, వారు ప్రతి నెల తాను ఉచితంగా ఏర్పాటు చేసే నేత్ర శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ పార్టీదే విజయం



బనశంకరి: ఈసారి కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగిస్తుందని కేపీసీసీ అధ్యక్షుడు డీకే.శివకుమార్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి పద్మనాభనగరలో కాంగ్రెస్ అభ్యర్థి వీ.రఘునాథనాయుడు తరఫున రోడ్‌షోలో మాట్లాడుతూ... బీజేపీ పాలనకు రాష్ట్ర ప్రజలు విసిగిపోయి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రచారంలో అభ్యర్థి రఘునాథనాయుడు, మాజీ మేయర్ వెంకటేశ్‌మూర్తి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

శివాజీనగర: రాష్ట్ర రాజధాని బెంగళూరులోని రామకృష్ణ ఆశ్రమం సర్కిల్ నుంచి గాంధీ బజార్ ప్రధాన రోడ్డు ఠాగూర్ సర్కిల్ వరకు జరుగుతున్న అశాస్త్రీయ రోడ్డు పనులను మళ్లీ చేపట్టాలని తలపెట్టిన గాంధీ బజార్ బంద్ విజయవంతమైంది. మంగళవారం నగరంలో వివిధ సంస్థల సహకారంతో హితరక్షణ వేదిక పిలుపునిచ్చిన బంద్‌కు మంచి స్పందన లభించింది.

అప్పారావు, శ్రీనివాస్ అరెస్ట్‌పై పూర్తి వివరాలివ్వండి

సీఐడీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: మార్గదర్శి తరహాలోనే భారీ మోసాలకు పాల్పడ్డ కేసులో అరెస్టయిన జగజ్జనని చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యజమానులు, టీడీపీ నేతలు ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. వీరిద్దరూ వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం విచారణ జరిపారు. ఈ కేసు పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఐడీ అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 5కి వాయిదా వేశారు.

ఎమ్మెల్యేలపై సోషల్ మీడియాలో అసత్యప్రచారం

టీడీపీ నేత సాయి కల్యాణిపై కేసు నమోదు


ఫిర్యాదు చేస్తున్న ప్రదీప్

హనుమాన్‌జంక్షన్ రూరల్: సామాజిక మాధ్యమాల్లో గుడివాడ, గన్నవరం ఎమ్మెల్యేలు కొడాలి నాని, వల్లభనేని వంశీలపై అసత్య ప్రచారం చేస్తున్న తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరు సాయి కల్యాణిపై కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. థాయిలాండ్‌లోని పట్టాయాలో రెండ్రోజుల క్రితం క్యాసినో నిర్వాహకుడు చికోటి ప్రవీణ్‌తో పాటు పలువురు తెలుగువాళ్లు అక్కడి పోలీసులకు పట్టుబడిన ఉదంతం విదితమే. ఈ గ్యాంబ్లింగ్ ముఠాతో గుడివాడ, గన్నవరం ఎమ్మెల్యేలు కొడాలి నాని, వల్లభనేని వంశీకి సంబంధం ఉన్నట్లుగా నిరాధార ఆరోపణలను సాయి కల్యాణి సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టడంతో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్ హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కొడాలి నాని, వంశీపై సామాజిక మాధ్యమాల్లో పదే పదే తప్పుడు ప్రచారంతో, వారి గౌరవాన్ని దెబ్బతీసేలా సాయి కల్యాణి పోస్టింగులు పెడుతున్నారని ప్రదీప్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి పరువుకు భంగం కలిగించే విధంగా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న సాయి కల్యాణిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రదీప్ కోరారు. ఈ ఫిర్యాదుపై హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేశారు.

విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ జ్యోతిర్మయి

- రాజధాని ప్రాంతంలో పేదలకు స్థలాలపై విచారణ నేటికి వాయిదా
- జస్టిస్ తిల్హరీతో కలిసి విచారణ జరపనున్న సీజే
- బుధవారం వద్దన్న రైతుల తరపు న్యాయవాది
- అత్యవసర విచారణ కోరుతూ మీ న్యాయవాదే లేఖ రాశారన్న ధర్మాసనం
- వాయిదా సాధ్యం కాదని స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చేందుకు 1,134 ఎకరాలను ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించేందుకు సీఆర్‌డీఏకు అనుమతినిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 45ను సవాలు చేస్తూ అమరావతి రైతులు దాఖలు చేసిన వ్యాజ్యాల విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి తప్పుకున్నారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీతో కలిసి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా బుధవారం విచారణ జరపనున్నారు. ఈ మేరకు సీజే మంగళవారం సాయంత్రం పరిపాలనపరమైన ఉత్తర్వులు జారీ చేశారు. జీవో 45 అమలును నిలిపివేయడంతో పాటు పేదలకు ఎలాంటి ఇళ్ల స్థలాలు కేటాయించకుండా ప్రభుత్వాన్ని నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని అమరావతి రైతులు అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ అనుబంధ వ్యాజ్యాలపై గత నెల 21న వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు కేటాయిస్తుందని, అందువల్ల ఈ వ్యవహారంపై అత్యవసర విచారణ జరపాలని రైతుల తరఫు న్యాయవాది సంజయ్ సూరనేని సీజేకు వ్యూహాత్మకంగా లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఈ వ్యాజ్యాలపై తదుపరి విచారణ జరపాలని సీజే ధర్మాసనం నిర్ణయించింది. సోమవారం ఈ వ్యాజ్యాల విచారణ నుంచి ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్న జస్టిస్ జయసూర్య తప్పుకున్నారు. దీంతో సీజే మరో న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయితో కలిసి మంగళవారం విచారణ చేపట్టారు. అయితే, విచారణ మొదలుకాగానే జస్టిస్ జ్యోతిర్మయి విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారని సీజే తెలిపారు. మరో న్యాయమూర్తితో కలిసి బుధవారం విచారణ జరుపుతామన్నారు. ఈ సమయంలో రైతుల తరఫున హాజరైన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దేవ్‌దత్ కామత్ స్పందిస్తూ.. విచారణను బుధవారం కాకుండా మరో రోజుకు వాయిదా వేయాలని కోరారు. ఈ అభ్యర్థనను సీజే తోసిపుచ్చారు. ఈ వ్యాజ్యాలపై అత్యవసరంగా విచారణ జరపాలని కోరుతూ పిటిషనర్ల తరఫు ఆన్ రికార్డ్ న్యాయవాది సంజయ్ సూరనేని తనకు వ్యక్తిగతంగా లేఖ రాశారని, అందువల్ల వాయిదా వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బుధవారం విచారణ జరిపి తీరుతామని తేల్చి చెప్పారు.

12లోగా యంత్ర సేవాకేంద్రాల ఏర్పాటు

వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్

సాక్షి, అమరావతి: ఆర్బీకే, క్లస్టర్‌స్థాయి యంత్ర సేవాకేంద్రాలను ఈ నెల 12లోగా పూర్తిచేసి, 19వ తేదీ కల్లా రాయితీ ప్రతిపాదనలు పంపాలని వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం మంగళగిరిలోని కార్యాలయం నుంచి జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సీహెచ్‌సీ యంత్ర సేవా మాడ్యూల్‌ను వైఎస్సార్ యాప్‌లో ఉంచినట్లు చెప్పారు. ఈ యాప్ ద్వారా రైతులు ఆన్‌లైన్‌లో మండలంలోని ఏదైనా ఆర్బీకే పరిధిలోని సీహెచ్‌సీ నుంచి యంత్ర పనిముట్లను అద్దెకు తీసుకునే అవకాశం కల్పించామన్నారు. రైతులందరికీ ఈ యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఏప్రిల్‌లో కురుస్తున్న అకాల వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఈ–క్రాప్ నమోదు ఆధారంగా పంటనష్టం అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. 2023 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి పీఎం కిసాన్ 14వ విడత ఆర్థికలబ్ధి పొందేందుకు ఈ నెల 20వ తేదీలోగా రైతులందరూ ఈ–కేవైసీ నమోదు చేయించుకోవాలని కోరారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోలేని రైతులు ఆధార్ అనుసంధానంతో పాటు ఎన్‌పీసీఐ లింకేజ్ కూడా చేయించుకోవాలని సూచించారు. వేసవిలో నమోదైన ఈ–క్రాప్ పంటలకు ఈ–కేవైసీ చేయించాలన్నారు. ఖరీఫ్–23లో ఈ–క్రాప్ నమోదు జియో రెఫరెన్సింగ్ ద్వారా చేయబోతున్నట్లు చెప్పారు.

ఆర్బీకేల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు

పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లిపెసర, జీలుగ తదితర విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. మిరప, పత్తి పంటలు సాగుచేసే రైతుల కోసం డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు అవసరం మేరకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులెవరూ తొందరపడి ఎక్కువ ధరకు కొనుగోలు చేయవద్దని కోరారు. ఎమ్మార్పీకి మించి విక్రయించినా, కృత్రిమనిల్వకు పాల్పడినా డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2023–24లో ఆర్బీకేల ద్వారా 10 లక్షల టన్నుల ఎరువుల సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇండ్ గ్యాప్ ధ్రువీకరణ పొందేందుకు గ్యాప్ పొలంబడుల నిర్వహణలో నాణ్యత పాటించాలని చెప్పారు. డ్రోన్ పైలెట్ శిక్షణ కోసం స్కిల్ డెవలప్‌మెంట్, ఆత్మ, జిల్లా ఉపాధి అధికారులను సంప్రదించి అర్హులైన గ్రామీణ నిరుద్యోగ యువతను ఎంపికచేసి ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

కొటియా పల్లెల్లోనూ 'గడప గడపకు మన ప్రభుత్వం'

- రెండ్రోజుల పాటు ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర పర్యటన
- ఆధార్‌ను ఒడిశా నుంచి ఏపీకి మార్చాలని వినతి


కొటియా గ్రూపు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి రాజన్నదొర

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఆంధ్రా – ఒడిశా సరిహద్దుల్లోని కొటియా గ్రూపు గ్రామాలకూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పాలన చేరుతోంది. ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అమలు చేస్తున్న పథకాలు గిరిజనులకు ఏ విధంగా చేరుతున్నదీ పరిశీలించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర రెండ్రోజుల పాటు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జోరు వానలోనూ సోమవారం సాలూరు మండలం పట్టుచెన్నేరు, పగులుచెన్నేరు గ్రామాల్లో పర్యటించారు. మంగళవారం శిఖపరువు, దొంకల వెలగ వలస, వెలగ వలస, పనస వలస, కుంజిమడ, కొత్తూరు గ్రామాల గిరిజనులను కలిశారు. తమ ఆధార్ కార్డు ఒడిశా రాష్ట్రంతో అనుసంధానమవడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్నామని కొంతమంది గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్‌ను అక్కడి నుంచి తప్పించి తమకు ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వచ్చేలా మార్పు చేయాలని కోరారు. ఫ్యామిలీ ఫిజీషియన్ (104), అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలు అందించాలని కోరారు. అధికారులతో మాట్లాడి ఆ సేవలు అందేలా చూస్తామని రాజన్న దొర వారికి హామీ ఇచ్చారు.

రూ. 65 లక్షల విలువైన మందుల అందజేత

గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు వితరణ

సాక్షి, అమరావతి: గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు రూ.65 లక్షల విలువైన మందులను నాట్కో ఫార్మా చైర్మన్, ఎండీ వి.సి. నన్నపనేని అందజేశారు. నన్నపనేని, వైస్ చైర్మన్ సదాశివరావు మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును కలిసి మందులు ఇచ్చారు. నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో చికిత్స పొందే పేద రోగులకు ఈ మందులు అందజేయాలని కోరారు. రూ.45 కోట్లతో నిర్మించిన క్యాన్సర్ సెంటర్‌ను సీఎం వైఎస్ జగన్ 2020 జూలైలో ప్రారంభించినట్టు గుర్తు చేశారు. ఆ రోజు నుంచి ఉచితంగానే ఖరీదైన మందులు అందజేస్తున్నామన్నారు. నాట్కో సంస్థ ఉచిత వైద్య సేవలను కృష్ణబాబు అభినందించారు. ఇదే స్ఫూర్తితో కార్పొరేట్ సంస్థలు ప్రజా సేవకు ముందుకు రావాలని పిలుపు ఇచ్చారు.

నిబంధనలకు విరుద్ధం కాబట్టే కేసు

- బాధితుల ఫిర్యాదు మేరకే విచారణ
- అవకతవకలు ఉన్నందునే అరెస్టులు
- జగజ్జననీ చిట్ నిర్వాహకులపై ఎంపీలు బోస్, భరత్


మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, చిత్రంలో పిల్లి సుభాష్ చంద్రబోస్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలో జగజ్జనని చిట్‌ఫండ్ కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించడం, పాటదారులను ఇబ్బందులు పెట్టడంవల్లే సీఐడీ అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ చీఫ్‌విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఇందులో రాజకీయ కోణం, కక్షపూరిత చర్యలుగానీ లేవని ఆయన స్పష్టంచేశారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఎంపీ భరత్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్ మీడియాతో మాట్లాడారు. జగజ్జననీ చిట్‌ఫండ్స్ నిర్వాహకులు, టీడీపీ నేతలైన ఆదిరెడ్డి అప్పారావు, ఆయన తనయుడు ఆదిరెడ్డి శ్రీనివాస్‌లను రాష్ట్ర ప్రభుత్వం కావాలనే అరెస్టుచేయించిందని.. ప్రతిపక్ష నేతలు అధికార వైఎస్సార్‌సీపీపైనా, సీఎం జగన్‌పైనా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారని ఎంపీ భరత్ అన్నారు. నిజానికి.. జగజ్జనని చిట్‌ఫండ్ బాధితుల ఫిర్యాదు మేరకే ఈ విచారణ జరిగిందని.. లోపాలు, అవకతవకలు ఉన్నాయి కాబట్టే ఆ కంపెనీ నిర్వాహకులను సీఐడీ అరెస్టుచేసిందన్నారు. చిట్‌ఫండ్ యాక్ట్–1982 ప్రకారం.. సభ్యుల సొమ్మును జాతీయ బ్యాంకులో మాత్రమే జమచేయాలని, ఆ సొమ్మును కంపెనీ నిర్వాహకులు వారి సొంత ఆస్తులు కూడబెట్టుకోవడానికో, మరో కంపెనీలో షేర్లు, విలాసాలకు ఖర్చుచేయడానికి వీల్లేదన్నారు. సామాన్యులను వివిధ రకాలుగా ఆకర్షించి, మోసం చేస్తామంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని.. ఉక్కుపాదం మోపుతామని ఎంపీ భరత్ హెచ్చరించారు. అవకతవకలున్నాయి కాబట్టే ఆదిరెడ్డి అండ్ కో యాంటిసిపేటరీ బెయిల్ తెచ్చుకున్నారని.. అదుంటే ఎన్ని తప్పులు చేసినా ఫర్వాలేదనుకుంటే ఇంక చట్టాలు, కోర్టులు ఎందుకని ప్రశ్నించారు.

ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నారు : బోస్

ప్రస్తుతం ప్రతి అంశాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. ప్రభుత్వం తన పని తాను చేసుకుంటుంటే దానికి రాజకీయరంగు పులుముతున్నారన్నారు. చిట్‌ఫండ్ కంపెనీ యాక్ట్–79 ప్రకారం.. సంస్థలో ఒక అవినీతి జరిగితే ఆ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఉందని.. కంపెనీలో సాధారణ ఉద్యోగి కూడా దీనికి బాధ్యుడేనన్నారు. అందుకే జగజ్జనని కంపెనీపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

హజ్ యాత్ర విజయవంతానికి చర్యలు

సీఎం జగన్ సమీక్షించారు: హజ్ కమిటీ చైర్మన్ గౌసల్ ఆజమ్

సాక్షి, అమరావతి: హజ్ యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌసల్ ఆజమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషాతో కలిసి మంగళవారం కలిసినట్టు తెలిపారు. హజ్ యాత్రతోపాటు పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. హజ్ యాత్ర ఏర్పాట్లపై సీఎం సమీక్ష జరిపారన్నారు. హజ్ యాత్రకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ఈసారి హజ్ యాత్రలో హజ్ కమిటీ చైర్మన్‌తోపాటు 9 మంది బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులతో పంపేందుకు సీఎం అంగీకరించారని తెలిపారు. విజయవాడ విమానాశ్రయానికి సమీపంలో హజ్ హౌస్ నిర్మాణానికి ఐదెకరాల స్థలం ఎంపికపై అధికారులతో కలిసి తుది నిర్ణయం తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారన్నారు. కడప నగరంలో హజ్ హౌస్ అభివృద్ధికి నిధులు అందిస్తామని సీఎం చెప్పారన్నారు.

'యాప్'రే.. ఇంత మోసమా..

- యూ ట్యూబ్ లింక్ క్లిక్‌తో ఖాతాలో సొమ్ములు హుష్‌కాకి
- వెలుగు చూసిన కొత్త సైబర్ నేరం
- మోసపోవద్దని పోలీసుల హెచ్చరిక



కంబాలచెరువు(రాజమహేంద్రవరం): లింక్ క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలో సొమ్ము మాయం అవ్వడం ఇప్పటివరకు చూస్తున్నాం..సైబర్ నేరగాళ్లు మరో అడుగు ముందుకేసి మోసానికి తెగబడుతూ విస్మయానికి గురి చేస్తున్నారు. తాజాగ యూట్యూబ్ లింక్ క్లిక్ చేసి లైక్ కొడితే డబ్బులు పోయిన వెలుగు చూసింది. ఇలాంటి సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ముందస్తుగా జాగ్రత్త పడాలని జిల్లా పోలీసులు హెచ్చరిస్తున్నారు. దీనికి సంబంధించి వారు వెల్లడించిన వివరాలివి..

అయ్యో శ్రీహరీ...

తక్కువ కష్టంతో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో శ్రీహరి అనే యువకుడు రూ.10 లక్షల డబ్బులు పోగొట్టుకున్నాడు. యూట్యూబ్ లింక్‌లకు లైక్‌లు కొట్టి ఈ విధంగా మోసపోయాడు. శ్రీహరి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. నెలకు సరిపడా జీతంతో ఉద్యోగం ఉంది. అనుకోకుండా ఒక రోజు వాట్సప్ నుంచి ఒక యూట్యూబ్ వీడియో లింక్ వచ్చింది. ఆ లింక్‌ని చూసి లైక్ కొడితే రూ.50 వస్తుందని కింద సమాచారం ఉంది. వెంటనే అతను ముందూ వెనకూ ఆలోచించకుండా ఆ లింక్ ఓపెన్ చేశాడు. ఆ వీడియోకి లైక్ కొట్టి కామెంట్ చేశాడు. అతనికి రూ.50 ఖాతాకు జమ అయ్యింది. దీంతో రెట్టించిన ఉత్సాహంతో శ్రీహరి వారు పంపిన మరిన్ని వీడియోలకు లైకులు కొట్టి కామెంట్ చేయడం మొదలెట్టాడు. ఆరోజు రూ.300 సంపాదించాడు. రెండో రోజు క్రిప్టో బెట్టింగ్ యాప్ వచ్చింది. దాంతో పాటు టెలిగ్రామ్ యూజర్ ఐడీ కూడా వచ్చింది. దీంతో శ్రీహరి టెలిగ్రామ్ యాప్‌లోకి వెళ్లి వారు చెప్పిన విధంగా యాప్‌ను ఓపెన్ చేశాడు. అందులో రూ.3 వేలు జమ చేస్తే రూ.3,900 వస్తాయి అని ఉంది. శ్రీహరి వెంటనే ఆ మొత్తాన్ని జమ చేశాడు. రూ.3,900 రూపాయలు వచ్చినట్లు యాప్‌లో చూపించింది.

మోసపోయాడిలా..

దఫదఫాలుగా శ్రీహరి అధిక సొమ్ము యాప్‌నకు చెల్లించాడు. తర్వాత శ్రీహరి తనకు వచ్చిన డబ్బులు తీసుకోవడానికి ప్రయత్నించాడు. రూ.20 వేలు పూర్తయితేనే ముందు కట్టిన మొత్తం వస్తుందని యాప్ నిర్వాహకులు తెలిపారు. అతడు రూ.20 వేలు ఒకసారి, వారి డిమాండ్ మేరకు మరోమారు రూ.50 వేలు చెల్లించాడు. అతనికి టెలిగ్రామ్ నుంచి మెసేజ్ వచ్చింది. రూ.లక్ష కడితేనే మొత్తం సొమ్ము రూ.లక్షా 60 వేలు వెనక్కివస్తుందనేది అందులో సారాంశం. అతని వద్ద డబ్బులు లేకపోవడంతో స్నేహితుల నుంచి అప్పు తీసుకుని యాప్‌లో రూ.లక్ష చెల్లించాడు. వెంటనే అతనికి రూ.2.60 లక్షలు డిపాజిట్ అయినట్లు యాప్ లో చూపించింది. శ్రీహరి డబ్బులు తీసుకోవడానికి ప్రయత్నించాడు. టెలిగ్రామ్ యాప్ 70శాతం మాత్రమే పూర్తి చేశారని.. మిగిలిన 30 శాతం పూర్తి చేస్తే రెట్టింపు సొమ్ము వస్తుందని నిర్వాహకుల నుంచి సమాచారం వచ్చింది. డబ్బులు లేకపోవడంతో క్రెడిట్‌కార్డు నుంచి విత్‌డ్రా చేసి పూర్తిగా రూ.10 లక్షలు కట్టడంతో యాప్‌లో అతనికి రూ.16 లక్షలు చూపించింది. ఆ సొమ్ము తీసుకునేందుకు ప్రయత్నించగా రాలేదని తెలుసుకున్నాడు. తర్వాత అతను ఫోన్ చేసినా యాప్ నిర్వాహకులు ఎత్తలేదు. తాను మోసపోయానని శ్రీహరి గ్రహించాడు.తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసి లబోదిబోమన్నాడు. ఇలాంటి సైబర్ నేరాలు అందరికీ తెలియాలనే ఉద్దేశంతో మోసం జరిగే తీరును జిల్లా ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డి మంగళవారం మీడియాకు వివరించారు. అధిక లాభాలు వస్తాయని ఆన్‌లైన్‌లో తెలియని లింకులు క్లిక్ చేయవద్దని ఆయన సూచించారు. ఎటువంటి పరిస్థితిలోనూ డబ్బులు పంపి మోసపోవద్దన్నారు. కొత్త వ్యక్తులు (సైబర్ నేరస్తులు) చేసే మేసేజీలు, యూట్యూబ్ వీడియో లింక్స్, యాప్స్ వంటివి వెంటనే తిరస్కరించాలన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చేయాలన్నారు. సైబర్‌క్రైమ్.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు.

ఉజ్వలాంధ్ర


భోగాపురం ఎయిర్‌పోర్టు నమూనా

- రూ.4,592 కోట్లతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
- రూ. 21,844 కోట్లతో అదానీ డేటా సెంటర్
- రూ.2వేల కోట్లతో తారకరామ తీర్థసాగర్, జెట్టీ నిర్మాణం
- సీఎం జగన్ చేతుల మీదుగా నేడు శంకుస్థాపన

భోగాపురం ఎయిర్‌పోర్టు ఇలా

విస్తీర్ణం	2,203 ఎకరాలు
నిర్మాణ వ్యయం	రూ.4,592
నిర్మాణ సంస్థ	జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్
రన్‌వే పొడవు	3.8 కి.మీ
తొలి దశ	ఏటా 60 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలకు వీలు
ఉపాధి	ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా 5 లక్షల మందికి..

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఉత్తరాంధ్రవాసుల కలలు ఒక్కొక్కటిగా నిజమవుతున్నాయి. ఇటీవలే శ్రీకాకుళంలో మూలపేట పోర్టు పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. బుధవారం మరిన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.4,592 కోట్లతో భోగాపురం వద్ద నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయం, రూ.21,844 కోట్ల పెట్టుబడులతో మధురవాడ ఐటీ హిల్‌లో అదానీ డేటా సెంటర్, సుమారు రూ.2 వేల కోట్ల వ్యయంతో నిర్మించనున్న తారకరామ తీర్థసాగర్, జెట్టీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఒకవైపు అంతర్జాతీయ విమానాశ్రయం.. మరోవైపు అదానీ డేటా సెంటర్ ఏర్పాటుతో పాటు మత్స్యకారుల సంక్షేమం కోసం పోర్టు, జెట్టీ, రైతుల సంక్షేమం కోసం రిజర్వాయర్ నిర్మాణంతో ఉత్తరాంధ్ర.. ఉజ్వలాంధ్రగా మారనుందని అందరిలో సంతోషం వ్యక్తమవుతోంది.

రెండు వారాల వ్యవధిలోనే..

కొద్ది రోజుల కిందట శ్రీకాకుళం జిల్లాలో రూ.4,362 కోట్ల వ్యయంతో చేపడుతున్న మూలపేట పోర్టు పనులకు సీఎం శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అలాగే రూ.176.35 కోట్లతో వంశధార లిఫ్టు పనులు, రూ.300 కోట్లతో మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్, రూ.365.81 కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేశారు. ఇప్పుడు మరిన్ని భారీ పెట్టుబడులకు పలు ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపనలు చేస్తుండటం విశేషం. ఈ పెట్టుబడుల ప్రవాహంతో స్థానికులకు భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రానున్న రోజుల్లో విశాఖపట్నం ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా మారనుంది.

నాడు

2019 ఫిబ్రవరి 14న భోగాపురం విమానాశ్రయానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు శిలాఫలకం ఆవిష్కరించారు. సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా రెండు నెలల ముందు తూతూమంత్రంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటికి భూసేకరణ ప్రక్రియ కొలిక్కి రాలేదు. శిలాఫలకం వేసిన స్థలం సహా అంతా వివాదాస్పదమే.. వందకు పైగా రైతులు వేసిన పిటిషన్లు కోర్టు విచారణలోనే ఉన్నాయి. నిర్వాసితులకు ఓ దారి చూపించలేదు. విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి అనుమతులేవీ రాలేదు. ఈ కార్యక్రమానికి విమానయాన శాఖ మంత్రిగా పని చేసిన అశోక్ గజపతిరాజు ముఖంచాటేశారు.

నేడు

సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే భోగాపురం విమానాశ్రయానికి కార్యరూపం తీసుకొచ్చేందుకు త్రిముఖ వ్యూహం అనుసరించారు. భూసేకరణ పూర్తి చేయించారు. రైతులకు తగిన నష్టపరిహారం, నిర్వాసితులకు పునరావాసం విషయంలో ఉదారతను చాటుతూ వారిని ఒప్పించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌లో పిటీషన్లన్నీ పరిష్కారమయ్యేలా చొరవ చూపించారు. ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులను తరచూ సంప్రదిస్తూ విమానాశ్రయానికి అవసరమైన అనుమతులన్నీ సాధించారు. అలా అడ్డంకులన్నీ అధిగమించడానికి, అనుమతులన్నీ తేవడానికి నాలుగేళ్ల సమయం పట్టింది.

విశాఖ వైపు మరింత అభివృద్ధి

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం అధునాతనంగా రూపుదిద్దుకోనుంది. ఒకేసారి 22 విమానాలను నిలిపి ఉంచేందుకు వీలుగా.. ఏటా 1.80 కోట్ల మంది ప్రయాణికులు విమానయానానికి అనుగుణంగా రూ.4,592 కోట్ల పెట్టుబడితో ఈ విమానాశ్రయానికి నిర్మించనున్నారు. ఇక్కడే ఏవియేషన్ అకాడమీ కూడా ఏర్పాటు కానుంది. భోగాపురం నుంచి విశాఖ వైపు అభివృద్ధి చేసేందుకు అనుగుణంగా 154.74 ఎకరాల్లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. 139.16 ఎకరాల్లో విశాఖ నగరం వైపునకు రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్ చేపట్టాలని నిర్ణయించారు. తద్వారా భోగాపురం నుంచి విశాఖ నగరం వరకు నివాసిత ప్రాంతాలు అభివృద్ధి చెందనున్నాయి. హైదరాబాద్–సికింద్రాబాద్ జంట నగరాల తరహాలో రానున్న రోజుల్లో విశాఖ–విజయనగరం కలిసి అభివృద్ధి చెందే అవకాశం ఉందనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్వాసితులను ఒప్పించి.. కోర్టుల్లో ఉన్న కేసులన్నీ పరిష్కరించి జీఎంఆర్ సంస్థకు ఆ భూములను అప్పగించారు.

సీఎం జగన్ పర్యటన ఇలా..



బుధవారం ఉదయం 8.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 9.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి 9.30 గంటలకు బయలుదేరి 10 గంటలకు భోగాపురం మండలంలోని ఎ.రావివలసకు చేరుకుంటారు. 10.30 గంటలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్, తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ పనులకు శంకుస్థాపన చేస్తారు. బహిరంగ సభ అనంతరం 12.30 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. 2.30 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్–4లో వైజాగ్ టెక్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. తరువాత ఎంపీ ఎంవీవీ ఇంటికి చేరుకుని నూతన దంపతులైన ఆయన కుమారుడు, కోడలను ఆశీర్వదిస్తారు. 5.30 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి గన్నవరం బయలుదేరుతారు.

నాడు

తమ ప్రభుత్వ హయాంలోనే అదానీ డేటా సెంటర్ వచ్చిందంటూ టీడీపీ నేతలు వాస్తవాన్ని దాచిపెట్టి గొప్పలకుపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎక్కడా భూమి కూడా చూపించకుండానే 2019 జనవరి 9వ తేదీన కాపులుప్పాడ, నక్కపల్లి, జి.చోడవరం ప్రాంతాల్లో మూడు డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు టీడీపీ ప్రభుత్వం హడావుడిగా అవగాహన ఒప్పందం చేసుకుంది. ఎటువంటి నిర్దిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

నేడు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అదానీ డేట్ సెంటర్‌కు నిర్దిష్టంగా భూమిని కేటాయించడంతో పాటు ప్రభుత్వం నుంచి ఏయే సహాయ సహకారాలను అందిస్తున్న విషయాన్ని కూడా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మధురవాడలోని సర్వే నంబర్ 409లో 130 ఎకరాల్లో అదానీ డేట్ సెంటర్ ఏర్పాటవుతోంది. కాపులుప్పాడలో మరో డేటా సెంటర్ కోసం 60.29 ఎకరాలను కూడా కేటాయించింది. ఇందుకు అనుగుణంగా 2023 మార్చి 11న ఉత్తర్వులు జారీ చేసింది.

ఇదీ అదానీ డేటా సెంటర్

వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ (వీటీపీఎల్) ఆధ్వర్యంలో రూ. 21,844 కోట్లతో 190.29 ఎకరాల్లో 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్‌తో పాటు ఐటీ, బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీ, రిక్రియేషన్ సెంటర్ ఏర్పాటు కానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా 39,815 మందికి ఉపాధి లభించనుంది. మొత్తం ఏడేళ్ల కాలంలో దీని నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్టు కంపెనీ ఒప్పందం చేసుకుంది.



పెట్టుబడులు ఇలా..

మొదటి దశలో..

ప్రాజెక్ట్	పెట్టుబడి (కోట్లలో)	ఉపాధి
200 ఎండబ్ల్యూ డేటా సెంటర్	10,288	4,040
ఐటీ, బిజినెస్ పార్క్	2,363	15,110
స్కిల్ సెంటర్	1,171	3,750
మొత్తం	14,634	24,990

రెండో దశ(కాపులుప్పాడ వద్ద)లో..

ప్రాజెక్ట్	పెట్టుబడి (కోట్లలో)	ఉపాధి
100 మెగావాట్ల డేటా సెంటర్	5,070	2,200
ఐటీ, బిజినెస్ పార్క్	1,165	15,350
స్కిల్ సెంటర్	400	1,025
రిక్రియేషన్ సెంటర్	575	1,875
మొత్తం	7,210	20,450

నాలుగు దశల్లో చేపట్టనున్న ఈ నిర్మాణాలను ఏడేళ్ల కాలంలో పూర్తి చేస్తానని కంపెనీ తెలిపింది.

యాదాద్రిలో శ్రీనృసింహ జయంత్యుత్సవాలు ప్రారంభం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో మంగళవారం శ్రీనృసింహస్వామి వారి జయంత్యుత్సవాలను ఆచార్యులు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం ప్రారంభించారు. ఆలయంలో స్వస్తి వచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. తిరువేంకటపతిగా శ్రీనృసింహస్వామిని అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో సైతం శ్రీనృసింహస్వామి జయంత్యుత్సవాలు ప్రారంభించారు. జయంత్యుత్సవాలకు దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత హాజరయ్యారు. ఆలయ మాడ వీధిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఉన్నది ఒకటే జీవితం ... కోరుకున్న విధంగా బతకాలన్నదే తాపత్రయం
అడ్డుపడే వైకల్యం .. అడ్డంపడే కుటుంబ నిబంధనల నుంచి
తమకంటూ ఓ కొత్త లోకాన్ని ఏర్పాటు చేసుకోవాలని
తపించే వారికి అండగా ఉంటుంది కృష్ణప్రియ.
హైదరాబాద్ ఉప్పల్‌లో ఉంటున్న దివ్యాంగురాలైన కృష్ణప్రియ
తను నిలదొక్కుకోవడమే కాకుండా
తనలాంటి వారికి దగ్గరుండి మరీ పెళ్లిళ్లు చేస్తోంది.
కష్టపడుతూనే ఇష్టమైన జీవన ఫలాలను అందుకోవడానికి తపిస్తున్న
కృష్ణప్రియను కలిస్తే తమ గురించి ఇలా వివరించింది..


కృష్ణప్రియ

అదిగో నవలోకం

● వారికి అండగా ఆమె

"మూడేళ్ల వయసులో నరాల సమస్య వల్ల కాళ్లు రెండు చచ్చుబడిపోయాయి. అయినా, నా ఉత్సాహం చూసి స్కూల్ చదువు వరకు చెప్పించారు మా అమ్మానాన్న. ఇక చదువు వద్దు అంటే నేనే మొండికేసి ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నాను. ఆ తర్వాత ఇంట్లోనే ఉండేదాన్ని. ఇంట్లో సినిమాలు చూడటానికి కంప్యూటర్ తీసుకున్నారు నాన్న. ఖాళీ సమయంలో యూ ట్యూబ్ చూసి డిజిటల్ వర్క్స్ నేర్చుకున్నాను. డిటిపీ వర్క్స్, ఆన్‌లైన్, సోషల్‌మీడియా వర్క్స్ చేస్తుండేదాన్ని. హాస్టల్‌లో ఉండి నన్ను నేను పోషించుకుంటాను అని ఓ రోజు చెప్పాను. 'మేం నీకు ఇంత తిండి పెట్టలేమా? బయట అవస్థలు పడుతుంటే నలుగురు చూసి ఏమనుకుంటారు?' అని అమ్మానాన్నా, 'నడవడమే సరిగా రాదు, ఏం సాధిస్తావని, ఇంటి పట్టున ఉండక' అని తెలిసినవాళ్లు.. ఇలాంటి మాటలు విని విని విసిగిపోయాను. ప్రతిదానికి ఇంట్లో వారిపై ఆధారపడటం, భారంగా ఉండటం ఇష్టం లేక ఎనిమిదేళ్ల క్రితం బయటకు వచ్చేశాను. మూడేళ్లు ఒక్కదాన్నే రూమ్ తీసుకుని ఉన్నాను. వచ్చిన కంప్యూటర్ వర్క్స్ నాకు కొంత ఆదాయాన్ని తెచ్చిపెట్టేవి.

■ ఒక్కొక్కరూ జతగా చేరి..

దివ్యాంగుల కోసం పనిచేస్తున్న ఎన్జీవోలను కలిశాను. అక్కడ నాలాంటి వారెందరో కలిశారు. వైకల్యం ఎలాగూ బాధిస్తుంది. మరొకరి మీద ఆధారపడటం మరింతగా బాధిస్తుంది. ఇంట్లో వారిమీద ఆధారపడటం ఇష్టంలేని కొంతమంది దివ్యాంగ అమ్మాయిలు నాతో కలిశారు. దీంతో పెద్ద ఇల్లు అద్దెకు తీసుకున్నాను. ఇంటి యజమానులు మాకు అద్దెకు ఇల్లు ఇవ్వడానికి ఇష్టపడేవారు కాదు. 'మీ పనులు మీరే సరిగా చేసుకోలేరు. ఇక ఇంటినేం శుభ్రంగా ఉంచుతారు' అనేవారు. కొన్ని రోజుల ప్రయత్నంతో ఎలాగో ఇల్లు దొరికింది. మరో ఆరుగురు నాతో కలిశారు. చిన్న హాస్టల్‌లా 'ఆద్య' అనే పేరుతో దివ్యాంగుల కోసం హోమ్ ప్రారంభించాను. మాలాంటి వారి సమస్యల పట్ల మాకే అవగాహన ఉంటుంది కాబట్టి, అందరం ఒకింటి సభ్యుల్లా కలిసిపోయాం.

■ పెళ్లితో కొత్త జీవితం..

దివ్యాంగుల చదువు, ఉద్యోగం, పెళ్లి .. ప్రయత్నాల్లో ఉండేవారికి, తమ గురించి తాము ఆలోచించుకోవడానికి తగిన వాతావరణం గల ప్రత్యేక హోమ్స్ అంటూ ఏమీ లేవు. జీవితంలో నిలదొక్కుకోవడానికి కావాల్సిన వాతావరణం కల్పించే సరైన వసతి మాకు ఎక్కడా కనిపించలేదు. దాంతో ఎక్కువ వైకల్యం ఉన్న వారి కోసం నేనే అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశాను. రెండేళ్ల క్రితం దివ్యాంగుడైన సత్తయ్యను పెళ్లి చేసుకున్నాను. అతను ఫ్లోర్‌వాకర్. ఎన్జీవోల సాయంతో చిన్న షాప్ నడుపుతున్నాడు. నాకంటూ ఓ జీవితాన్ని ఏర్పాటు చేసుకున్నాను.

> భార్యాభర్తలు ఇద్దరూ దివ్యాంగులే అయితే, మా సమస్యలు మాకు బాగా అర్థం అవుతాయి. ఒకరికొకరం తోడుగా ఉంటాం. దివ్యాంగ సమావేశాలు ఎక్కడ జరిగినా, మాకు అందే అవకాశాల గురించి ఎప్పటికప్పుడు మీటింగ్‌లు ఏర్పాటు చేసుకుంటాం. ఇక్కడ అందరూ ఆప్యాయంగా అక్కా అని పిలుస్తుంటారు. ఏ చిన్న సమస్య వచ్చినా చెప్పుకోవడానికి తోడున్నామనే భరోసా ఉంది.
> – కృష్ణప్రియ



నాతోపాటు ఉన్న అమ్మాయిలలో నలుగురికి దగ్గరుండి పెళ్లిళ్లు జరిపించాను. ఇందుకు అవసరమైన డబ్బులను పోగుచేయడానికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. అవమానకరంగా మాట్లాడినవారూ ఉన్నారు. కానీ, మాకూ ఓ జీవితం ఉందని తెలియజేయాలనుకున్నాను. దివ్యాంగులైన అమ్మాయిలు పెళ్లి చేసుకోవడానికి కొంచెం వెనకంజ వేసేవారు. తమనెవరు పెళ్లి చేసుకుంటారనే నిస్పృహ వారిలో ఉండేది. ఇందుకోసం చాలా కౌన్సెలింగ్ చేయాల్సి వచ్చింది. మాకు ఇళ్లలో చదువు, కళలు, వ్యాపారాలు, వృత్తి విద్యల పట్ల ఆసక్తి ఉన్నా పెద్దగా ప్రోత్సాహం ఉండదు. ఎంత టాలెంట్ ఉన్నా ఎంత వయసు వచ్చినా ఏళ్లకేళ్లు ఇంటికే పరిమితమవ్వాలి. ఇక వివాహం .. కల్లో కూడా ఊహించలేం. ఈ పరిస్థితులన్నీ మనకు మనమే అధిగమించాలని చెబుతుంటాను.

■ మాకు మేమే పరిష్కారం

మాకు అసలు పెళ్లి భాగ్యం ఉందా అనుకున్న అమ్మాయిలు ఒకింటి వారై తమకు తాముగా కొత్త జీవితాన్ని గడుపుతుండటం చాలా ఆనందంగా ఉంటుంది. దివ్యాంగుల పెళ్లిళ్లు, పోషణ నిమిత్తం మా స్నేహితులు, బంధువులు, ఎన్జీవోల సాయం తీసుకుంటున్నాను. 'ఇవన్నీ ఎందుకు? మీరే చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. మళ్లీ పెళ్లిళ్లు చేసుకొని ఎందుకు కష్టపడతారు' అంటుంటారు. కానీ, మాకూ ఓ కుటుంబ జీవనం కావాలని, నలుగురిలో మేమూ గొప్పగా జీవించాలనీ ఉంటుంది కదా! అందుకే ఇంతగా తాపత్రయపడుతున్నాను. భార్యాభర్తలు ఇద్దరూ దివ్యాంగులే అయితే, మా సమస్యలు మాకు బాగా అర్థం అవుతాయి. ఒకరికొకరం తోడుగా ఉంటాం. దివ్యాంగ సమావేశాలు ఎక్కడ జరిగినా, మాకు అందే అవకాశాల గురించి ఎప్పటికప్పుడు మీటింగ్‌లు ఏర్పాటు చేసుకుంటాం. ఇక్కడ అందరూ ఆప్యాయంగా అక్కా అని పిలుస్తుంటారు. ఏ చిన్న సమస్య వచ్చినా చెప్పుకోవడానికి తోడున్నామనే భరోసా ఉంది. మరిన్ని అవకాశాలు లభిస్తే ఎవరి మీదా ఆధారపడకుండా బతకాలన్నదే మా ఆలోచన'' అని వివరించింది కృష్ణప్రియ. దివ్యంగా ఉన్న ఆమె ఆశయాలు నెరవేరాలని కోరుకుందాం.

– నిర్మలారెడ్డి

● న్యూస్‌మేకర్

ఆరేళ్ల పాప కారిడార్‌లో ఆడుతుంటేనే చిన్న భయం ఉంటుంది.
17,500 అడుగుల ఎత్తు ఉండే ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేరుకోవాలనుకుంటే?
పూణెకు చెందిన ఆరేళ్ల ఆరిష్క లడ్డా ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేరుకున్న అత్యంత చిన్నారిగా రికార్డు స్థాపించింది.
తల్లితో కలిసి పదిహేను రోజులపాటు ఆరోహణ చేసి ఈ సాహసకార్యం పూర్తి చేసింది.
కొంతమంది చిన్నారులు పుట్టుకతో చిరుతలు అని పాడుకోవాలి ఇలాంటి పిల్లలను చూస్తే.


ఆరిష్క లడ్డా



ఎవరెస్ట్ పర్వతాన చిన్నారి పాదాలు

ఆరేళ్ల ఐదు నెలల వయసు ఉన్న ఆరిష్కా లడ్డాకు నిజంగా తానేం ఘనకార్యం చేసిందో తెలియదు. ప్రపంచంలోనే ఎత్తయిన పర్వతం బేస్ క్యాంప్‌కు చేరుకోవడం అంత చిన్న వయసులో అసాధ్యమైనా సాధ్యం చేసిందనీ తెలియదు. తల్లి చేయి పట్టుకుని ఎంత దూరమైనా సాగగలను అనే నమ్మకమే ఆరిష్కాను సముద్ర మట్టానికి 17,500 ఎత్తు ఉన్న ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేర్చింది. పూణెలో ఇప్పుడు ఆ పాప నివాసం ఉంటున్న కొత్‌రుడ్ ఏరియా, చదువుతున్న స్కూలు, బంధువులు అందరూ గర్వపడుతున్నారు. ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

'12 ఏళ్ల లోపు ఉన్న పిల్లలను ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు తీసుకెళ్లరు. ఎందుకంటే పర్వతారోహణ సమయంలో తమ ఆరోగ్యంలో ఎటువంటి మార్పు వస్తున్నదో చిన్న వయసు పిల్లలు స్పష్టంగా చెప్పలేరు. అలా చెప్పకపోతే ప్రమాదం వస్తుంది. మేము రిజిస్టర్ చేసుకున్న సంస్థను నడిపే భగవాన్ చావ్లే మా పూణెకు చెందిన పర్వతారోహకుడు. మూడుసార్లు ఎవరెస్ట్ ఎక్కాడాయన. పర్వతారోహణలో విశేష అనుభవం ఉంది. ఆయన మార్గదర్శకత్వంలో నేను ఆరిష్కాతో పాటుగా ఎవరెస్ట్ బేస్‌క్యాంప్‌కు వెళ్లాలనుకున్నప్పుడు– మీ సొంత రిస్క్ మీద తీసుకువెళతాను. కాని పాప ఆరోగ్యంలో ఏ మాత్రం మార్పు వచ్చినా వెంటనే వెనక్కు పంపిస్తాను అని చెప్పాడు. నేను అంగీకరించాను. ఎందుకంటే నా కూతురు సాధించగలదన్న నమ్మకం ఉంది' అంది ఆరిష్కా తల్లి డింపుల్ లడ్డా.

ప్రాథమిక శిక్షణ

ఆరిష్కా పూణెలో వారాంతంలో చుట్టుపక్కల కోటలను, కొండలను ట్రెక్ చేసేది. గత సంవత్సరం వైష్ణోదేవికి వెళ్లినప్పుడు కూడా హుషారుగా నడిచింది. 'అది గమనించాకే బేస్‌క్యాంప్‌కు నడవగలదు అన్న నమ్మకం కుదిరింది' అంది డింపుల్. ఏప్రిల్ మొదటివారంలో మొదలైన వీరి ఆరోహణ పోను 65 కిలోమీటర్లు రాను 65 కిలోమీటర్లు మొత్తం 130 కిలోమీటర్ల పొడవునా కాలినడకన సాగింది. అంత దూరమూ ఆరిష్కా తల్లికి సహకరిస్తూ హుషారుగా నడవగలిగింది.

ఖర్జూరాలు, డ్రైఫ్రూట్ లడ్డూలు

పర్వతారోహణ చేయాలంటే చాలా శక్తి కావాలి. అందుకు మంచి ఆహారం ఉండాలి. 'మేము శాకాహారులం. పర్వతారోహణలో మాకు పప్పన్నం మాత్రమే శాకాహారంగా దొరికింది. అయితే పాపకు నేను ఖర్జూరాలు, డ్రైఫ్రూట్ లడ్డూలు ఎక్కువగా పెట్టాను. వేణ్నీళ్లు ఎక్కువగా తాగేలా చూశాను. చలి నుంచి కాపాడటానికి 7 దొంతరల బట్టలు తొడిగి జాగ్రత్త తీసుకున్నాను. ఆ దారిలో మైనస్ 3 నుంచి మైనస్ 16 వరకు ఉష్ణోగ్రతలు ఉండేవి. ఒక్కోసారి పాప తలనొప్పి, చెవుల నొప్పి అని కంప్లయింట్ చేసేది. అయితే అదృష్టవశాత్తూ కొద్దిపాటి మందులతో కుదుటపడింది' అని తెలిపింది డింపుల్.

> పాపను చలి నుంచి కాపాడటానికి 7 దొంతరల బట్టలు తొడిగి జాగ్రత్త తీసుకున్నాను. ఆ దారిలో మైనస్ 3 నుంచి మైనస్ 16 వరకు ఉష్ణోగ్రతలు ఉండేవి.
> – డింపుల్, అరిష్కా తల్లి

ఎవరెస్ట్ బేస్ క్యాంప్ దగ్గర చెయ్యూపుతూ నిలబడటంతో మన దేశం నుంచి అత్యంత చిన్న వయసులో అక్కడివరకూ చేరిన చిన్నారిగా ఆరిష్కా రికార్డు సాధించింది. 'ఇక ఆమెను మరింత ప్రొఫెషనల్‌గా తీర్చిదిద్దుతాను. ఎవరెస్ట్ ఎక్కేలా చేస్తాను. తోడుగా కావాలంటే నేనూ ఎక్కుతాను' అని తెలిపింది డింపుల్. తండ్రి కౌస్తుభ్ 'నా కూతురిని చూసి గర్వపడుతున్నాను. ఈ ఘనత అంతా తల్లీకూతుళ్లదే. నేను కేవలం సపోర్టింగ్ యాక్టర్‌ని' అని నవ్వాడు.

ఆరిష్కాకు అభినందనలు. ●

స్వర విన్యాసాలు యూత్‌కు కొత్త కాదు.
అయితే ఆ కళ ఇప్పుడు తమ వ్యక్తిగత వినోదానికి మాత్రమే పరిమితం కావడం లేదు.
ఆ కళ కెరీర్‌గా మారి వారిని ఎక్కడికో తీసుకువెళుతోంది.
'ది వాయిస్ ఈజ్ ఏ సెకండ్ ఫేస్' అనే మాట ఉంది.
అదేమిటోగానీ...
తమ వాయిస్ యూత్‌కు బలంగా మారింది.
అది ఇప్పుడు కొత్త అవకాశాలకు దారి చూపుతోంది....



నీ పలుకే బంగారం!



> నా గొంతు విని ఆశ్చర్యపోయేవారు. అసహ్యంగా ముఖం పెట్టేవారు... అదే గొంతు విని అభినందించే స్థాయికి చేరుకోవాలి అనే పట్టుదలతో వాయిస్–వోవర్ రంగంవైపు వచ్చాను.
> – రీచా నిగమ్

పాండమిక్ టైమ్‌లో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు దూసుకుపోవడం అనేది ఒక కోణం అయితే ఆ ప్లాట్‌ఫామ్‌ల వల్ల స్వర బలం కలిగిన యువతకు బోలెడు అవకాశాలు రావడం రెండో కోణం.

ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లే కాదు న్యూస్‌రీడింగ్, పాడ్‌కాస్ట్, ఫిల్మ్, డాక్యుమెంటరీలు, రేడియో... మొదలైన విభాగాలలో యువతకు మంచి అవకాశాలు వస్తున్నాయి.

వాయిస్ వోవర్ ప్రొఫెషన్‌కు ఎలాంటి ప్రత్యేక అకడమిక్ క్వాలిఫికేషన్‌లు అక్కర్లేకపోయినా వాయిస్–వోవర్‌పై షార్ట్–టర్మ్ కోర్సులు రూపొందించిన మీడియా ఇన్‌స్టిట్యూట్‌లలో చేరడానికి యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.


ఈ విద్యకు ఏకాగ్రత అనేది అతి ముఖ్యం. సమయస్ఫూర్తి ఉంటే మ్యాజిక్ సృష్టించవచ్చు.
– రవీనా రవి

ఓవర్‌నైట్ సక్సెస్ కావాలనుకోవడం లేదు. పరుగులు తీయాలనుకోవడం లేదు.

'కళాకారులకు బోలెడు ఓపిక కావాలి' అనేది వారికి తెలియనిదేమీ కాదు.

యువతకు అత్యంత స్ఫూర్తి ఇస్తున్న వాయిస్–వోవర్ ఆర్టిస్ట్‌లలో రీచా నిగమ్ ఒకరు.

ముంబైకి చెందిన రీచా నిగమ్ కుటుంబంలో అందరూ గాయకులే. రీచాకు శాస్త్రీయసంగీతం నేర్పిద్దాం అనుకున్నాడు తండ్రి. అయితే ఆమె గొంతు విన్న గురువు 'అమ్మాయి గొంతు సంగీతానికి సరిపోదేమో' అని పెదవి విరిచాడు.

ఇక స్కూల్‌రోజుల్లో ఆమె గొంతును 'హస్కీ వాయిస్' 'అన్‌పర్‌ఫెక్ట్‌వాయిస్' 'హారర్ వాయిస్'... ఇలా రకరకాలుగా పిలుచుకునేవారు.

తన గొంతులో ఉన్న ప్రత్యేకత వల్ల తమ ఆల్–గర్ల్స్ స్కూల్‌లో ప్రదర్శించే నాటకాలలో మగ పాత్రలు తానే వేసేది రీచా.

'నా గొంతు విని ఆశ్చర్య పోయేవారు. అసహ్యంగా ముఖం పెట్టేవారు...అదే గొంతు విని అభినందించే స్థాయికి చేరుకోవాలి' అనే పట్టుదల ఆమెలో పెరిగి వాయిస్–వోవర్ రంగం వైపుకు రావడానికి కారణం అయింది.

'నా గొంతు విని ఎవరు అవకాశాలు ఇస్తారు?' అని ఆమె ఎప్పుడూ నిరాశ పడలేదు.

'ఎక్కడో ఏదో అవకాశం నన్ను వెదుక్కుంటూ తప్పకుండా వస్తుంది' అని బలంగా నమ్మింది. ఆమె నమ్మకం వృథా పోలేదు. ఒక యాడ్ ఫిల్మ్‌లో ఒక అమ్మాయికి నాన్–సిటీ వాయిస్, అన్‌పాలిష్డ్ వాయిస్‌తో వాయిస్–వోవర్ చెప్పే అవకాశం వచ్చింది.

ఇక ఆమె వెనక్కి తిరిగిచూసుకోలేదు.

తన యూనిక్ వాయిస్‌తో మన దేశంలోని టాప్–5 వాయిస్ వోవర్ ఆర్టిస్ట్‌లలో ఒకరిగా పేరు తెచ్చుకుంది రీచా నిగమ్.

లక్ష్యాన్ని ఏర్పర్చుకోవడమే కాదు, ఆ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో తాము రాణించాలనుకుంటున్న రంగంలోని ప్రతిభావంతులు చెప్పే మంచి మాటలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతుంది యువత. దీనికి ఉదాహరణ వాయిస్ యాక్టర్ రవీనా రవి.

దక్షిణాది సినిమాలలో స్టార్ హీరోయిన్‌లకు డబ్బింగ్ చెబుతోంది రవీనా.

'వాయిస్ వోవర్ అంటే స్క్రీన్ చూస్తూ మైక్ ముందు మాట్లాడడం కాదు. అది యాంత్రికమైన పని ఎంత మాత్రం కాదు. మూడ్ ఆఫ్ ది క్యారెక్టర్‌ను పట్టుకోగలగాలి. నటులలో ప్రతి ఒక్కరికీ తమదైన ప్రత్యేకత ఉంటుంది. ప్రతి ఎమోషన్‌కు ఒక మీటర్ ఉంటుంది. దానిపై అవగాహన ఉండాలి. ఈ విద్యకు ఏకాగ్రత అనేది అతి ముఖ్యం. తగినంత సమయస్ఫూర్తి ఉంటే అద్భుతాలు సృష్టించవచ్చు' అంటోంది రవీనా రవి.

'కోకిలలాంటి తీయటి గొంతు ఉంటే చాలు...'

'కంచుకంఠం నీ సొంతమైతే చాలు...'

'అవకాశాలు పరుగెత్తుకుంటూ వస్తాయి' అనేది ఒకప్పటి మాట.

రచయితలు రకరకాల పాత్రలు సృష్టించడం, మాండలికాలకు వినోదరంగంలో మహర్దశ నడుస్తుండడం... మొదలైన కారణాల వల్ల ఇప్పుడు రకరకాల గొంతులకు ఇండ్రస్టీ స్వాగతం పలుకుతోంది.

'నా వాయిస్ డిఫరెంట్‌గా ఉంటుందని ఫ్రెండ్స్ అంటుంటారు. నేనెందుకు వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌గా ప్రయత్నించకూడదు' అనుకుంటున్నారు వారు యువతరంలో పెద్ద సంఖ్యలోనే కనిపిస్తున్నారు. ●

యూత్ పల్స్

ఒక పుస్తకం.. ఒక చాయ్!




గీతిక ఆనంద్

● ఒక విజయ గీతిక

కుటుంబం, స్నేహితులు ఎవరూ లేని ఒంటరితనం చుట్టుముట్టినప్పుడు వచ్చిన ఆలోచనను అమలులో పెట్టింది గీతిక ఆనంద్. కితాబీ చాయ్ (బుక్ టీ)పేరుతో కేఫ్ అండ్ బుక్ స్టోర్ ప్రారంభించి, సక్సెస్ బాటలో నడిపిస్తోంది. ఈ కేఫ్‌లో ఆరు వేలకు పైగా పుస్తకాలు ఉంటాయి. వంద రూపాయలు చెల్లించి, నచ్చిన పుస్తకాన్ని ఎంచుకొని మూడు గంటల పాటు కూర్చొని టీ తాగుతూ చదువుకోవచ్చు. పుణేలో ఉన్న ఈ కేఫ్ నుంచి దేశంలో ఎక్కడ నుంచైనా పుస్తకాలను కొనుగోలు చేయవచ్చు. ఈ స్టోర్ గురించి వచ్చిన ఆలోచనను గీతిక పంచుకుంటూ...

''రాత్రి తర్వాత ఉదయం కచ్చితంగా వస్తుందని చెబుతారు. అలాగే చెడు కాలం కూడా వెళ్లిపోతుంది. అయితే కష్ట సమయాల్లో ఓర్పు, ధైర్యం చాలా ముఖ్యం అని నా జీవితమే నాకు తెలియజేసింది. ఇండోర్‌లో పుట్టి పెరిగాను. ఇప్పుడు పుణేలో వ్యాపారవేత్తగా ఉన్నాను. నా జీవితంలో అత్యంత బాధాకరమైన విషయం పెళ్లి బంధం నుంచి విడిపోవడం. విడాకుల సమయంలో నా చుట్టూ ఒంటరితనం తప్ప మరేమీ లేదు. బయట ఏదైనా ప్లేస్‌లో కాసేపు కూర్చోవడానికి చాలా చోట్లు వెతకాల్సి వచ్చింది.

కళ్లలో ఎన్నో కలలు

2013లో పెళ్లి తర్వాత పుణే వచ్చాను. ఏవేవో కలలు ఉండేవి. కానీ, అవన్నీ కుటుంబం చుట్టూ తిరిగేవి. కానీ, 2017లో విడాకులు తీసుకోవడంతో నా కలలన్నీ కుప్పకూలిపోయాయి. ఆ కాలం నా జీవితంలో ఒక పీడకల. ప్రతీది వ్యాపారీకరణ అయిన ఈ రోజుల్లో ఎక్కడా ప్రశాంతంగా కాసేపు కూర్చోలేకపోయాను. అప్పుడే, ఎలాంటి ఆటంకం లేకుండా గంటల తరబడి కూర్చునే కేఫ్‌ని ఎందుకు ప్రారంభించకూడదు అనుకున్నాను. ఒంటరితనంతో బాధపడేవారికి పుస్తకాలు చాలా ఊరటనిస్తాయి. వాటిని చదువుకుంటూ గంటలు గంటలు గడిపేయవచ్చు. అందుకు ఇల్లులాంటి మరో ప్లేస్ కావాలి. నాకు టీ తాగడం, పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. ఈ అనుభూతిని మిగతావారుకూడా పొందవచ్చు కదా అనుకున్నాను.

ఐదేళ్ల క్రితం..

ఈ బుక్ కేఫ్ నడపడానికి ముందు తొమ్మిదేళ్లు కార్పొరేట్ రంగంలో రోజుకు 16 గంటలు పనిచేశాను. ఆ సమయంలో 'ఉద్యోగం కోసం ఇంత సమయం ఇస్తున్నాను, ఎందుకు నా సొంత వ్యాపారం ప్రారంభించకూడద'ని అనిపించేది. ఉద్యోగానికి రిజైన్ చేసిన నెల రోజులకు పుణెలో కేఫ్ ప్రారంభించాను. ఒక మహిళగా వ్యాపారం చేయడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాను. రెగ్యులర్‌గా ఒక కిరాణా షాపులో సరుకులు కొనేదాన్ని. ఒకరోజు అతను మా కేఫ్‌కి వచ్చి, 'మీ బాస్‌ని పిలవమ'ని చెప్పాడు. 'నేనే ఓనర్' అని చెప్పడంతో అతను 'మీరు ఒక మహిళ కదా!' అని నాతో జాలి చూపుతున్నట్టు మాట్లాడాడు. చాలా బాధగా అనిపించింది. వ్యాపారం ప్రారంభించడానికి నా నగలను అమ్మేశాను, పొదుపు చేసినదంతా ఉపయోగించాను. ఇక్కడ కస్టమర్లకు తమ ఇంట్లో ఉన్న అనుభూతిని కలిగించాలని కోరుకున్నాను. దీని కోసం, నేను కేఫ్‌లో టేబుల్–కుర్చీలు, బీన్ బ్యాగ్‌లు, కుషన్‌లు ఉంచాను. టీ, కాఫీల ఏర్పాట్లు చేశాను. పుస్తకాలు సేకరించాను. నేడు కేఫ్‌లో 6 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. ఒక్కరు రూ.100తో మూడు గంటల పాటు కూర్చొని టీ తాగుతూ పుస్తకాన్ని ఆస్వాదించవచ్చు.


'కితాబీ చాయ్' కేఫ్ అండ్ బుక్ స్టోర్

ఎక్కడ నుంచైనా..

ఇక్కడ కూర్చొని పుస్తకాలు చదవవచ్చు. అద్దెకు కూడా తీసుకెళ్లొచ్చు. ఇది ఒక బుక్ స్టోర్‌గా కూడా ఉపయోగిస్తున్నాం. దేశంలో ఎవరైనా మా నుండి పుస్తకాలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయవచ్చు. అన్ని భాషల్లోనూ పుస్తకాలు లభిస్తాయి. 50 పుస్తక ప్రచురణ సంస్థలతో టై అప్‌లో ఉన్నాను. విరాళాలతో కూడా పుస్తకాలు జమ చేశాను. అయితే, ఐదేళ్లయినా జనం కితాబీ చాయ్ భావనను అర్థం చేసుకోలేదనుకుంటున్నాను. పుస్తక దుకాణం అని కొందరు, కేఫ్ అని కొందరు అనుకుంటారు.

చిన్నప్పుడు పుస్తకాలతో చేసిన దోస్తీ ఇప్పటికీ అంతకంతకు పెరిగిందే తప్ప ఏ మాత్రం తగ్గలేదు. మా రెండవ ఇల్లు లాంటిదని ఇక్కడకు వచ్చినవాళ్లు ఆత్మీయంగా చెబుతుంటే మాత్రం చాలా ఆనందం కలుగుతుంది'' అని వివరిస్తుంది గీతిక. ●



క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

ఈ సీజన్‌లో తమ నిలకడైన ప్రదర్శన కొనసాగిస్తూ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-4, 1-6, 10-5తో 'సూపర్ టైబ్రేక్'లో మార్సెలో మెలో (బ్రెజిల్)-అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) జంటను ఓడించింది. 75 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ ద్వయం ఐదు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది.

హెడ్ కోచ్ పదవికి దరఖాస్తుల ఆహ్వానం

భారత సీనియర్ మహిళల క్రికెట్ జట్టు హెడ్ కోచ్ పదవికి దరఖాస్తులు కోరుతూ బీసీసీఐ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 60 ఏళ్లలోపు వారై ఉండి... జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రికెటర్‌గానీ, 50 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అనుభవమైనా ఉన్నాకానీ లేదంటే ఎన్‌సీఏ లెవల్ 'సి' కోచింగ్ సర్టిఫికెట్, అంతర్జాతీయ టి20 జట్టుకు కనీసం ఒక్క సీజన్‌కైనా కోచింగ్ చేసి ఉండాలి. ఇందులో ఏ ఒక్క అర్హత ఉన్నా ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని బీసీసీఐ కోరింది.



హరికృష్ణకు కాంస్యం



సాక్షి, హైదరాబాద్: బుకారెస్ట్ గ్రాండ్‌ప్రి అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ పెంటేల హరికృష్ణ కాంస్య పతకం సాధించాడు. రొమేనియాలో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత 10 రౌండ్ల తర్వాత మాక్సిమ్ చిగయెవ్ (రష్యా), డేనియల్ బొగ్డాన్ (రొమేనియా), హరికృష్ణ 8.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. చిగయెవ్‌కు టాప్ ర్యాంక్ దక్కగా... బొగ్డాన్‌కు రెండో ర్యాంక్, హరికృష్ణకు మూడో ర్యాంక్ లభించాయి. హరికృష్ణ మొత్తం ఎనిమిది గేముల్లో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని, భారత్‌కే చెందిన యువ గ్రాండ్ మాస్టర్ రౌనక్‌తో జరిగిన గేమ్‌లో ఓడిపోయాడు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేశాకే బరిలోకి...

భారత స్టార్ రెజ్లర్ల స్పష్టీకరణ



న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను అరెస్టు చేసే వరకు... తాము విదేశీ టోర్నీల్లో పాల్గొనేది లేదని భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ తెలిపారు. 'రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినా ఇంకా బ్రిజ్‌భూషణ్ స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఫిర్యాదు చేసిన మహిళా రెజ్లర్ల నుంచి ఢిల్లీ పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదు. విచారణకు రావాలని ఇంకా బ్రిజ్ భూషణ్‌కు నోటీసులు కూడా జారీ చేయలేదు. కొన్నేళ్లుగా మా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చేందుకు ప్రయత్నించాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. గత జనవరిలో కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ పర్యవేక్షక కమిటీని నియమించి ఈ వివాదాన్ని ముగించాలని చూశారు. అంతే తప్ప ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఆసక్తి చూపలేదు' అని వినేశ్ వ్యాఖ్యానించింది. జూన్ 1 నుంచి 4 వరకు కిర్గిస్తాన్‌లో జరిగే ర్యాంకింగ్ సిరీస్ టోర్నీకి దూరంగా ఉన్నామని వినేశ్, బజరంగ్, సాక్షి తెలిపారు.

ఢిల్లీని గట్టెక్కించిన ఇషాంత్

- గుజరాత్‌పై 5 పరుగులతో గెలుపు
- షమీ బుల్లెట్ బౌలింగ్ వృథా
- క్యాపిటల్స్‌ను ఆదుకున్న అమన్



అహ్మదాబాద్: తక్కువ స్కోర్లేగా... తుక్కుతుక్కు కింద కొట్టేస్తామంటే కుదరదు! ఎందుకంటే ఈ సీజన్‌లో తక్కువ స్కోర్ల మ్యాచ్‌లే ఆఖర్లో ఎక్కువ ఉత్కంఠ రేపుతున్నాయి. అలాంటి రసవత్తర పోరులో ఢిల్లీని ఆఖరి ఓవర్‌తో ఇషాంత్ శర్మ (2/23)) గెలిపించాడు. దీంతో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ సొంతగడ్డపై 5 పరుగుల తేడాతో ఓడింది. ముందుగా ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. అమన్ హకీమ్ (44 బంతుల్లో 51; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించగా, రిపాల్ పటేల్ (13 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షమీ (4/11) అదరగొట్టాడు. తర్వాత గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 125 పరుగులు చేసి ఓడింది. హార్దిక్ పాండ్యా (53 బంతుల్లో 59 నాటౌట్; 7 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు.

షమీ నిప్పులు చెరగడంతో...



వెటరన్ సీమర్ షమీ నిప్పులు చెరగడంతో ఢిల్లీ బ్యాటర్లు హడలెత్తారు. ఒకదశలో 5 ఓవర్లకే 23 పరుగుల వద్ద సగం వికెట్లు కూలడంతో ఢిల్లీ 10, 12 ఓవర్లయినా ఆడుతుందా అనే సందేహం కలిగింది. అంతలా అతని పేస్ పదును క్యాపిటల్స్‌ను దెబ్బ తీసింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సాల్ట్ (0)ను డకౌట్ చేసిన షమీ తన వరుస ఓవర్లలో రోసో (8), మనీశ్ పాండే (1), ప్రియమ్ గార్గ్ (10)లను అవుట్ చేశాడు. ఈ దశలో ఢిల్లీని అమన్ హకీమ్, అక్షర్ పటేల్ (30 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. అక్షర్ అవుటయ్యాక అమన్ నిలకడగా ఆడి అర్ధసెంచరీ సాధించడంతో ఢిల్లీ వంద పైచిలుకు స్కోరు చేసింది.


షమీ

పాండ్యా ఆఖరిదాకా ఉన్నా...

అచ్చూ ఢిల్లీలాగే... టైటాన్స్ కూడా ప్రధాన బ్యాటర్లు సాహా (0), గిల్ (6), విజయ్ శంకర్ (6), మిల్లర్ (0)లను ఆరంభంలోనే కోల్పోయింది. 32/4 స్కోరుతో కష్టాల్లో ఉన్న గుజరాత్‌ను మనోహర్ (33 బంతుల్లో 26; 1 సిక్స్) అండతో కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిలబెట్టాడు. కానీ ఢిల్లీ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గుజరాత్‌కు 12 బంతుల్లో 33 పరుగుల సమీకరణం కష్టమైంది. అయితే 19వ ఓవర్లో తెవాటియా (7 బంతుల్లో 20; 3 సిక్సర్లు) హ్యాట్రిక్ సిక్సర్లు గుజరాత్‌ను విజయం వైపునకు తీసుకెళ్లాయి. 6 బంతులకు 12 పరుగులు కావాల్సి ఉండగా... ఇషాంత్ ప్రమాదకరమైన తెవాటియాను అవుట్ చేసి 6 పరుగులే ఇవ్వడంతో ఢిల్లీకి పోయిన ప్రాణం తిరిగొచ్చింది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) మిల్లర్ (బి) షమీ 0; వార్నర్ (రనౌట్) 2; ప్రియమ్ (సి) సాహా (బి) షమీ 10; రోసో (సి) సాహా (బి) షమీ 8; పాండే (సి) సాహా (బి) షమీ 1; అక్షర్ (సి) రషీద్ (బి) మోహిత్ 27; అమన్ హకీమ్ (సి) మనోహర్ (బి) రషీద్ 51; రిపాల్ (సి) పాండ్యా (బి) మోహిత్ 23; నోర్జే (నాటౌట్) 3; కుల్దీప్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 130. **వికెట్ల పతనం:** 1-0, 2-6, 3-16, 4-22, 4-23, 6-73, 7-126, 8-130. **బౌలింగ్:** షమీ 4-0-11-4, హార్దిక్ 1-0-10-0, జోష్ లిటిల్ 3-0-27-0, రషీద్ 4-0-28-1, నూర్ అహ్మద్ 4-0-20-0, మోహిత్ శర్మ 4-0-33-2.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: వృద్ధిమాన్ సాహా (సి) సాల్ట్ (బి) ఖలీల్ అహ్మద్ 0; శుబ్‌మన్ గిల్ (సి) మనీశ్ పాండే (బి) నోర్జే 6; హార్దిక్ పాండ్యా (నాటౌట్) 59; విజయ్ శంకర్ (బి) ఇషాంత్ శర్మ 6; డేవిడ్ మిల్లర్ (బి) కుల్దీప్ యాదవ్ 0; అభినవ్ మనోహర్ (సి) అమన్ (బి) ఖలీల్ అహ్మద్ 26; తెవాటియా (సి) రోసో (బి) ఇషాంత్ శర్మ 20; రషీద్ ఖాన్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 125.
వికెట్ల పతనం: 1-0, 2-18, 3-26, 4-32, 5-94, 6-122. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-1-24-2, ఇషాంత్ శర్మ 4-0-23-2, నోర్జే 4-0-39-1, కుల్దీప్ యాదవ్ 4-0-15-1, అక్షర్ పటేల్ 4-0-24-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	9	6	3	12	0.532
రాజస్తాన్	9	5	4	10	0.800
లక్నో	9	5	4	10	0.639
చెన్నై	9	5	4	10	0.329
బెంగళూరు	9	5	4	10	-0.030
పంజాబ్	9	5	4	10	-0.447
ముంబై	8	4	4	8	-0.502
కోల్‌కతా	9	3	6	6	-0.147
హైదరాబాద్	8	3	5	6	-0.577
ఢిల్లీ	9	3	6	6	-0.768

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో x చెన్నై (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
పంజాబ్ x ముంబై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

మళ్లీ 'టాప్' ర్యాంక్‌లోకి భారత్

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత జట్టు మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో టీమిండియా 121 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానం నుంచి తొలి స్థానానికి ఎగబాకింది. గత 15 నెలలుగా అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియా 122 రేటింగ్ పాయింట్ల నుంచి 116 రేటింగ్ పాయింట్లకు పడిపోయి రెండో స్థానానికి చేరుకుంది. భారత్ చివరిసారి 2021 డిసెంబర్‌లో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. భారత్, ఆస్ట్రేలియా జట్లు వచ్చే నెలలో లండన్‌లో జరిగే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో తలపడనున్నాయి. ప్రస్తుతం టెస్టు సిరీస్‌లు లేకపోయినా... 2019-2020 సీజన్‌లో నమోదైన టెస్ట్ సిరీస్ ఫలితాలను తొలగించడంతో ర్యాంకింగ్స్‌లో ఈ మార్పులు చోటు చేసుకున్నాయి. పురుషుల టి20 టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్‌వన్ ర్యాంక్‌లోనే కొనసాగుతుండగా ... పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య ప్రస్తుతం జరుగుతున్న వన్డే సిరీస్ ముగిశాక మే 10న వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌ను ప్రకటిస్తారు.

కోహ్లి, గంభీర్‌లపై భారీ జరిమానా

నవీనుల్ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత


నవీనుల్

లక్నో: కోహ్లి, గంభీర్‌ల జగడంపై బీసీసీఐ గట్టి చర్యలే తీసుకుంది. ఇద్దరి మ్యాచ్ ఫీజులపై వంద శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా విధించగా... లక్నో బౌలర్ నవీనుల్ హఖ్‌పై 50 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించింది. సోమవారం బెంగళూరు, లక్నో జట్ల మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా ఈ ఇద్దరు మాటల యుద్ధానికి దిగారు. బెంగళూరు స్టార్ బ్యాటర్ కోహ్లి, లక్నో మెంటార్ గంభీర్‌లు... సహచరులు వారిస్తున్నా, అంపైర్లు సముదాయిస్తున్నా... ముఖాముఖిగా దూసుకొచ్చి మరీ వాగ్వాదానికి దిగారు. ఇది కాస్తా తీవ్రరూపం దాల్చింది. మ్యాచ్ చూడటానికి స్టేడియానికి వచ్చిన ప్రేక్షకులు తమ ఫోన్ కెమెరాలతో ఈ తతంగాన్ని వీడియో తీసి సోషల్ నెట్‌వర్క్ సైట్లలో పెట్టారు. ఆటగాళ్ల ప్రవర్తన కూడా గీత దాటడంతో ఐపీఎల్ నియమావళిలోని ఆర్టికల్ 2.21 అతిక్రమణ కింద చర్యలు తీసుకున్నారు. సాధారణంగా 25, 50, 75 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించడం ఆనవాయితీ కాగా... వారి వివాదం పెను దుమారం రేపడంతో మొత్తం మ్యాచ్ ఫీజు (వంద శాతం)ను జరిమానాగా విధించారు. నిజానికి టీమిండియా విజయాల్లో కీలకపాత్ర పోషించిన గంభీర్, కోహ్లి మధ్య ఉన్న సాహచర్యాన్ని 2013 ఐపీఎల్ సీజన్ దెబ్బ తీసింది. అప్పుడు కోల్‌కతా కెప్టెన్ గంభీర్, బెంగళూరు కెప్టెన్ కోహ్లి నువ్వెంతంటే నువ్వెంతని మాటల యుద్ధానికి దిగారు. పదేళ్లనాటి ఈ వైరం పెరిగిందే తప్ప ఇప్పటికీ తగ్గలేదు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆశిష్



తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండో రోజు భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఆశిష్ చౌధరీ (80 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా... హర్ష్ చౌధరీ (86 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ బౌట్‌లలో ఆశిష్ 4-1తో మేసమ్ గెష్లాగి (ఇరాన్)పై గెలుపొందగా... హర్ష్ 0-5తో బిల్లీ మెక్‌అలిస్టర్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయాడు. నేడు జరిగే బౌట్‌లో నిశాంత్ దేవ్ (71 కేజీలు) తొలి రౌండ్‌లో సర్ఖాన్ (అజర్‌బైజాన్)తో తలపడతాడు. ఈ మెగా టోర్నీలో 107 దేశాల నుంచి 538 మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

సినిమా

ఈ నెలలోనే ఛత్రపతి


● బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ శ్రీనివాస్ బాలీవుడ్‌లో హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'ఛత్రపతి'. విజయేంద్ర ప్రసాద్ కథ అందించిన ఈ సినిమాకి వీవీ వినాయక్ దర్శకత్వం వహించారు. నుష్రత్ బరుచ్చా హీరోయిన్‌గా నటించారు. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన బ్లాక్‌బస్టర్ మూవీ 'ఛత్రపతి' (2005)ని అదే పేరుతో హిందీలో రీమేక్ చేశారు. డాక్టర్ జయంతి లాల్ గడా సమర్పణలో పెన్ స్టూడియోస్‌పై ధవల్ జయంతిలాల్ గడా, అక్షయ్ జయంతిలాల్ గడా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు మేకర్స్. ''తెలుగు 'ఛత్రపతి' సినిమా బ్యాక్‌డ్రాప్‌ని మార్చి, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా హిందీ 'ఛత్రపతి'ని తెరకెక్కించారు వినాయక్. శ్రీనివాస్ రగ్డ్ అండ్ మాస్ లుక్‌లో కనిపిస్తాడు. భావోద్వేగ సన్నివేశాల్లోనూ అద్భుతంగా నటించాడు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ అలీ షఫీ, సంగీతం: తనిష్క్ బాగ్చి, వరల్డ్ వైడ్ విడుదల: పెన్ మరుధర్ సినీ ఎంటర్‌టైన్‌మెంట్.

నా కొత్త నేస్తాన్ని స్వాగతించండి - సల్మాన్ ఖాన్



● గ్రూట్

ప్రస్తుతం తన కొత్త ఫ్రెండ్ 'గ్రూట్' అంటున్నారు సల్మాన్ ఖాన్. గ్రూట్ ఎవరో హాలీవుడ్ ఫ్రాంచైజీ 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ' చిత్రాలు చూసినవారికి తెలిసిందే. ఈ చిత్రాల్లోని కీలక పాత్ర గ్రూట్. ఈ నెల 5న 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ వాల్యూమ్ 3' విడుదల కానుంది. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సల్మాన్ ఖాన్ 'గ్రూట్'కి సంబంధించిన సీన్‌ని ఫోన్‌లో చూస్తుండటం, ఆ తర్వాత విలేకరుల సమావేశంలో పాల్గొని, ఏ ప్రశ్న అడిగినా 'నేను సల్మాన్' అని చెప్పే వీడియోను రిలీజ్ చేసింది యూనిట్. సోషల్ మీడియాలో ఈ వీడియోను షేర్ చేసి, నా కొత్త ఫ్రెండ్ గ్రూట్‌ని స్వాగతించండి అన్నారు సల్మాన్. ఇక దేశ వ్యాప్తంగా ఇంగ్లిష్., హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ శుక్రవారం 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ వాల్యూమ్ 3' రిలీజ్ కానుంది.

యమ భటులం...


● 'వెన్నెల' కిశోర్, శ్రీనివాస్ రెడ్డి

సునీల్, శ్రీనివాస్ రెడ్డి, 'వెన్నెల' కిశోర్, ధనరాజ్ ప్రధాన పాత్రల్లో నూతన దర్శకుడు యలమంద చరణ్ తెరకెక్కించిన చిత్రం 'భువన విజయమ్'. కిరణ్, వీఎస్కే నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ని విడుదల చేశారు. 'నువ్వు చనిపోతే తీసుకెళ్లడానికి వచ్చిన యమ భటులం.. అట్లాంటప్పుడు మనం నరకానికి పోవాలి కానీ ఈ సినిమా ఆఫీసుకు వచ్చుడేంది సర్' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''ఫన్, ఎమోషన్, సస్పెన్స్, థ్రిల్.. ఇలా అన్నీ ఉన్న చిత్రం ఇది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: సాయి.



"కుటుంబం అంతా కలసి థియేటర్‌కి వెళ్లి చూడడానికి ఒక మంచి చిత్రం కావాలి. అందరూ కూర్చుని హ్యాపీగా చూసే సినిమా అవసరం. అలాంటి మూవీ రావడం లేదనే లోటుని 'రామబాణం' భర్తీ చేస్తుంది" అన్నారు డైరెక్టర్ శ్రీవాస్. గోపీచంద్, డింపుల్ హయతి జంటగా తెరకెక్కిన చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు శ్రీవాస్ మీడియాతో పంచుకున్న విశేషాలు.

ఆ లోటుని రామబాణం భర్తీ చేస్తుంది - డైరెక్టర్ శ్రీవాస్

● 'లక్ష్యం, లౌక్యం' తర్వాత గోపీచంద్‌గారు, నేను మళ్లీ ఓ మూవీ అనుకున్నప్పుడు ఒక మంచి యాక్షన్ సినిమా చేద్దామనుకున్నాను. అయితే మా కాంబినేషన్‌లో వచ్చిన 'లక్ష్యం, లౌక్యం' సినిమాలను ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్, క్లాస్.. ఇలా అందరూ ఇష్టపడ్డారు. దీంతో మా నుంచి ప్రేక్షకులు మళ్లీ అలాంటి సినిమా కోరుకుంటారని భావించి, అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో యాక్షన్, ఎమోషన్స్ ఉన్న 'రామబాణం' చేశాం.

● 'లక్ష్యం' తర్వాత గోపీచంద్, జగపతిబాబుగారు మళ్లీ కలసి చేస్తున్నారు కాబట్టి 'లక్ష్యం 2' అని వర్కింగ్ టైటిల్ అనుకున్నాం. అయితే ఆ సినిమా కథకు ఇది సీక్వెల్ అనుకునే అవకాశం ఉంది కాబట్టి 'రామబాణం' టైటిల్ ఫిక్స్ చేశాం.

కరోనా తర్వాత జనాలు చాలావరకు ఆర్గానిక్ ఫుడ్‌పై ఆసక్తి చూపుతున్నారు. అందుకే ఈ కథలో కూడా ఆర్గానిక్ ఫుడ్ గురించి అవసరం మేరకు చెప్పాం. ● ఫ్యామిలీ ఎమోషన్స్ తీయడం తేలిక కాదు.. మన జీవితం నుంచి పాత్రలు రావాలి. నేనిలాంటి తరహా సినిమాలు చేయడానికి నేను వచ్చిన నేపథ్యం కారణం కావచ్చు. పైగా ఇలాంటి చిత్రాలతోనే నాకు ప్రేక్షకాదరణ లభించింది. కానీ అన్ని రకాల చిత్రాలు చేయడానికి రెడీగా ఉన్నాను.

● దాసరిగారిలా సొంత కథ రాసుకొని డైరెక్ట్ చేయగలను. అలాగే రాఘవేంద్రరావుగారిలా ఎవరైనా మంచి పాయింట్ చెబితే స్క్రిప్ట్‌గా మలచుకోగలను. అయితే రెడీమేడ్‌గా ఉన్న మంచి కథలని ఎంచుకొని దర్శకత్వంపై ఎక్కువ దృష్టి పెట్టాలనేది నా వ్యక్తిగత అభిప్రాయం. మనం చేసే సినిమా పాన్ ఇండియాకి వెళ్లాలి కానీ.. పాన్ ఇండియా సినిమా చేయాలనుకుని చేస్తే కుదరదనుకుంటున్నాను.

ఆత్మ కథ

ప్రతి సినిమా కథకీ ఒక సోల్ ఉంటుంది. ఆ ఆత్మ ఎంత బలంగా ఉంటే సినిమా అంతగా ప్రేక్షకులకు దగ్గరవుతుంది. ఒకవేళ సినిమా కథే 'ఆత్మ' చుట్టూ తిరిగితే.. ఆ ఆత్మ భయపెడుతుంది... థ్రిల్‌కి గురి చేస్తుంది. ఆత్మ చుట్టూ అల్లిన కథ బలంగా ఉంటే.. బాక్సాఫీస్ ఖజానాని వసూళ్లు ఆవహించినట్లే. ఇక ప్రస్తుతం ఆత్మ, ప్రేతాత్మల నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న 'ఆత్మ'కథా చిత్రాల గురించి తెలుసుకుందాం.


● 'అన్వేషి'లో...

● రాశీ ఖన్నాకి హారర్ జానర్ అంటే ఇష్టం. అందుకే హారర్ జానర్‌లో సాగే 'అరణ్‌మణై 3'కి చాన్స్ వచ్చినప్పుడు హ్యాపీగా ఓకే చెప్పేశారు. ఇప్పుడు నాలుగో భాగంలోనూ నటిస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సుందర్. సి కీలక పాత్ర పోషించి, దర్శకత్వం వహించిన 'అరణ్‌మణై', 'అరణ్‌మణై 2', 'అరణ్‌మణై 3' ఘనవిజయం సాధించాయి. ఇప్పుడు నాలుగో భాగం నిర్మాణంలో ఉంది. ఈ చిత్రంలో ఆర్య హీరో. గత మూడు భాగాల్లో నటించిన చిత్రదర్శకుడు సుందర్ ఇందులోనూ కీలక పాత్రలో కనిపిస్తారు. రాశీ ఖన్నా ఒక కథానాయిక కాగా మరో నాయికగా తమన్నా నటిస్తున్నారు. మూడో భాగంలో ఆండ్రియా ఆత్మగా కనిపించారు. నాలుగో భాగంలో తమన్నానే ఆత్మ అని సమాచారం. మరి.. తమన్నా, రాశీల్లో ఆత్మ ఎవరనేది ఈ ఏడాది చివర్లో తెలిసిపోతుంది. డిసెంబర్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.

● క్యూట్ బ్యూటీ సమంత ప్రేతాత్మగా భయపెట్టనున్నారని సమాచారం. అది కూడా హిందీ ప్రేక్షకులను. ఆయుష్మాన్ ఖురానా, సమంత జంటగా అమర్ కౌశిక్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుందనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. హారర్-కామెడీ జానర్‌లో సాగే ఈ చిత్రంలో సమంత రెండు పాత్రల్లో కనిపిస్తారని, అందులో ఒకటి ప్రేతాత్మ పాత్ర అని టాక్. 'వాంపైర్స్ ఆఫ్ విజయ్ నగర్' టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ ఈ ఏడాది చివర్లో ఆరంభమవుతుందని బాలీవుడ్ ఖబర్.


● 'ఊరు పేరు భైరవకోన'లో సందీప్ కిషన్

● 'ఎవరికీ అంతు చిక్కని రహస్య ప్రపంచం భైరవకోనలోకి ప్రవేశించండి' అంటూ సందీప్ కిషన్ హీరోగా రూపొందుతున్న 'ఊరు పేరు భైరవకోన' ఫస్ట్ లుక్ విడుదలైన విషయం తెలిసిందే. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ మిస్టరీ మూవీలో ఆత్మల నేపథ్యం కూడా ఉంటుందని సమాచారం. వీఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కావ్యా థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.

● ఓ యువకుడు డిటెక్టివ్ కావాలనుకుంటాడు. ప్రేమలో పడిన అతడు తన ప్రేయసితో ఆనందంగా ఉంటాడు. అతని హ్యాపీ లైఫ్ ఒక టర్న్ తీసుకుంటుంది. రాత్రి సమయంలో రాకపోకలు నిషేధం అయిన మారేడు కోన ప్రాంతానికి అతను వెళ్లాల్సి ఉంటుంది. ఆ ఊరికి ఆ యువకుడు ఎందుకు వెళ్లాడు? ఆ తర్వాత ఏం జరిగిందనే అంశంతో రూపొందుతున్న చిత్రం 'అన్వేషి'. విజయ్ ధరణ్ దాట్ల, సిమ్రాన్ గుప్తా, అనన్య నాగళ్ల హీరో హీరోయిన్లుగా వీజే ఖన్నా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రకథ ఆత్మలు ఉన్నాయా? అనే కోణంలో సాగుతుంది.

ఈ చిత్రాలే కాదు.. మరికొన్ని 'ఆత్మ'కథలు కూడా ఉన్నాయి. హారర్ జానర్‌కి ట్రెండ్‌తో పని లేదు. ఎప్పుడు తీసినా.. సరిగ్గా తీస్తే ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి.. మరి.. రానున్న 'ఆత్మ'కథల్లో ఎన్ని కథలు ప్రేక్షకులకు నచ్చుతాయో చూడాలి.


● తమన్నా ● రాశీ ఖన్నా ● సమంత



దివంగత దర్శకులు దాసరి నారాయణరావు జయంతి (మే 4) సందర్భంగా దాసరి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, వాసవి ఫిల్మ్ అవార్డ్స్ వ్యవస్థాపకులు కొత్త వెంకటేశ్వరరావు, మడిపడిగె రాజు, ముఖ్య సలహాదారులు బండారు సుబ్బారావు, పబ్బతి వెంకట రవికుమార్ సారథ్యంలో జరిగిన ఈ వేడుకలో ఆంధ్ర, తెలంగాణలో పలు రంగాల్లో కృషి చేస్తున్న ప్రతిభావంతులకు పురస్కారాలు అందించారు. దర్శకుడు కృష్ణవంశీ, నటులు శ్రీకాంత్, బ్రహ్మానందం, 'బలగం' నిర్మాత హర్షిత్ రెడ్డి, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు, ధీరజ అప్పాజీతో పాటు పలువురు పురస్కారాలు అందుకున్నారు. 'ప్రతి ఏడాది ఉత్తమ హీరోకి నా వంతుగా యాభై వేలు పారితోషికం ఇస్తాను' అని నటుడు అలీ అన్నారు.

క్రైమ్.. థ్రిల్...


● కార్తీక్ రాజు

కార్తీక్ రాజు హీరోగా, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'అథర్వ'. మహేశ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించిన ఈ సినిమాని జూన్‌లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''డిఫరెంట్ కాన్సెప్ట్‌తో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'అథర్వ'. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో జూన్‌లో మా సినిమాని రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: చరణ్ మాధవనేని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: విజయ, ఝాన్సీ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	242	61,355
నిఫ్టీ ▲	83	18,148

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,090	▽ 122
డోజోన్స్	33,624	▽ 427
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,773	▽ 78
డాక్స్	15,727	▽ 195
షాంఘై	3,323	▲ 37
నికాయ్	29,158	▲ 35

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (99.9 గ్రాముల)	60,417
బంగారం (99.5 గ్రాముల)	60,176
వెండి (కిలో)	74,226

టాటా స్టీల్ లాభం డౌన్

- క్యూ4లో రూ. 1,566 కోట్లు
- షేరుకి రూ. 3.6 డివిడెండ్

న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం టాటా స్టీల్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 84 శాతం క్షీణించి రూ. 1,566 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 9,835 కోట్లు ఆర్జించింది. ఇతర ఆదాయం తగ్గడం లాభాలను దెబ్బతీసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 69,616 కోట్ల నుంచి రూ. 63,131 కోట్లకు నీరసించింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు రూ. 57,636 కోట్ల నుంచి రూ. 59,918 కోట్లకు పెరిగాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 3.60 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.



యూరప్ విభాగం

యూకే, నెదర్లాండ్ యూరప్‌లలో రష్యా– ఉక్రెయిన్ యుద్ధం కారణంగా తలెత్తిన సప్లైచైన్ అవాంతరాలకు తోడు.. అధిక వడ్డీ రేట్లు, స్టీల్ మార్జిన్లపై ఒత్తిడి తదితర అంశాల ప్రభావాన్ని సొంత అనుబంధ పరోక్ష సంస్థ టాటా స్టీల్ యూరప్ (టీఎస్ఈ) అంచనా వేసినట్లు టాటా స్టీల్ వివరించింది. వెరసి కంపెనీ బోర్డు వీటిని తట్టుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేసింది. ప్రస్తుతం కంపెనీ నికర రుణ భారం రూ. 67,810 కోట్లుగా నమోదైనట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో టాటా స్టీల్ షేరు 2.3 శాతం బలపడి రూ. 110 వద్ద ముగిసింది.

గో ఫస్ట్ దివాలా

- ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్
- నేటి నుంచి 3 రోజులు సర్వీసులు రద్దు
- ప్రయాణికులకు పూర్తి రిఫండ్

న్యూఢిల్లీ: దేశీయంగా మరో విమానయాన సంస్థ సంక్షోభంలో చిక్కుకుంది. ఇంజిన్ల లోపాల వల్ల సగం పైగా విమానాలను పక్కన పెట్టాల్సి రావడంతో ఆర్థికంగా కుదేలైన విమానయాన సంస్థ గో ఎయిర్‌లైన్స్ తాజాగా దివాలా ప్రకటించింది. స్వచ్ఛందంగా దివాలా పరిష్కార ప్రక్రియ చేపట్టాలని కోరుతూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో మంగళవారం పిటిషన్ దాఖలు చేసింది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు అన్ని ఫ్లయిట్ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే బుక్ చేసుకున్న వారికి పూర్తి రిఫండ్ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. 'నిర్వహణపరమైన కారణాలతో మే 3 నుంచి 5 వరకు ఫ్లయిట్లను రద్దు చేయాల్సి వస్తోంది. ప్రయాణికులకు దీని వల్ల కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నాం. వారికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తాం' అని గో ఎయిర్‌లైన్స్ పేర్కొంది. సర్వీసులను రెండు రోజులే రద్దు చేయనున్నట్లు కంపెనీ సీఈవో కౌశిక్ ఖోనా ముందుగా ప్రకటించినప్పటికీ తర్వాత మరో రోజు పెంచుతున్నట్లు సంస్థ వెల్లడించింది. 'గో ఫస్ట్' బ్రాండ్ పేరిట గో ఎయిర్‌లైన్స్ రోజూ 180–185 విమాన సర్వీసులు నిర్వహిస్తోంది. మరోవైపు, ఇంజిన్ల సరఫరాకు సంబంధించి నిర్వహణపరమైన సవాళ్ల కారణంగా గో ఫస్ట్ ఆర్థిక పరిస్థితులు దెబ్బతినడం దురదృష్టకరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వ్యాఖ్యానించారు. గో ఫస్ట్ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, సంస్థకు అన్ని విధాలుగా అవసరమైన తోడ్పాటును అందిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.



ఇంజిన్లతో ఇక్కట్లు..

ప్రాట్ అండ్ విట్నీ సంస్థ సరఫరా చేసిన ఇంజిన్లు వరుసగా విఫలమవుతుండటం వల్ల దాదాపు సగం విమానాలు నడవడం లేదని ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేసిన పిటిషన్‌లో గో ఎయిర్‌లైన్స్ తెలిపింది. ఇంజిన్ల మరమ్మతు, లేదా తగినన్ని స్పేర్ ఇంజిన్లను సమకూర్చడంలోనూ ప్రాట్ అండ్ విట్నీ విఫలమైందని పేర్కొంది. 2020 జనవరి నుండి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు సాగకపోతుండటం వల్ల రూ. 10,800 కోట్ల మేర ఆదాయాలను నష్టపోయినట్లు పేర్కొంది. 17 ఏళ్ల క్రితం ఎయిర్‌లైన్‌ను ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా రూ. 6,500 కోట్లు ఇన్వెస్ట్ చేయగా.. గత రెండేళ్లలోనే రూ. 2,400 కోట్లు పైగా వెచ్చించినట్లు వివరించింది. ఇక ఆర్థికపరమైన చెల్లింపులు జరిపే పరిస్థితి లేకపోవడంతో తప్పనిసరై ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించినట్లు గో ఎయిర్‌లైన్స్ పేర్కొంది.

యూకో బ్యాంక్ లాభం హైజంప్

ముంబై: యూకో బ్యాంక్ గతేడాది చివరి త్రైమాసికం (2022–23, క్యూ4) లో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. క్యూ4లో నికర లాభం 86% జంప్‌చేసి రూ. 581 కోట్లను అధిగమించింది. మొండి రుణాలు తగ్గడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 312 కోట్లు ఆర్జించింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ చరిత్రలోనే అత్యధిక లాభం సాధించింది. రూ. 1,862 కోట్లు ఆర్జించింది. 2021–22లో రూ. 930 కోట్ల లాభం మాత్రమే నమోదైంది. ఇది 100 శాతంపైగా వృద్ధికాగా.. గతేడాది కొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 7,343 కోట్ల నికర వడ్డీ ఆదాయం పొందింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-5-2023	
విశాఖ	463–00
చిత్తూరు	463–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435–00
విజయవాడ	435–00
రిటైల్ ధర (డజను)	66.00
2-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

3 నెలల గరిష్టానికి మార్కెట్

ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాలు

- మెరుగైన కార్పొరేట్ క్యూ4 ఫలితాల ప్రభావం
- సెన్సెక్స్ ఎనిమిదోరోజూ, నిఫ్టీకు అయిదో రోజూ ర్యాలీ

ముంబై: స్టాక్ మార్కెట్లో లాభాల పరంపర కొనసాగుతోంది. ప్రోత్సాహకర కార్పొరేట్ క్యూ4 ఆదాయాలు, మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు దన్నుతో సూచీలు మూడు నెలల గరిష్ఠం వద్ద ముగిశాయి. అధిక వెయిటేజీ షేర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ షేర్లు రాణించడంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగడం కలిసొచ్చాయి. ఒకరోజు సెలవు తర్వాత ప్రారంభమైన సూచీలు లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 190 పాయింట్లు పెరిగి 61,302 వద్ద, నిఫ్టీ 60 పాయింట్లు బలపడి 18,125 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో, ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఒక దశలో సెన్సెక్స్ 374 పాయింట్లు ర్యాలీ చేసి 61,486 వద్ద, నిఫ్టీ 115 పాయింట్లు దూసుకెళ్లి 18,180 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. అయితే యూరప్ మార్కెట్ల బలహీన ట్రేడింగ్ ప్రభావంతో చివర్లో కొంత లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఆఖరికి సెన్సెక్స్ 242 పాయింట్ల లాభంతో 61,355 వద్ద స్థిరపడింది. ఈ సూచీకిది వరుసగా ఎనిమిదోరోజూ లాభాల ముగింపు. నిఫ్టీ 83 పాయింట్లు పెరిగి 18,148 వద్ద ముగిసింది. కాగా ఈ ఇండెక్స్‌కిది అయిదోరోజూ లాభం ముగింపు కావడం విశేషం. వరుస ర్యాలీ క్రమంలో సూచీలు మూడు నెలల గరిష్టానికి చేరుకున్నాయి. ఎఫ్ఎంసీజీ, టెలికమ్యూనికేషన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విస్తృత స్థాయి మార్కెట్లో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1997 కోట్ల షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.394 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ ఐదుపైసలు బలహీనపడి 81.87 వద్ద స్థిరపడింది. ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశ ప్రారంభానికి ముందు(మంగళవారం రాత్రి) ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ ప్లాట్‌ఫామ్ న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ షేరు 16 శాతం పెరిగి రూ.566 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 18 శాతం ఎగిసి రూ.595 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. మార్చి క్వార్టర్‌లో కంపెనీ నికర లాభం 63% వృద్ధితో రూ.79 కోట్లను సాధించడం ఈ షేరుకు డిమాండ్ పెరిగింది.
- ఏప్రిల్‌లో ఎన్ఎండీసీ ఉత్పత్తి, అమ్మకాలు రెండంకెల వృద్ధిని సాధించడంతో ఈ ప్రభుత్వ రంగ కంపెనీ షేరు రాణించింది. బీఎస్ఈలో ఒకటిన్నర శాతం బలపడి రూ.110 వద్ద స్థిరపడింది.
- కేంద్రం ముడి చమురు ఉత్పత్తిపై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను భారీగా తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఓఎన్‌జీసీ షేరు మూడున్నర శాతం లాభపడి రూ.164 వద్ద ముగిసింది.

''ప్రోత్సాహకర కార్పొరేట్ క్యూ4 ఆదాయాలు, మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు దన్నుతో దేశీయ స్టాక్ సూచీలు లాభాలు గడించాయి. ప్రస్తుతం సాంకేతికంగా నిఫ్టీకి ఎగువ స్థాయిలో 18180 – 18200 శ్రేణిలో కీలక నిరోధం కలిగి ఉంది. దిగువ స్థాయిలో 18050 – 18000 పరిధిలో తక్షణ మద్దతు కలిగి ఉందని'' జియోజిత్ ఫైనాన్స్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

తెలంగాణలో ఫ్లిప్‌కార్ట్ మరో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్

- సంగారెడ్డిలో ఏర్పాటు; రాష్ట్రంలో ఆరోది
- ప్రారంభించిన ఐటీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తాజాగా తెలంగాణలో మరో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. సంగారెడ్డిలో నెలకొల్పిన ఈ కేంద్రాన్ని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు (కేటీఆర్) మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. సీజనల్, తాత్కాలిక ఉద్యోగులు, వెండార్లు మొదలైన వారి జీవనోపాధికి కూడా భద్రత కల్పించడంపై ఈ–కామర్స్ కంపెనీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ సూచించారు. అలాగే ఉద్యోగ నైపుణ్యాలు గల మానవ వనరులను పెంపొందించుకునేందుకు ప్రభుత్వాలతో కూడా కలిసి పనిచేసే అంశాన్నీ కంపెనీలు పరిశీలించాలని పేర్కొన్నారు. మహిళా సాధికారత సాధించే దిశగా పూర్తిగా వారి సారథ్యంలోనే నడిచే ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయడంపైనా దృష్టి పెట్టాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఐటీ) జయేశ్ రంజన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా 100కు పైగా సెంటర్లు..

ఉత్పత్తుల డెలివరీలను మరింత వేగవంతం చేసే దిశగా దేశవ్యాప్తంగా తమకు 100కు పైగా ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు ఉన్నట్లు ఫ్లిప్‌కార్ట్ సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తి చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసినది తెలంగాణలో తమకు అతి పెద్దదని తెలిపారు. దీనితో కలిపి రాష్ట్రంలో తమకు మొత్తం ఆరు ఫుల్‌ఫిల్‌మెంట్, సార్టింగ్ సెంటర్లు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. దాదాపు 4 లక్షల చ.అ. విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు, దీనితో 4 వేల పైచిలుకు ఉద్యోగాలకు ఊతం లభించగలదని కల్యాణ్ కృష్ణమూర్తి చెప్పారు. తెలంగాణ నుంచి తమ ప్లాట్‌ఫాంలో 14,000 పైగా విక్రేతలు ఉన్నట్లు, 40,000 పైచిలుకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు. సంగారెడ్డి ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌తో స్థానికంగా డెలివరీలను మరింత వేగవంతం చేసేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.



ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఫ్లిప్‌కార్ట్ సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తి, జయేష్ రంజన్

భవిత

జాబ్ పాయింట్

ఎస్‌బీఐలో 217 ఎస్‌ఓ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) దేశంలోని పలు ప్రాంతాల్లోని స్పెషల్ కేడర్ ఆఫీసర్(ఎస్ఓ) పోస్టుల భర్తీకి రెగ్యులర్, కాంట్రాక్టు ప్రాతిపదికన నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 217
» **పోస్టుల వివరాలు:** మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, స్పెషల్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో..బీటెక్/బీఈ, ఎంసీఏ, ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 29.04.2023 నుంచి 19.05.2023
» **ఆన్‌లైన్ పరీక్ష:** జూన్ 2023
» **వెబ్‌సైట్:** www.sbi.co.in/web/careers

సీఆర్‌పీఎఫ్‌లో 212 ఎస్సై, ఏఎస్సై పోస్టులు

డైరెక్టరేట్ జనరల్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్).. గ్రూప్ బి, సి(నాన్ మినిస్టీరియల్, నాన్ గెజిటెడ్, కంబాటైజ్డ్ సిగ్నల్ స్టాఫ్) కేటగిరీలో ఎస్సై, ఏఎస్సై పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 212
» పోస్టుల వివరాలు: సబ్–ఇన్‌స్పెక్టర్(ఆర్‌వో)–19, సబ్ ఇన్‌స్పెక్టర్(క్రిప్టో)–07, సబ్–ఇన్‌స్పెక్టర్(టెక్నికల్)–05, సబ్–ఇన్‌స్పెక్టర్(సివిల్)(మేల్)–20, అసిస్టెంట్ సబ్–ఇన్‌స్పెక్టర్(టెక్నికల్)–146, అసిస్టెంట్ సబ్–ఇన్‌స్పెక్టర్(డ్రాఫ్ట్స్‌మ్యాన్)–15.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ/బీటెక్, డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక, వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 21.05.2023 నాటికి ఎస్సై పోస్టులకు 30 ఏళ్లలోపు, ఏఎస్సై పోస్టులకు 18 నుంచి 25 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు ఎస్సై పోస్టులు రూ.35,400 నుంచి రూ.1,12,400, ఏఎస్సై పోస్టులకు రూ. 29,200 నుంచి రూ.92,300 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్/ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.05.2023
» **వెబ్‌సైట్:** https://rect.crpf.gov.in

సీఈసీ.. కార్పొరేట్ కొలువుకు కేరాఫ్!



ఆఫ్టర్ ఇంటర్

» సీఈసీ ఉత్తీర్ణులకు పలు ప్రొఫెషనల్ కోర్సులు
» ముందువరుసలో నిలుస్తున్న సీఏ, సీఎస్, సీఎంఏ
» బీకాంలోనూ ఆధునిక సబ్జెక్ట్ కాంబినేషన్లు
» భవిష్యత్తులో ఎంబీఏ, బిజినెస్ స్టడీస్ కోర్సులు

సీఈసీ.. కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులు ఉండే గ్రూప్! సీఈసీ ఉత్తీర్ణులు తమకు బీకాం ఒక్కటే మార్గంగా ఉందని ఆందోళన చెందుతుంటారు. కేవలం బీకాంతోనే జాబ్ మార్కెట్‌లో పోటీ పడగలమా? అని సందేహిస్తుంటారు. వాస్తవానికి సీఈసీ విద్యార్థులకు బీకాంతోపాటు కార్పొరేట్ రంగంలో.. ఉజ్వల కెరీర్స్‌ను అందించే కోర్సులు అనేకం ఉన్నాయి!! వీటిని పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ సంస్థలు.. రెడ్ కార్పెట్ స్వాగతం పలకడం ఖాయం!! ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిశాయి. ఈ నేపథ్యంలో.. సీఈసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రొఫెషనల్ కోర్సులు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

సీఈసీ పూర్తి చేసిన విద్యార్థులు బీకామ్‌తోపాటు ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరే అవకాశముంది. ముఖ్యంగా సీఏ, సీఎంఏ, సీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు జాబ్ మార్కెట్‌లో ఎంతో డిమాండ్ నెలకొంది. సీఈసీ విద్యార్థులు ఒకవైపు బీకామ్ చదువుతూనే.. మరోవైపు సంబంధిత ప్రొఫెషనల్ కోర్సుల్లోనూ ఉత్తీర్ణత సాధించొచ్చు. ఆయా ప్రొఫెషనల్ అర్హతలతో కార్పొరేట్ కొలువులు సొంతం చేసుకోవచ్చు.

మూడు దశల్లో సీఏ కోర్సు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) నిర్వహించే కోర్సు.. చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ). ఎన్నో ఏళ్లుగా ఈ కోర్సుకు కార్పొరేట్ ప్రపంచంలో మంచి ఆదరణ ఉంది. మొత్తం మూడు దశలు(ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్)గా ఉండే ఈ కోర్సును సీఈసీ, ఎంఈసీ విద్యార్థులు సులభంగా పూర్తి చేసుకోవచ్చు.

సీఏ ఫౌండేషన్:

- మొత్తం మూడు దశల సీఏ కోర్సులో తొలి దశ.. ఫౌండేషన్ కోర్సు. ఇంటర్మీడియెట్ అర్హతతో సీఏ ఫౌండేషన్‌లో అడుగు పెట్టొచ్చు. ఫౌండేషన్ దశకు నమోదు చేసుకున్న నాలుగు నెలల తర్వాత.. ఫౌండేషన్ పరీక్షలు రాసి తదుపరి దశ ఇంటర్మీడియెట్‌కు అర్హత పొందొచ్చు.
- ఫౌండేషన్ పరీక్షను మొత్తం నాలుగు పేపర్లు, ఒక్కో పేపర్‌కు 100 మార్కులు చొప్పున నిర్వహిస్తారు. ప్రతి ఏటా మే, నవంబర్ నెలల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. నవంబర్‌లో పరీక్ష రాయదలచుకున్న వారు జూన్ 30లోపు, మే నెలలో పరీక్షలు రాయాలనుకునే వారు అంతకు ముందు సంవత్సరం డిసెంబర్ 31లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

సీఏ ఇంటర్మీడియెట్:

- సీఏ ఇంటర్మీడియెట్ రెండు గ్రూప్‌లుగా ఉంటుంది. ఒక్కో గ్రూప్‌లో నాలుగు పేపర్లు చొప్పున మొత్తం ఎనిమిది పేపర్లు ఉంటాయి. ఈ పరీక్షలు ప్రతి ఏటా రెండుసార్లు (మే, నవంబర్) నిర్వహిస్తారు. ఇందులోనూ మొత్తం ఎనిమిది పేపర్లకు 800 మార్కులకు పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు ఒక్కో పేపర్‌లో 40 శాతం మార్కులతో, అన్ని పేపర్లలో కలిపి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే.. సీఏ కోర్సులోని తుది దశ సీఏ–ఫైనల్‌కు అర్హత లభిస్తుంది.

సీఏ ఫైనల్:

- సీఏ ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణత సాధించడంతో పాటు రెండున్నరేళ్ల ప్రాక్టికల్ ట్రెనింగ్ పూర్తి చేసిన వారు సీఏ ఫైనల్ పరీక్షలకు నమోదు చేసుకోవచ్చు.
- సీఏ ఫైనల్‌లోనూ రెండు గ్రూప్‌లు (గ్రూప్–1, గ్రూప్–2)గా ఒక్కో గ్రూప్‌లో నాలుగు పేపర్లతో పరీక్ష నిర్వహిస్తారు. గ్రూప్–2లో పేపర్–6ను ఎలక్టివ్ పేపర్‌గా నిర్ణయించారు. విద్యార్థులు నిర్దేశించిన ఆరు సబ్జెక్ట్‌ల నుంచి ఏదైనా ఒక సబ్జెక్ట్‌ను ఎలక్టివ్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. అలా ఎలక్టివ్‌గా ఎంచుకున్న సబ్జెక్ట్‌లోనే పరీక్ష నిర్వహిస్తారు.
- ఇలా మొత్తం 800 మార్కులకు ఎనిమిది పేపర్లలో నిర్వహించే ఈ పరీక్షలో ప్రతి పేపర్‌లో 40 శాతం మార్కులు, అన్ని పేపర్లలో కలిపి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సీఏ కోర్సు పూర్తయినట్లే. ఈ పరీక్షలు ప్రతి ఏటా రెండుసార్లు మే/నవంబర్ నెలల్లో నిర్వహిస్తారు.

కెరీర్ అవకాశాలు

సీఏ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ఫైనాన్స్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్, ప్లాంట్ అకౌంటెంట్స్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, ఫైనాన్స్ కంట్రోలర్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. పనితీరు, అనుభవం, ప్రతిభ ఆధారంగా కంపెనీలకు మేనేజింగ్ డైరెక్టర్లు, సీఎఫ్ఓ వంటి ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు.

సీఎంఏ కోర్సు

సీఈసీ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న మరో ముఖ్యమైన కోర్సు.. కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ(సీఎంఏ). దీనినే గతంలో కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెన్సీ కోర్సుగా పిలిచే వారు. ఇంటర్ సీఈసీతో సీఎంఏలో చేరిన విద్యార్థులు ఇంటర్ తర్వాత రెండేళ్ల మూడు నెలల వ్యవధిలో; ఇంటర్ తర్వాత సీఎంఏలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు రెండేళ్ల తొమ్మిది నెలల వ్యవధిలో సీఎంఏ కోర్సును పూర్తి చేసుకుని చక్కటి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

మూడు దశలుగా సీఎంఏ కోర్సు

సీఎంఏ కోర్సు కూడా మూడు దశల్లో(ఫౌండేషన్, ఇంటర్మీడియెట్, ఫైనల్) ఉంటుంది.

ఫౌండేషన్ కోర్సు:

- సీఎంఏ కోర్సులో తొలి దశ.. ఫౌండేషన్ కోర్సు. ప్రతి ఏటా రెండుసార్లు సీఎంఏ ఫౌండేషన్ పరీక్షలు జరుగుతాయి. డిసెంబర్‌లో జరిగే పరీక్షలకు జూలై 31లోపు, జూన్‌లో జరిగే పరీక్షలకు జనవరి 31లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. సీఎంఏ ఫౌండేషన్ పరీక్ష మొత్తం ఎనిమిది సబ్జెక్టులలో నాలుగు పేపర్లుగా ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 100 మార్కులు చొప్పున 400 మార్కులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లోనూ ఆబ్జెక్టివ్,డిస్క్రిప్టివ్ విధానంలో ప్రశ్నలుంటాయి. 400 మార్కులకుగాను ప్రతి పేపర్‌లో 40 శాతం చొప్పున, అన్ని పేపర్లలో కలిపి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే.. తదుపరి దశ సీఎంఏ–ఇంటర్మీడియెట్‌కు అర్హత లభిస్తుంది.

సీఎంఏ–ఇంటర్మీడియెట్ ఇలా:

- సీఎంఏ ఫౌండేషన్ కోర్సును పూర్తి చేసిన సంవత్సరం తర్వాత.. సీఎంఏ ఇంటర్మీడియెట్ పరీక్షలకు అర్హత లభిస్తుంది. ఈ పరీక్షలను కూడా ప్రతి ఏటా రెండుసార్లు(జూన్, డిసెంబర్) నెలల్లో నిర్వహిస్తారు. జూన్‌లో పరీక్షలకు జనవరి 31లోపు, డిసెంబర్‌లో పరీక్షలకు జూలై 31 లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.
- సీఎంఏ పరీక్షల్లో రెండు గ్రూప్‌లు(గ్రూప్–1, గ్రూప్–2).. ఒక్కో గ్రూప్‌లో నాలుగు పేపర్లు ఉంటాయి. అంటే..రెండు గ్రూప్‌లకు కలిపి మొత్తం ఎనిమిది పేపర్లు, ఒక్కో పేపర్‌కు వంద మార్కులు కేటాయించారు. ఇలా రెండు గ్రూప్‌లు కలిపి మొత్తం 800 మార్కులకు సీఎంఏ ఇంటర్మీడియెట్ పరీక్ష జరుగుతుంది.
- రెండు గ్రూప్‌లలోనూ ప్రతి పేపర్‌లో 40 శాతం మార్కులతో మొత్తంగా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే.. సీఎంఏ కోర్సులోని తుది దశ సీఎంఏ ఫైనల్‌కు అర్హత లభిస్తుంది.

సీఎంఏ ఫైనల్:

- సీఎంఏ ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన తర్వాత 6 నెలల ప్రాక్టికల్ ట్రెనింగ్ కూడా పూర్తి చేసుకుంటే..సీఎంఏ ఫైనల్ పరీక్షలకు అర్హత లభిస్తుంది. ఫైనల్‌లోనూ రెండు గ్రూప్‌లు (గ్రూప్–3, గ్రూప్–4) ఉంటాయి. ఒక్కో గ్రూప్‌లో నాలుగు సబ్జెక్టులు/పేపర్లలో పరీక్ష ఉంటుంది. ఒక్కో సబ్జెక్ట్/పేపర్‌కు వంద మార్కులతో పరీక్ష నిర్వహిస్తారు. అంటే.. మొత్తం రెండు గ్రూప్‌ల్లో కలిపి ఎనిమిది పేపర్లలో 800 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఎనిమిదో పేపర్‌లో మూడు ఎలక్టివ్స్ ఉంటాయి.వీటిలో ఏదో ఒక దాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. రెండు గ్రూప్‌లలోనూ ఒక్కో పేపర్‌లో 40 శాతం మార్కు లు, మొత్తం అన్ని పేపర్లలో కలిపి 50 శాతం మార్కులు పొందితే.. సీఎంఏ కోర్సు పూర్తి చేసుకున్నట్లే!

ఉద్యోగావకాశాలు

సీఎంఏ కోర్సు పూర్తి చేసుకున్న వారికి కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో చీఫ్ ఇంటర్నల్ ఆడిటర్, కాస్ట్ కంట్రోలర్, చీఫ్ అకౌంటెంట్, ఫైనాన్షియల్ కంట్రోలర్ వంటి కీలకమైన కొలువులు లభిస్తాయి. ఇటీవల సీఎంఏ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో.. హెచ్‌సీఎల్, ఐడీబీఐ, ఐటీసీ, సిప్లా, జెన్‌ప్యాక్ట్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి సంస్థలు ఆకర్షణీయమైన పే ప్యాకేజ్‌లతో ఉద్యోగాలందించాయి.

కంపెనీ సెక్రటరీ కోర్సు

సీఏ, సీఎంఏలతోపాటు సీఈసీ గ్రూప్ విద్యార్థులకు మరో చక్కటి కోర్సు..కంపెనీ సెక్రటరీ(సీఎస్). ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా నిర్వహించే సీఎస్ కోర్సు మూడు దశలుగా ఉంటుంది.

సీఎస్ ఫౌండేషన్ కోర్సు

ఎగ్జిక్యూటివ్ ఎంట్రన్స్ టెస్ట్:

- సీఎస్ మూడు దశల్లోని మొదటి దశ పరీక్ష ఇది. ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవ్వొచ్చు. ఈ పరీక్ష ఏటా నాలుగు సార్లు(మే, జూలై, నవంబర్, జనవరి నెలల్లో) జరుగుతుంది. విద్యార్థులు ఏ నెలలో పరీక్ష రాయాలనుకుంటున్నారో.. ఆ పరీక్షకు ముందు నెల 15వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పరీక్షను మొత్తం రెండు వందల మార్కులకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహిస్తారు. మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్, వైవావోస్ విధానంలో పరీక్ష ఉంటుంది. బిజినెస్ కమ్యూనికేషన్, లీగల్ ఆప్టిట్యూడ్ అండ్ లాజికల్ రీజనింగ్, ఎకనామిక్స్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, కరెంట్ అఫైర్స్ సబ్జెక్ట్‌ల నుంచి మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 170 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రజెంటేషన్ ఆఫ్ కమ్యూనికేషన్ స్కిల్స్(వైవావోస్) పేరుతో 30 మార్కులకు ప్రత్యేకంగా మరో పరీక్ష ఉంటుంది. ఇలా మొత్తం 200 మార్కులకు జరిగే ఈ పరీక్షలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తేనే.. సీఎస్‌లోని రెండో దశ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌కు అర్హత లభిస్తుంది.

ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్:

- సీఎస్ ఫౌండేషన్ కోర్సులో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు.. సీఎస్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌కు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత తొమ్మిది నెలలకు ఎగ్జిక్యూటివ్ పరీక్ష రాసేందుకు అవకాశం లభిస్తుంది. సీఎస్ ఎగ్జిక్యూటివ్ రెండు మాడ్యూల్స్‌లో ఉంటుంది.
- మాడ్యూల్–1లో నాలుగు పేపర్లు,మాడ్యూల్–2లో నాలుగు పేపర్లు మొత్తం రెండు మాడ్యూల్స్ కలిపి ఎనిమిది పేపర్లు ఉంటాయి. ప్రతి పేపర్‌కు 100 మార్కులు. విద్యార్థులు ప్రతి పేపర్‌లోనూ 40 శాతం మార్కులతో అన్ని పేపర్లు కలిపి సగటున 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సీఎస్ తుది దశగా పేర్కొనే ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌కు అర్హత లభిస్తుంది.

ప్రొఫెషనల్ ప్రోగ్రామ్:

- సీఎస్ కోర్సులో తుది దశ ప్రొఫెషనల్ ప్రోగ్రామ్. ఇందులో మూడు మాడ్యూల్స్ ఉంటాయి. సీఎస్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసుకోవడంతో పాటు నిర్దేశిత వ్యవధిలో అప్రెంటీస్‌షిప్ ట్రెనింగ్ పూర్తి చేసుకున్న వారికి సీఎస్ ప్రొఫెషనల్ కోర్సులో నమోదు చేసుకునే అవకాశం లభిస్తుంది. మాడ్యూల్–1లో మూడు పేపర్లు, మాడ్యూల్–2లో మూడు పేపర్లు ఉంటాయి. మాడ్యూల్–3లో కూడా మూడు పేపర్లు ఉంటాయి. తొమ్మిదో పేపర్‌ను ఎలక్టివ్ పేపర్‌గా నిర్ణయించారు. విద్యార్థులు నిర్దేశిత అయిదు సబ్జెక్ట్‌లలో ఏదో ఒక సబ్జెక్ట్‌ను ఎలక్టివ్ పేపర్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. అలా ఎంచుకున్న సబ్జెక్ట్‌లోనే మూడో మాడ్యూల్‌లో తొమ్మిదో పేపర్‌గా పరీక్ష నిర్వహిస్తారు.
- మొత్తం మూడు మాడ్యూల్స్‌లో కలిపి 9 పేపర్లకు 900 మార్కులకు ఈ పరీక్ష జరుగుతుంది. ఒక్కో పేపర్‌లో 40 శాతం మార్కులతో అన్ని పేపర్లలో కలిపి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సీఎస్ సర్టిఫికెట్ చేతికందుతుంది.

కెరీర్ అవకాశాలు

కంపెనీ సెక్రటరీషిప్ కోర్సు పూర్తి చేసుకున్న వారు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కంపెనీ ప్రిన్సిపల్ సెక్రటరీ, కంపెనీ రిజిస్ట్రార్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్స్,ఫైనాన్షియల్ కన్సల్టెంట్స్‌గా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

బీకాం వినూత్నంగా

సీఈసీ విద్యార్థులకు తక్షణమే గుర్తొచ్చే బీకాంలోనూ ఇప్పుడు వినూత్న సబ్జెక్ట్ కాంబినేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. వీటిల్లో ముఖ్యమైంది.. బీకాం అనలిటిక్స్ కోర్సు. అదే విధంగా సీఈసీ విద్యార్థులు భవిష్యత్తులో మేనేజ్‌మెంట్ విభాగంలో రాణించేందుకు దోహదం చేసే బీబీఏ లేదా బీబీఎం కోర్సుల్లోనూ అడుగు పెట్టొచ్చు. ఎంకాంలోనూ..ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ వంటి వినూత్న స్పెషలైజేషన్లు పూర్తి చేసుకోవచ్చు. ఈ సర్టిఫికెట్లతో..కార్పొరేట్ రంగంలో ఆకర్షణీయ వేతనాలతో కొలువులు సొంతం చేసుకునే అవకాశం ఉంది.

క్లుప్తంగా...

రాష్ట్ర విభజనపై విచారణ వాయిదా

- ఆగస్టు 22కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజనపై దాఖలైన పలు పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. తెలంగాణ వికాసకేంద్ర, ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను రిజిస్ట్రీ మంగళవారం జస్టిస్ కె.ఎం.జోసెఫ్ , జస్టిస్ బి.వి.నాగరత్నలతో కూడిన ధర్మాసనం జాబితాలో చేర్చింది. మంగళవారం ఇతర పిటిషన్ల విచారణ కారణంగా రాష్ట్ర విభజన కేసు బెంచ్ ముందుకు రాకుండానే కోర్టు సమయం ముగిసింది. న్యాయమూర్తులు బెంచ్ మీదకు రాని కేసులు పరిశీలిస్తూ.. 'ఇది రాష్ట్ర విభజన కేసు కదా. చాలాకాలం కిందట జరిగిన పరిణామాలు మార్చాలని మీరు భావిస్తున్నారు (నవ్వుతూ). వేసవి సెలవుల అనంతరం విచారణ చేపడతాం. ఆగస్టు 22కు వాయిదా వేస్తున్నాం..' అని పేర్కొన్నారు.

దూరదర్శన్ న్యూస్ హెడ్‌గా కొండలరావు



సాక్షి, అమరావతి: విజయవాడ, విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రాల ప్రాంతీయ వార్తా విభాగాధిపతిగా పనిచేసిన డాక్టర్ గుత్తికొండ కొండలరావు (జీకే) పదోన్నతిపై విజయవాడ దూరదర్శన్ కేంద్రం న్యూస్ హెడ్(డిప్యూటీ డైరెక్టర్)గా బాధ్యతలు చేపట్టారు. దూరదర్శన్‌లోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. పశ్చిమ గోదావరి జిల్లా తిరుపతిపురం గ్రామానికి చెందిన జీకే జర్నలిజంలో డాక్టరేట్ చేశారు. ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతోపాటు రేడియో కార్యక్రమాల్లో విజయవంతమైన ప్రయోగాలు చేశారు. జీకే సేవలను గుర్తించిన తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా ఏప్రిల్ 14న విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో 'విశిష్ట సేవారత్న' పురస్కారంతో సత్కరించింది. ఆయన పనితీరు, సీనియారిటీతో దూరదర్శన్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది.

ఏసీబీకి చిక్కిన సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్

- రూ.1.80 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు
- బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.10 కోట్లు
- కర్నూలులోని ఆరు ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ తనిఖీలు



సుజాత ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

కర్నూలు: కర్నూలు కృష్ణానగర్‌లోని డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పి.సుజాతపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అక్రమాస్తుల కేసు నమోదు చేసింది. ఆమె నివాసం ఉంటున్న కర్నూలు శ్రీరామ్‌నగర్‌లోని నాగులకట్ట వద్దనున్న ఇంటితో పాటు బంధువుల ఇళ్లు, కోఆపరేటివ్ కార్యాలయంలో మొత్తం ఆరు చోట్ల ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు తేజేశ్వరరావు, కృష్ణారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, కృష్ణయ్య, ఇంతియాజ్ బాషా, వంశీనాథ్ తదితరులు బృందాలుగా ఏర్పడి మంగళవారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే దాకా విస్తృతంగా సోదాలు జరిపారు. వీటిలో అక్రమ స్థిర, చరాస్తులను గుర్తించారు. కర్నూలుకు చెందిన సుజాత 1993 డిసెంబర్ 9న జూనియర్ ఇన్‌స్పెక్టర్ హోదాలో కోఆపరేటివ్ శాఖలో ఉద్యోగంలో చేరారు. 1999లో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది కర్నూలు, ఆత్మకూరు ప్రాంతాల్లో పనిచేశారు. 2009లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందారు. ఆత్మకూరుతో పాటు కలెక్టరేట్‌లోని డీసీవో కార్యాలయంలో విధులు నిర్వర్తించారు. గత ఆరేళ్లుగా కర్నూలు కృష్ణానగర్‌లోని డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

సోదాల్లో గుర్తించిన అక్రమాస్తులు ఇవే..

కర్నూలులోని శ్రీరామ్ నగర్‌లో జి+2 ఇల్లు, అశోక్ నగర్‌లో జి+1 ఇల్లు, కస్తూరి నగర్‌లో ఒక ఇల్లు, బుధవారపేటలో జి+1తో పాటు సమీపంలోనే మరో వ్యాపార దుకాణం, కర్నూలు మండలం సుంకేసులలో 2.53 ఎకరాల వ్యవసాయ భూమి, కర్నూలు చుట్టుపక్కల 8 ఇళ్ల స్థలాలు, బ్యాంకు లాకర్‌లో 40 తులాల బంగారు నగలు, టాటా విస్టా కారు, హోండా యాక్టివా స్కూటీతో పాటు ఖరీదైన ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, రూ.8.21 లక్షల నగదుతో పాటు కొన్ని ప్రామిసరీ నోట్లు గుర్తింపు. డాక్యుమెంట్ ప్రకారం వీటి విలువ రూ.1.80 కోట్లు కాగా బహిరంగ మార్కెట్‌లో అక్రమాస్తుల విలువ రూ.10 కోట్ల పైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. దర్యాప్తు అనంతరం సుజాతను కర్నూలులోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు.

పటమట సబ్ రిజిస్ట్రార్ ఇంట్లోనూ సోదాలు

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పటమట సబ్ రిజిస్ట్రార్ అజ్జా రాఘవరావు కార్యాలయం, నివాసంతోపాటు మరో నాలుగు ప్రదేశాల్లో ఉన్న ఆయన బంధువుల నివాసాల్లో ఏసీబీ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయనికి మించి ఆర్జించిన స్థిర, చరాస్తులు ఆర్జించారన్న పక్కా సమాచారంతో ఈ సోదాలు చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి వరకు నిర్వహిస్తున్న సోదాలు బుధవారం కూడా కొనసాగనున్నాయి. అనంతరం తాము గుర్తించిన ఆదాయానికి మించిన ఆస్తుల వివరాలను వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

ఎన్టీఆర్‌కి వెన్నుపోటు పాపంలో రజనీకి వాటా





వైస్రాయ్ హోటల్ ఘటన సందర్భంగా చంద్రబాబు నాయుడుతో సినీ నటుడు రజనీకాంత్

- వైస్రాయ్ హోటల్‌లో చంద్రబాబుకు సహకారం
- మద్రాసు నుంచి వచ్చి మరీ మద్దతు
- నాడు ఎన్టీఆర్‌ను మరింత ఆవేదనకు గురిచేశారు
- నేడు దానికి కొనసాగింపుగా బాబు భజన
- తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి ధ్వజం

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్‌కి చంద్రబాబు వెన్నుపోటు పొడిచినప్పుడు రజనీకాంత్ కూడా ఆయనకి సహకరించారని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి ధ్వజమెత్తారు. ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడుతూ అప్పట్లో చంద్రబాబు ఒక పథకం ప్రకారం ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా వైస్రాయ్ హోటల్‌కి వచ్చేలా చేసి తర్వాత వారందరినీ తనకనుకూలంగా మార్చుకున్నారని తెలిపారు. ఎన్టీఆర్ బతికుండగానే ఆయనకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆ కార్యక్రమానికి రజనీకాంత్ పూర్తిగా సహకరించారని చెప్పారు. ఎన్టీఆర్‌కి వ్యతిరేకంగా వైస్రాయ్ హోటల్లో నిర్వహించిన సమావేశానికి రజనీకాంత్ మద్రాసు నుంచి వచ్చి మద్దతు ప్రకటించారని గుర్తుచేశారు. ఎన్టీఆర్‌ను నిజంగా అభిమానించి ఉంటే రజనీకాంత్.. చంద్రబాబుకు సహకరించాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. రాజకీయాలతో సంబంధం లేకపోయినా కేవలం చంద్రబాబు కోసమే అప్పటి కుట్రలో పాలుపంచుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా తీవ్రమైన ఆవేదనలో ఉన్న ఎన్టీఆర్‌ను మరింత ఆవేదనకు గురయ్యేలా చేశారన్నారు. చంద్రబాబు దొడ్డిదారిలో ఎన్టీఆర్ నుంచి అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు అప్పుడు ఆయనకు ఉపయోగపడిన రజనీకాంత్.. ఇప్పుడు ఎన్టీఆర్ శతజయంతి పేరుతో పెనమలూరు మండలంలో నిర్వహించిన సభలో మళ్లీ చంద్రబాబుకు మద్దతు పలుకుతూ భజన చేశారని చెప్పారు. రజనీకాంత్ అప్పుడూ ఇప్పుడూ కూడా ఎన్టీఆర్ మనోభావాలను గౌరవించలేదని, ఎప్పుడూ చంద్రబాబు కోసమే పనిచేశారని ఆమె పేర్కొన్నారు.

చంద్రబాబువి రాజకీయ శంకుస్థాపనలు

- ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు శిలాఫలకాలు
- భోగాపురం రన్‌వే భూమి వివాదాల్లో ఉండగా శంకుస్థాపన ఎలా చేస్తారు?
- రామాయపట్నం పోర్టుకి అనుమతుల్లేకుండానే శిలాఫలకం వేశారు
- సీఎం జగన్ అన్నీ పరిష్కరించి శంకుస్థాపనలు చేస్తున్నారు
- ఉత్తరాంధ్రను ఉత్తమాంధ్రగా తీర్చిదిద్దుతాం
- పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: చంద్రబాబు సీఎంగా ఉండగా రాజకీయ లబ్ధి కోసమే శంకుస్థాపనలు చేశారని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. ఆయన మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. రామాయపట్నం పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టుకు చంద్రబాబు 2019 ఎన్నికల నోటిఫికేషన్‌కు నెల ముందు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారని చెప్పారు. ఎయిర్‌పోర్టు రన్‌వేకి సంబంధించి 40 ఎకరాల భూమి కోర్టు వివాదాల్లో ఉండగా ఆయన ఎలా శంకుస్థాపన చేశారని ప్రశ్నించారు. రామాయపట్నం పోర్టుకి ఎలాంటి అనుమతులూ రాకపోయినా శిలాఫలకం వేశారన్నారు. భోగాపురం విమానాశ్రయం స్థల వివాదాలన్నింటినీ పరిష్కరించి, శంకుస్థాపన చేసిన మర్నాడే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రామాయపట్నం పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు, అదానీ డేటా సెంటర్ వంటి అనేక బృహత్తర ప్రాజెక్టులను చేపడతామని చెప్పారని, ఒక్కొక్కటీ కార్యాచరణలోకి తెస్తున్నారని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు 2025 సెప్టెంబర్‌కి పూర్తవుతుందన్నారు. విశాఖ – భోగాపురం ఆరు లేన్ల రోడ్డు అందుబాటులోకి వస్తే విశాఖ, విజయనగరం జంట నగరాలుగా మారతాయని తెలిపారు. వైజాగ్ టెక్‌పార్క్, ఐటీ పార్క్, రిక్రియేషన్ సెంటర్, స్కిల్ యూనివర్సిటీలకు కూడా సీఎం జగన్ బుధవారం శంకుస్థాపన చేస్తారన్నారు. ఇవన్నీ వస్తే విశాఖ నగరం దేశంలోనే ఆర్థికంగా అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్నా ఉత్తరాంధ్రకు ఏ మేలూ చేయని చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. ఆయన హయాంలో ఉత్తరాంధ్రను ఉత్త ఆంధ్రగా మార్చారని, సీఎం జగన్ ఉత్తమాంధ్రగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు.

రజనీకాంత్ అందుకే రాణించలేదు

రాజకీయాల్లో విమర్శలను భరించాలని, అది సాధ్యం కాకే సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయాల నుంచి వెనక్కి వెళ్లిపోయారని మంత్రి అన్నారు. 1995లో వైస్రాయ్ ఘటనలో రజనీకాంత్ పాత్ర ఉన్నందునే ఆయనపై చర్చ జరుగుతోందని చెప్పారు. ఈ విషయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడినవన్నీ వాస్తవాలేనని, రజనీకాంత్‌కు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

మహిళా సర్పంచ్‌పై టీడీపీ నాయకుల దాడి



రాజంపాలెంలో టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి

గోపాలపురం: తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం రాజంపాలెం గ్రామ సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మిపై టీడీపీ నాయకులు మంగళవారం దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే... గ్రామ పంచాయతీకి చెందిన దొమ్మర చెరువు వేలం గడువు గతేడాది జూలైతో ముగిసింది. అప్పటి నుంచి చెరువుకు వేలం నిర్వహించలేదు. గతంలో పాటదారుడు అధిక వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు గ్రామ పంచాయతీలో మొరపెట్టుకున్నాడు. దీంతో ప్రస్తుతం చెరువులో ఉన్న చేపలను తొలగించి పంచాయతీకి చెరువును అప్పగించాలని కార్యదర్శి, సర్పంచ్‌లు సూచించారు. దీంతో పాటదారుడు మంగళవారం చేపలు పడుతుండగా రాజంపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చెరువు వద్దకు చేరుకుని అడ్డుపడ్డారు. విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సిబ్బంది మాట వినకపోవడంతో వారు సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మికి సమాచారం ఇచ్చారు. చెరువు వద్దకు చేరుకున్న సర్పంచ్‌పై టీడీపీ నాయకులు దురుసుగా ప్రవర్తించారు. ఆమెను గెంటివేయడంతో చేతికి గాయం అయ్యింది. సర్పంచ్ భర్త కురుకూరి నాగేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని వారించినప్పటికీ టీడీపీ నాయకులు ఆయనపై కూడా దాడులకు దిగారు. దీనిపై గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి, ఆమె భర్త నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భానుమూర్తి @ సైకిల్ సవారీ

- 1966 నుంచి ఒకే సైకిల్ వాడకం
- ఎక్కడికైనా దానిపైనే ప్రయాణం
- ల్యాండ్ లైన్ ఫోన్‌పైనే ఆసక్తి
- 77 ఏళ్ల వయస్సులో ఉరకలెత్తే ఉత్సాహం
- ఇదీ విశ్రాంత అధ్యాపకుడు భానుమూర్తి జీవన శైలి



విజయవాడ రోడ్డుపై భానుమూర్తి ప్రయాణం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మంచి పనులు చేయాలని చెప్పడం తేలిక. వాటిని ఆచరించడం కష్టం. అయితే కొంత మంది ఆ పనులను ఆచరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తుంటారు. వారిలో ఒకరు వల్లభనేని భానుమూర్తి. ఆయన వయస్సు 77 ఏళ్లు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. విజయవాడ పటమటలంకలో స్థిరపడ్డారు. కాలేజీకి వెళ్లాలన్నా, కూరగాయలు తేవాలన్నా, ఇతర ఏ అవసరం వచ్చినా సైకిల్‌నే ఆశ్రయిస్తారు.

ఎక్కడికైనా సైకిల్‌పైనే...

భానుమూర్తి ఎక్కడికి వెళ్లాలన్నా సైకిల్‌నే ఉపయోగిస్తారు. 1966లో ఫిబ్రవరి చివరి శనివారం రోజు విజయవాడ సామారంగం చౌక్‌లోని ఒక సైకిల్ స్టోర్‌లో రూ.298లకు ర్యాలీ సైకిల్ కొన్నారు. ఆ సైకిల్‌నే నేటికీ ఉపయోగిస్తున్నారు. ఉద్యోగం చేసే సమయంలో కూడా కళాశాలకు సైకిల్‌పైనే వచ్చివెళ్లేవారు. మార్కెట్‌కు.. ఇతర పనులకు.. ఇలా ఎక్కడికైనా సైకిల్‌పైనే ప్రయాణిస్తారు. ఇప్పటికీ ప్రతి వారం రైతుబజార్, వన్‌టౌన్‌లో నిత్యావసర సరుకుల కొనుగోలు, కరెంట్ బిల్లులు, ఇంటి, నీటి పన్నులు చెల్లించేందుకు ఆయా కార్యాలయాలకు వెళ్లేందుకు సైకిల్‌నే వినియోగిస్తున్నారు. సంవత్సరానికి ఒకసారి సైకిల్‌కు సర్వీసింగ్ చేయిస్తారు.

ఇప్పటికీ విద్యార్థుల సేవలోనే..

భానుమూర్తి ఉద్యోగ విరమణ చేసి ఏళ్లు గడుస్తున్నా నేటికీ కళాశాలకు వచ్చి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తుంటారు. కళాశాలలో ఎలక్ట్రికల్ ల్యాబ్‌లో విద్యార్థుల బోధనకు అవసరమైన అధునాతన పరికరాలను పూర్వ విద్యార్థులు, స్నేహితుల ద్వారా కొనుగోలు చేయించి అందజేస్తున్నారు. తమకు చదువు చెప్పిన గురువు వచ్చి కళాశాల అభివృద్ధికి సాయం చేయమంటే పూర్వ విద్యార్థులు ఎలా కాదనగలరు. ఈ కారణంగానే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థులందరూ కలిసి ఇటీవల రూ.1.54 లక్షలతో విద్యుత్ రెక్టిఫైయర్‌ను కొనుగోలు చేసి కళాశాలకు అందజేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏటా ఎలక్ట్రికల్ విభాగంలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు భానుమూర్తి తన సొంత నిధులతో బహుమతులను అందజేసి ప్రోత్సహిస్తున్నారు.

సెల్‌ఫోన్ వద్దు.. ల్యాండ్ ఫోన్ ముద్దు

భానుమూర్తి మొదటి నుంచి సెల్‌ఫోన్‌ను దూరంగా ఉండాలని విద్యార్థులకు చెప్పడమే కాదు ఆయన దూరంగా ఉండి ఆచరించి చూపిస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ ల్యాండ్ లైన్ ఫోన్‌నే ఉపయోగిస్తున్నారు. సమయం దొరికినప్పుడల్లా గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలోని తన సొంత పొలంలో వ్యవసాయ పనులను పర్యవేక్షిస్తుంటారు.



బయటకు వెళ్లేందుకు సైకిల్ తీస్తున్న వల్లభనేని భానుమూర్తి

ఆరోగ్యమే కదా మహాభాగ్యం



ఆరోగ్యంగా ఉంటేనే కదా దేనినైనా సాధించగలిగేది. అందుకే మొదటి నుంచి సైకిల్ తొక్కడం అలవాటు చేసుకున్నా. నిత్యం 10 నుంచి 15 కిలో మీటర్లు సైకిల్ తొక్కడం వల్ల ప్రత్యేకంగా వ్యాయామం చేయాల్సిన అవసరం ఉండదు. విద్యార్థులు, స్నేహితులను కూడా సైకిల్ వాడాలని, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచిస్తుంటాను. చదువు చెప్పిన విద్యాసంస్థకు ఎంతోకొంత సాయం చేసే గుణాన్ని కూడా కలిగి ఉండాలని విద్యార్థులకు చెబుతుంటాను. పర్యావరణాన్ని కాపాడండి అని చెప్పడమే కాకుండా నా వంతు ప్రయత్నంగా సైకిల్‌ను వినియోగిస్తున్నా.

– వల్లభనేని భానుమూర్తి, విశ్రాంత అధ్యాపకుడు, విజయవాడ పాలిటెక్నిక్ కళాశాల

'కొలువు'దీరిన చదువు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చదువు పూర్తయ్యాక ఏ విద్యార్థీ ఉపాధి కోసం ఇబ్బంది పడకూడదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష ఇది. ఇందుకు అనుగుణంగా మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానంలో ఆయన ప్రభుత్వం వివిధ మార్పులు తీసుకు వచ్చింది. ముఖ్యంగా నైపుణ్యంపై బాగా ఫోకస్ పెట్టింది. దీంతో విద్యార్థులను వెతుక్కుంటూ కంపెనీలే రావడం మొదలైంది. పాలిటెక్నిక్ కళాశాలకూ ఇది విస్తరించింది. పదో తరగతి పూర్తయిన తరువాత పాలిటెక్నిక్ మూడేళ్లు చదవగానే సామర్థ్యాన్ని బట్టి ఉద్యోగం లభించేలా ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధ ఇందుకు దోహదపడింది. 'ఉద్యోగ విజయోత్సవం' పేరిట మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వేదికగా నిలిచింది. ఉద్యోగం పొందిన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను సత్కరించే కొత్త సంప్రదాయానికి నాంది పలికింది. కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ బ్రాంచిలకు చెందిన 215 మంది తృతీయ సంవత్సర విద్యార్థులు ఈ విజయోత్సవంలో పాల్గొన్నారు. వీరందరూ రూ.1.80 వేల నుంచి రూ.3 లక్షల వరకూ వార్షిక ఆదాయమున్న ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగ విజయోత్సవంలో ఎంపీ వంగా గీత, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కొడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ప్రిన్సిపాల్ జనార్దనరావు పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు.

ఆనందంగా ఉంది

సివిల్ విభాగంలో పాలిటెక్నిక్ ఆఖరి సంవత్సరం చదువుతున్నాను. తొలి ప్రయత్నంలోనే ఎస్‌డీపీపీఎల్ సంస్థలో రూ.1.50 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. జగనన్న విద్యాదీవెన వంటి పథకలతో పాటు ఉద్యోగాలు సాధించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ఆనందంగా ఉంది. – ఎ.యర్రమ్మ

రూ.3 లక్షల ప్యాకేజీతో..

మేధా సర్వో డ్రైవ్ రూ.3 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం ఆఫర్ చేసింది. ప్రభుత్వ కళాశాలకు ప్రైవేటు సంస్థలు వచ్చి ఉద్యోగాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. పాలిటెక్నిక్‌లో ఈసీఈ బ్రాంచి ఆఖరి సంవత్సరం చదువుతున్నాను. – కె.నిషిత

రేటు.. నాఫెడ్ రూటు



నాఫెడ్ కేంద్రాల్లో ఎండు కొబ్బరి కొనుగోలు (ఫైల్)

పడిపోయిన కొబ్బరి ధరలు ● కొనుగోలు కేంద్రాల కోసం డిమాండ్

- గిట్టుబాటు కాక గతంలో నాఫెడ్ కేంద్రాల్లో విక్రయించని రైతులు
- అధికారుల్లో నిరాసక్తత
- ఏర్పాటు చేస్తే మార్కెట్‌లో ధర పెరుగుతుందని రైతుల ఆశ
- నాలుగైదు రోజుల్లో అనుమతులు!

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: కొబ్బరి దిగుబడికి, ధరలు పెరిగేందుకు ఇది మంచికాలం. కానీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి దిగుబడి, అంబాజీపేట మార్కెట్‌లో ధరలు మాత్రం పెరగడం లేదు. గడచిన ఐదారు నెలలుగా కొబ్బరి కాయ ధరల్లో పెద్దగా పెరుగుదల లేదు సరికదా.. రెండు నెలలుగా మరింత తగ్గాయి. పచ్చికొబ్బరి, తయారీ కొబ్బరి, కురిడీ కొబ్బరి.. ఇలా ప్రతి రకం ధర మార్కెట్‌లో తక్కువగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వారు నేషనల్ అగ్రికల్చర్ కోపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్) కేంద్రాలు తెరవాలనే డిమాండ్ రైతుల నుంచి వస్తోంది.

జిల్లావ్యాప్తంగా 1,10,732 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. మరో 25 వేల ఎకరాలకు సరిపడా కొబ్బరి చెట్లు ఇళ్లు, కాలువలు, రోడ్ల వెంబడి ఉన్నాయని అంచనా. ఏటా సగటున 81.43 కోట్ల కొబ్బరి కాయ దిగుబడి వస్తోంది. కొబ్బరి ధర తగ్గిన సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నాఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు చేస్తాయి. ఈ కేంద్రాలు ఏర్పాటు చేసిన తొలినాళ్లలో కొనుగోళ్లు జోరుగా జరిగేవి. అయితే గత నాలుగు పర్యాయాలు వీటిని ఇక్కడ ప్రారంభించినప్పుడు కొనుగోళ్లు పెద్దగా జరగలేదు. గత రెండు పర్యాయాలూ ఒక క్వింటాల్ ఎండు కొబ్బరి సైతం కొనుగోలు చేయలేకపోయారు. వేసవి ముగిశాక ప్రారంభించడం, బహిరంగ మార్కెట్‌లో ధర పెరగడంతో రైతులు అమ్మకాలు చేయలేదు. ఈ కారణంగా ఈసారి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై నాఫెడ్ అధికారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కానీ రైతుల నుంచి వస్తున్న డిమాండ్ దృష్ట్యా కేంద్రాలను తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. కోనసీమలో ఎంత కొబ్బరి కొనుగోలు చేయవచ్చనే అంశంపై ఉద్యాన శాఖ నుంచి నాఫెడ్‌కు ప్రతిపాదనలు వెళ్లాయి. నాలుగైదు రోజుల్లో నాఫెడ్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే అవకాశమున్నందున తొందరలోనే కేంద్రాలు తెరిచే అవకాశముంది.

గిట్టుబాటు స్వల్పమే..

- ప్రస్తుతం క్వింటాల్ తయారీ కొబ్బరి ధర రూ.8,500. నాఫెడ్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే ఎండు కొబ్బరికి కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.10,590. అంటే వాస్తవంగా క్వింటాల్‌కు రూ.2 వేల వరకూ అదనంగా వస్తుంది. కానీ తయారీ కొబ్బరిని స్థానికంగా తయారు చేయాల్సి వస్తే అయ్యే ఖర్చు రూ.10,390. అంటే క్వింటాల్‌కు మిగిలేది రూ.200 మాత్రమే.
- ప్రస్తుతం వ్యాపారులు తయారు చేస్తున్న ఎండు కొబ్బరంతా దేవాలయాల నుంచి సేకరిస్తున్న చిప్పల నుంచి తయారు చేస్తున్నదే. దీనివల్ల దీని ధర తక్కువగా ఉంది. ఈ చిప్పలను ఆలయాల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో ఉత్పత్తి వ్యయం తక్కువ అవుతోంది. ఇతర ప్రాంతాల్లో రైతులు, వ్యాపారులు తయారు చేయాలంటే ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది.
- క్వింటాల్ ఎండు కొబ్బరి తయారీకి కనీసం 1,100 కాయలు ఉండాలి. ప్రస్తుతం మార్కెట్‌లో కొబ్బరి కాయ ధర సగటున రూ.7.20 చొప్పున క్వింటాల్ ఎండు కొబ్బరి తయారీకి రూ.7,900 అవుతుంది. రవాణా, ఎగుమతి, దిగుబడి ఖర్చులు మరో రూ.2,500 కలిపి క్వింటాల్‌కు మొత్తం రూ.10,400 వ్యయమవుతుంది. అంటే క్వింటాల్‌కు మిగిలేది రూ.190 మాత్రమే.
- ఏటా ఇదే పరిస్థితి. దీని వల్ల నాఫెడ్ కేంద్రాల వద్దకు వెళ్లి, ఎండు కొబ్బరి అమ్మేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి. అయినప్పటికీ ఈ కేంద్రాలు తెరిస్తే బహిరంగ మార్కెట్‌లో ధర పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. అందువల్లనే నాఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
- అయితే ఈ కేంద్రాల ఏర్పాటు వల్ల ఖర్చులు తప్ప కొనుగోలు ఉండటం లేదని నాఫెడ్ అధికారులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు సిబ్బంది కొరత వారిని పీడిస్తోంది. దీంతో కేంద్రాలకు అనుమతి వచ్చినా వెంటనే తెరిచే అవకాశం కనిపించడం లేదు.

నాలుగైదు రోజుల్లో అనుమతి

నాఫెడ్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి నాలుగైదు రోజుల్లో అనుమతి వచ్చే అవకాశముంది. అయితే మాకు సిబ్బంది కొరత ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని స్థానిక మార్కెట్ యార్డు సిబ్బంది సహకారం తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. వారి నిర్ణయం తరువాత కేంద్రాలను తెరుస్తాం.

– యు.సుధాకరరావు, నాఫెడ్ మేనేజర్, విజయవాడ

గతంతో పోలిస్తే అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో కొబ్బరి ధరలు పతనమయ్యాయి. ప్రస్తుత ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

కొత్త (తయారీ) కొబ్బరి	కురిడీ పాతకాయ గండేరా	గటగట	కొత్తకాయ గండేరా
8,500	12,000	10,000	11,000

గటగట	కొబ్బరి కాయలు (వెయ్యికి): పాత ముక్కుడు కాయ	కొబ్బరి కాయలు (వెయ్యికి): నీటికాయ (పచ్చి కాయ)
9,500	7,000 & 7,500	6,500 & 7,000

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943